ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

మీ నమ్మకమే మా తరగని సంపద
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-12-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 326 పేజీలు: 8+4 వెల: 6.50



### రవికుమార్ కుటుంబ సభ్యుల ఆస్తులపై
## హైకోర్టుకు ఏసిబి నివేదిక
### పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణిలో జరిగిన చోరీ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించిన నిందితుడు రవికుమార్‌తో పాటు ఆయన కుటుంబసభ్యుల ఆస్తులపై ఏసీబీ (అవినీతి నిరోధకశాఖ) ఒక మధ్యంతర నివేదికను విడుదలచేసింది. ఈ నివేదికను ఏసీబీ డీజీ ఇవాళ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సమర్పించారు. ఈ నివేదికను స్వీకరించిన హైకోర్టు, దానిని సవివరంగా పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులుజారీచేస్తామని స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవసరముందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. పరకామణిలో జరిగిన చోరీవ్యవహారంపై హైకోర్టులో శుక్రయవారం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు సంబం ధించిన దర్యాప్తు చాలా వరకు పూర్తి అయ్యిం దని, అయితే కొన్ని అంశాలపై ఇంకా విచారణ మిగిలి ఉందని పేర్కొన్నారు. అలాగే సుప్రీం కోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం, ఈ కేసులో పరిస్థితుల ఆధారంగా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన అవకాశం ఉందని హైకోర్టు అభిప్రా యపడింది. ఈ అంశాన్ని కూడా సీఐడీ పరిశీలించాలని సూచించింది. ఈ కేసుకు సం బంధించిన తదుపరి విచారణను 2026 జనవరి 5వ తేదీకి ఏపీ హైకోర్టు వాయిదా వేసింది. అప్పటికి ఏసీబీ నివేదికపై పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

### అమరావతిలో వివిధ సంస్థలకు
## 49.50 ఎకరాలు

**విజయవాడ, డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నగరంలో వేర్వేరు సంస్థలకు కొత్తగా 49.50 ఎకరాలు కేటాయించారు. దీనికి సంబంధించి పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బాసిల్ ఉడ్ స్కూలుకు నాలుగు ఎకరాలు, శాంటామారియా (సెయింట్ మేరీస్)కు 7.97 ఎకరాలు ఎకరం రూ.50 లక్షలు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో కేటాయించారు. సిఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్కు 15 ఎకరాలు, కాగ్‌కు 5 ఎకరాలు, ఎన్టీపిసికి 1.50 ఎకరాలు, జ్యుడీషియల్ అకాడమీకి 4.83 ఎకరాలు, కాస్మోస్కు 5 ఎకరాలు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, పిఎన్బీ, ఐడిబిఐ 40 సెంట్లు చొప్పున భూమి కేటాయించారు. ఎన్ఎసికి 5 ఎకరాలు 60 ఏళ్ల లీజుకు ఎకరం 4.1 కోట్ల చొప్పున ప్రీమియం నిర్ణయించారు. గతంలో వేర్వేరు సంస్థలకు కేటాయించిన 42.30 ఎకరాలకు సంబంధించి సర్వే నెంబర్లలో స్వల్ప మార్పులు చేశారు. బ్యాంకులు, వేర్వేరు ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు 12.66 ఎకరాలు ఎకరం రూ.4.1 కోట్ల చొప్పున ప్రీమియం నిర్ణయించి ఇచ్చారు. 2014-19 మధ్యలో భూములు కేటాయించిన సంస్థలకు >>2

# 'సూపర్ పవర్' ఖాయం

### వేల యేళ్ల క్రితమే ప్రపంచానికి నాగరికతను పరిచయం చేసిన దేశం మనది
### ఆర్ఎస్ఎస్ చీఫ్ చేస్తున్న కృషి శ్లాఘనీయం
### తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సులో సిఎం చంద్రబాబు



శుక్రవారం తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్,కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ తదితరులు

**తిరుపతి, డిసెంబరు 26 ప్రభాతవార్త:** భారతదేశం త్వరలోనే సూపర్ పవర్ కావడం ఖాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తిరుపతిలో భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ప్రారంభ సదస్సుకు సిఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వివిధ యుద్ధ పరికరాల నమూనాలను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సిఎం సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 'సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ దేశాభివృద్ధి కోసం ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కృషి చేస్తున్నారు. మన దేశం, భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ మంచి వేదిక. ప్రాచీన కాలంలోనే భారతదేశం >>2



## పాఠశాలలకు జనవరి 10 నుంచి సంక్రాంతి సెలవులు

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ సందర్భంగా ఏపి ప్రభుత్వం విద్యార్థులకు తీపి కబురు చెప్పింది. ఈ మేరకు రాష్ట్రం లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులను ఖరారు చేస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ >>2

# టోకెన్లు ఉంటేనే 'వైకుంఠం'

### తొలి మూడురోజులు కఠినంగా అమలు
### జనవరి 2నుండి అందరికి 'సర్వదర్శనం'
### సిఫారసులు స్వీకరించరన్న టిటిడి



**తిరుమల,డిసెంబరు 26ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు జరిపించుకునే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనానికి డిసెంబర్ 30, 31,జనవరి 1మూడురోజులు టోకెన్లు ఉన్న భక్తులనే ఆలయం లోపలకు అనుమతించేలా టిటిడి చర్యలు తీసుకుంది. ఆ రోజులతో బాటు జనవరి 8వరకు ఎలాంటి సిఫార్సులేఖలు కూడా స్వీకరించరు. వైకుంఠ ఏకాదశి పర్వదినం డిసెంబర్ 30న ద్వాదశి 31నటోకెన్ కలిగిన భక్తులతోబాటు రాజ్యాంగహోదాలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే దర్శనాలు కల్పిస్తారు. జనవరి 2నుండి 8 వరకు సామాన్యభక్తులకు సర్వదర్శనంలో వారం రోజులు(జనవరి 8వరకు) వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు. గోవిందమాల >>2

### రక్తం చిందిన రోడ్లు
## ఆళ్లగడ్డవద్ద ప్రమాదంలో నలుగురు మృతి
### నల్లపాడు వద్ద మరో ఘటనలో ముగ్గురు దుర్మరణం

**నంద్యాల/గుంటూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో శుక్రవారం రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు, క్షతగాత్రులంతా తెలంగాణ వాసులు. వివరాల్లోకి వెళితే నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం బత్తలూరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. క్వాలిస్ వాహనం ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి, అవతలి వైపు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సును ఢీకొంది. ఈ ఘటనలో క్వాలిస్ వాహనం నుజ్జునుజ్జు అయ్యింది. క్వాలిస్‌లో ఉన్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్వాలిస్‌లో ఇరుక్కున్న మృతదేహాలను తొలగించి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు. మృతులు, క్షతగాత్రులు హైదరాబాద్ వాసులుగా >>2



Visakhapatnam: Varun Motor - Siripuram: 9966739777, Pendurthi: 7799224440 Gajuwaka: 7799122258, Muralinagar: 9052267733 | Jayabheri Automotives Maddilapalem : 8008333557, Gopalapatnam :7780636899 | Srikakulam: Varun Motor : 8886521999 | Vizianagaram: Jayabheri Automotives : 8886662205 | Rajahmundry: SB Motor(Auto nagar) : 9885173738 | Varun Motors(Hukumpeta) : 8886616717 | Kakinada: SB Motor : 8886661920.

*నిబంధనలు మరియు షరతులు వర్తిస్తాయి. వివరణాత్మక నిబంధనల కోసం దయచేసి సమీపంలోని డీలర్‌షిప్‌ను సందర్శించండి. **ధృవీకరించబడిన కారు చరిత్ర & వారంటీ True Value ధృవీకరించబడిన కార్లపై వర్తిస్తుంది. ఉచిత సర్వీస్ లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తుంది. ఉపయోగించిన చిత్రాలు దృష్టాంత ప్రయోజనాల కోసం మాత్రమే.





రాష్ట్రీయ బాలపురస్కారం అవార్డులు అందజేస్తున్న ద్రౌపది ముర్ము పక్కన అవార్డు గ్రహీత ఏపీకి చెందిన పారా అథ్లెట్ శివాని

## పారా అథ్లెట్ శివానీకి రాష్ట్రీయ బాలపురస్కారం

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ రాజధాని ఢిల్లీలో వీర్ బాల్ దివస్ ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన పిల్లలకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఏపీకి చెందిన పారా అథ్లెట్ శివాని రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్నారు. శివాని స్వస్థలం ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా మద్దికెర గ్రామం. గత నాలుగేళ్లగా జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ్మ ప్రతిభ కనబరుస్తున్నందుకు శివానిని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన శివాని పుట్టుకతోనే ఆమె కుడిచేయి మోచేతి వరకే ఉంటుంది. అయినప్పటికీ ఆమె తల్లిదండ్రులు ఆమె భవిష్యత్ కోసం ఎంతో కష్టపడ్డారు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు క్రీడల్లో కూడా ఎంతో ఉత్సాహం కనబరిచేది. నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రోత్సాహంతో హైదరాబాద్‌లోని ఆదిత్యమెహతా ఫౌండేషన్‌లో శివాని పారా అథ్లెటిక్స్‌లో శిక్షణ తీసుకుంటోంది. 2023లో విశాఖలో జరిగిన దివ్యాంగుల పోటీల్లో జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో శివాని బంగారు పతకాలు సాధించింది. ఆపై జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికై అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ శివాని పతకాలను సాధించింది. దుబాయిలో జరిగిన పారా యూత్ ఏసియన్ గేమ్స్, ఢిల్లీలో జరిగిన గ్రాండ్ ప్రిక్స్ పోటీల్లో కూడా పాల్గొని తన సత్తా చాటింది శివాని. అలాగే తెలంగాణకు చెందిన పడకంటి విశ్వనాథ్ కార్తికేయకు రాష్ట్రపతి ముర్ము రాష్ట్రీయ బాల పురస్కార్ అందించారు. విశ్వనాథ్ కార్తికేయ తెలంగాణ మేడ్చల్ మల్కాజ్‌గిరి వాసి.

## అక్రమ ఆలయ నిర్మాణంపై హైకోర్టు సీరియస్

### పలువురు అధికారుల సస్పెన్షన్, ఆర్డీవో, డీఎల్పీఓలకు షోకాజ్ నోటీసు జారీ చేసిన కలెక్టర్

**భీమవరం(విజయవాడ) డిసెంబరు 26.ప్రభాతవార్తప్రతినిధి:**పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామంలో ప్రభుత్వ/జిల్లా పరిషత్ రహదారి భూమిపై అనధికారంగా విగ్రహ ప్రతిష్ఠ, శివాలయం నిర్మాణం జరగడంపై పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చాదలవాడ నాగరాణి తీవ్రంగా స్పందించారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన పలువురు అధికారులను సస్పెండ్ చేస్తూ ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంలో కలెక్టర్, పశ్చిమ గోదావరి ఎస్పీకి రాసిన లేఖలో తక్షణమే స్థానిక సీఐ, ఎస్ ఐ లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యవేక్షణలో లోపాలపై తాడేపల్లిగూడెం ఆర్డీవోకు, అలాగే డీఎల్పీవోకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎందుకు విఫలమయ్యారో వివరణ కోరినట్లు కలెక్టర్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో సమర్పించిన నివేదికను పరిశీలించిన కలెక్టర్, పనులు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. ఈ భూమి జిల్లా పరిషత్‌కు చెందినదని, విగ్రహ ప్రతిష్ఠకు లేదా ఆలయ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆర్డీవో నివేదికలో పేర్కొన్నారు. హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు, జిల్లా పరిపాలన పునరావృత సూచనలు ఉన్నప్పటికీ, ఆర్.ఎస్. నం.7 13బి (0.13 సెంట్లు) ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణం కొనసాగింది. దీనివల్ల హైకోర్టులో దావాలు నమోదయ్యాయు. ఈ నేపథ్యంలో ప్రతిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి జె. నాగేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో వై.వి.ఆర్. వరప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి వసంసెట్టి ఉమాదేవి, పెంటపాడు తహసీల్దార్ టీ. రాజా రాజేశ్వరి విధుల్లో నిరక్ష ్యం వహించారని పేర్కొంటూ కలెక్టర్ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల క్షేత్రస్థాయి యంత్రాంగం సమన్వయం లేకపోవడం వల్లే హైకోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగిందని కలెక్టర్ వ్యాఖ్యానించారు. అవసరమైన బందోబస్తు, రక్షణ కల్పించడంలో విఫలమవడం జిల్లా పరిపాలనను దావాలకు గురిచేసిందని తెలిపారు. ఈ నిరక్ష ్యం ప్రభుత్వ ఉద్యోగులకు తగినది కాదని, విధుల పట్ల బాధ్యతారాహిత్యంగా పరిగణించబడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా భూముల రక్షణ, న్యాయస్థాన ఆదేశాల అమలు విషయంలో ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని హెచ్చరిస్తూ, సస్పెండ్ అయిన అధికారులపై శాఖాపరమైన విచారణలు ప్రారంభించాలని స్పష్టం చేసారు.

## 50యేళ్లు దాటిన మత్స్యకారులకు పెన్షన్

### మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

**విజయవాడ,డిసెంబరు 26.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్యకారులకు శుభవార్త తెలిపింది. మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక నిర్ణయాలు తీసుకుంటున్న ఏపీ ప్రభుత్వం తాజాగా మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరచడానికి మరో మరో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఇక ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రకటించారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మత్స్యకారులకు 50 సంవత్సరాలు వయసు నిండిన తర్వాత పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కేంద్రం సహకారంతో మత్స్యకారులకు రాయితీ పైన వివిధ రకాల పరికరాలను అందిస్తున్నామని, అందులో భాగంగానే ఇంజన్లు, తెప్పలు, వలలు, పడవలు వంటివి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హులైన మత్స్యకారులు గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మత్స్యకారులకు రాయితీ పైన వివిధ రకాల పరికరాలు ఈ పథకంలో భాగంగా ఓబిసి వర్గాలకు 40 రాయితీ లభిస్తుందని, ఎస్సీ ఎస్టీ వర్గాలకు 60 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తుంది. రాయితీ క్రింద వేటకు సంబంధించిన సబ్సిడీ పరికరాలు పొందాలి అంటే మత్స్యకారులకు సొంత బోటుతో పాటు సంబంధిత లైసెన్సు తప్పనిసరి. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని మత్స్యకారులు డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వ మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకువస్తుందని చెప్పిన ఆయన మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో ఆటోలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఉదాహరణకు రెండు లక్షల రూపాయల విలువైన ఆటో కొనుగోలు పైన 80 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. గతంలో మత్స్యకారుల కుటుంబాలకు 4500 రూపాయల ఆర్థిక సహాయం అందిస్తే, ప్రస్తుతం వేటకు వెళ్లే మత్స్యకారులకు 20 వేల రూపాయలకు అది పెంచామని పేర్కొన్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన బాలల సమ్మేళనంలో పాల్గొన్న ప్రధాని మోదీ

## కలలతో ఎదగండి

### 'రేపటి పౌరుల'తో ప్రధాని మోదీ

**దేశ అభివృద్ధి బాణాలు మీరే..**

**జెన్‌జడ్, జెన్ అల్ఫా తరాలకు ప్రధాని పిలుపు**

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** జెన్ జెడ్, జెన్ అల్ఫా తరాలు తమ కలలతో ఎదగాలని, సూత్రాలపై దృష్టి పెట్టాలని, భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశ హోదా వైపు నడిపించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. యువతకు వివిధ రంగాల్లో అపార మైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. వీర్ బల్ దివాస్ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన బాలల సమ్మేళనంలో యువ భారతీయులనుద్దేశించి ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ, సాహిబ్జాదాస్-జోరావర్ సఇంగ్, ఫతేసింగ్‌ల అసమాన ధైర్యసాహసాలు, జాతీయ ఆదర్శాల నుండి ప్రేరణ పొందాలని యువతకు పిలుపునిచ్చారు. వయస్సుతో సంబంధం లేకుండా పెద్ద సవాళ్లను ఎదుర్కోవాలని మోడీ యువతకు సలహా ఇచ్చారు. సంస్కృతంలో ఒక శ్లోకాన్ని ఉటంకిస్తూ, "ఒక చిన్న పిల్లవాడు జ్ఞానం గురించి మాట్లాడితే, మనం దానిని స్వీకరించాలి" అని సూచించారు. "మీరు చిన్న వయసులోనే పెద్ద పనులు చేయగలరు. మీరు దాన్ని సాధించారు. కానీ ఈ విజయాలను భిన్నంగా చూడాలి. మీ కలలను ఆకాశానికి ఎత్తండి. దేశం దృఢ సంకల్పంతో మీతో ఉంది" అని ప్రధాని పేర్కొన్నారు. "గతంలో, యువత కలలు కనడానికి భయపడేవారు, ఎందుకంటే పాత వ్యవస్థ నిరాశా వాతావరణాన్ని కలిగించింది. కానీ ఇప్పుడు, దేశం ప్రతిభ కోసం వెతుకుతోంది. 140 కోట్ల మంది పౌరుల శక్తితో బలోపేతం చేయబడిన వేదికలను అందిస్తుంది" అని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఇంటర్నెట్, స్టార్టప్ మిషన్లు, కేంద్రీకృత వృద్ధికి వేదికల వంటి వనరులను ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి, ఇంటర్న్ షిప్‌లు, క్రీడా ప్రోత్సాహం, ఫిన్‌టెక్, తయారీ, యువ భారత్ వేదికల వంటి విధానాలకు యువత కేంద్రంగా ఉండటంతో, వ్యక్తిగత విజయం ఇతరులకు స్ఫూర్తినివ్వాలని అన్నారు. స్వల్పకాలిక ప్రజాదరణ (పాపులారిటీ) వల్ల యువత పరధ్యానానికి గురికావద్దని ప్రధాని మోడీ సలహా ఇచ్చారు. దేశ నిర్మాణానికి సహకరించిన మహానుభావుల నుంచి, గొప్పవ్యక్తులనుంచి ఆదర్శాలను, మంచి విషయాలను నేర్చుకోవాలని సూచించారు.

# టోకెన్లు ఉంటేనే 'వైకుంఠం'

>> భక్తులకు కూడా దర్శన టిక్కెట్లు, టోకెన్లు ఉంటేనే ఆలయంలోనికి అను మతిస్తారు. ఈనెల 30వతేదీ నుండి జనవరి 8వరకు పదిరోజుల పాటు స్వయంగా వచ్చే వీఐపీలకు మినహాయించి మరెవ్వరికీ వీఐపి దర్శనాలు ఉండవు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలకు సమయం సమీపిస్తోంది. ఇందుకు సంబంధించిన టీటీడి అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకా దశి 30వతేదీ, ద్వాదశిని 31వతేదీ నిర్వయం చారు. కలియుగవైకుంఠవాసుడు కొలువైన ఆల యంలో 30వతేదీ తెల్లవారుజామున 1.30గం టలకు వైకుంఠద్వారం తెరచుకోనుంది. భక్తులకు సంతృప్తికర దర్శనం చేయించేలా టీటీడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టీటీడి ఇఒ. అనిల్‌కుమార్‌సిం ఘాల్, అదనపు ఇఒ. చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వయంగా పర్యవేక్షిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పదిరోజులపాటు దాదాపు 9లక్షల మంది భక్తులు ఆరోజుల్లో వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా చూడనున్నారు. తొలిమూడురోజులు దర్శన టోకెన్లు లేని భక్తులను ఆలయం లోపలకు అనుమతించరు. రాజ్యాంగ పరిధిలోని ప్రోటోకాల్ వీఐపీలు స్వయంగా వస్తేనే పరిమితంగా బ్రేక్ దర్శనాలు జారీ చేస్తారు. భారీ క్యూలైన్లు నివారించి గరిష్ట సం ఖ్యలో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు కేటాయించిన టైమ్‌స్లాట్ టోకెన్లలో నిర్దేశిత సమయానికే క్యూలైన్లలోనికి చేరుకోవాలని సూచిస్తున్నారు.3వేలమంది యువ శ్రీవారిసేవకులను, అవసరమైన పోలీసులను నియమించి కునివారి సేవలను క్యూలైన్ల నిర్వహణకు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో కేటాయించిన దర్శనాలకు సంబంధించి 300రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.20 లక్షల టిక్కెట్లు, శ్రీవాణి వీఐపి బ్రేక్ దర్శనాలను రోజుకు వెయ్యి టిక్కెట్లు వారంరోజులకు ఎని మిదివేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో భక్తులు అందు కున్నారు. అందరికీ మహాలఘులో వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తారు. 30వతేదీ ఉదయం స్వర్ణరథం, 31నఉదయం చక్రస్నాన మహోత్సవం జరుగుతాయి.

# 'సూపర్ పవర్' ఖాయం

>> విజ్ఞానాన్ని సము పార్జించిన దేశంగా పరిఢవిల్లింది. ఎన్నో వేల ఏళ్ల క్రితమే అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో హరప్పా నాగరికత ద్వారా చాటి చెప్పాం. 2900 ఏళ్ల క్రితమే యోగాభ్యాసం చేశాం ఇప్పుడు 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయి. యోగా పాటిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది. ప్రధాని మోడీ నేతృత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రికార్డు స్థాయిలో నిర్వహించాం. 2600 ఏళ్ల క్రితమే భారత దేశం ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించింది. పూర్వ కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తక్షశిల విశ్వ విద్యాలయం నిర్మించుకున్న దేశం మన భారత దేశం. 1600 ఏళ్ల క్రితమే నలంద యూనివర్శిటీ ద్వారా ఆధునిక విద్యను అందించిన ఘనత మనది... జీరోను భారతీయులే కనుగొన్నారు. మెదడుకు పదును పెట్టే చదరంగ క్రీడను కనిపెట్టిన ఘనత కూడా మన భారతీయులదే. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన నిపుణులు మన భారత దేశం సొంతం. అస్ట్రానమీలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్ప వారున్నారు. వీళ్లందరూ మనకు స్ఫూర్తిని కలిగించేలా చరిత్ర సృష్టించారు' అని ముఖ్య మంత్రి గుర్తు చేశారు.

**2 వేల ఏళ్ల క్రితమే అగ్రదేశంగా భారత్..** 'మన భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు మరింత విస్తృత పరిచేందుకు భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ అద్భుతంగా కృషి చేస్తోంది. దక్షి ణ భారత దేశంలో ఏడవ భారతీయ విజ్ఞాన్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం ఆనందంగా ఉంది. పవిత్ర ప్రాం తమైన తిరుపతిలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు వేంకటేశ్వర స్వామి ఆశీస్సు లు ఉంటాయి. అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, స్పెయిన్, జర్మనీ, రష్యా, జపాన్ వంటి దేశాల్లో 2 వేల ఏళ్ల క్రితం భారత దేశానికంటే ఎంతో వెనుకబడి ఉన్నాయి. 2 వేల ఏళ్ల క్రితం ప్రపంచంలోనే భారత దేశం 40 శాతం జీడీపీని కలిగి ఉండేది. నాలెడ్జ్ ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్ గానే ఉండేది కానీ విదేశీ పాలన, స్వాతం త్రం వచ్చాక మనం చేసుకున్న కొన్ని పాలసీల వల్ల దేశం ఇబ్బంది పడింది. 1991లో ఆర్థిక సంస్కరణలు వచ్చాయి. ఐటీ రెవల్యూషన్ అంది పుచుకున్నాం. వివిధ దేశాల్లోని ప్రముఖ సం స్థలకు భారతీయులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్1 స్థానంలో నిలుస్తుంది. ప్రతి జంట ముగ్గురు పిల్లలు కనాలని మోహన్ భగవత్ చెబుతున్నారు... నేనూ అదే చెబుతున్నా. ఇప్పుడు మన జనాభానే ఆస్తిగా మారారు. కొన్ని దేశాలు వయోభారం సమస్యతో ఇబ్బంది పడుతున్నాయి. మనకు ఆ ఇబ్బంది లేదు. తిరుగులేని యువశక్తితో కూడిన దేశం మనది. ఈ సంపదే మన దేశాన్ని అగ్ర భాగంలో నిలుపుతుంది. భారతదేశం నెంబర్1 స్థానంలోకి వెళ్లనున్న సందర్భంలోనే పేదధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సి న అవసరం ఉంది. గంగాకావేరీ నదుల అనుసంధానం అనేది జరగాలి... అప్పుడు నీటి భద్రత కలుగుతుంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత దేశం ఛాంపియన్. దేశాభివృద్ధికి వాజ్ పేయి పునాదులు వేశారు... ఇప్పుడు ప్రధాని నరేంద్ర అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. వినూత్న ఆలోచనలు చేయాలి... కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి. భారత దేశం భవిష్యత్తులో సూపర్ పవర్ గా మారబోతోంది. ఇదే సమయంలో దేశాన్ని ప్రపంచ దేశాల ముందు ప్రత్యేకంగా నిలబట్టేంది మన విలువలు, సంప్రదాయాలే. ఆ దిశగా మోహన్ భగవత్ కృషి చేస్తున్నారు. విలువలు, నైతికత వంటి అంశాలనుపెంపొందించేందుకు మోహన్ భగవత్ గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నారు. భారతదేశంలో అందరికీ భద్రత కల్పిం చేలా మన కుటుంబవ్యవస్థ ఉంటుంది. మన పురాణాల గురించి పిల్లలకు సోదాహరణంగా వివరించాలి. మన పురాణ పురుషుల గొప్పదనాన్ని యువతకు తెలియచెప్పాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు. ఎపిలో టెక్నాలజీ సహా వివిధ రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలు చేపడుతున్నాం. క్వాంటం, ఏఐ వంటివాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో ఎపిని అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఎపి నుంచి క్వాంటం కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నాం అని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండియాస్‌నాలెడ్జ్ సిస్టమ్స్ అనే పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్, రెవిన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్ర సాద్, ప్రొఫెసర్ భారత్, డాక్టర్ సతీష్ రెడ్డి,సంస్కృత విద్యాపీఠం కులపతి జిఎస్ఆర్కే శాస్త్రి పాల్గొన్నారు.

## 49.50 ఎకరాలు

>>సంబంధించి 16.19 ఎకరాల్లో స్వల్ప మార్పులు చేశారు. ఇందులో డిఎవి స్కూలుకు ఎకరం రూ.50లక్షల చొప్పున ఇచ్చారు. ఎఫ్సి ఐకి ఎకరం రూ.4 కోట్లు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధ తిలో కేటాయించారు. కాంధారి హోటల్సు ఎక రం రూ.1.50కోట్లు, కినారా గ్రూపునకు ఎకరం రూ.1.50 కోట్లు చొప్పున ఫ్రీహోల్డ్ పద్ధతిలో ఇచ్చారు.

## 10 నుంచి సంక్రాంతి సెలవులు

>> చేసింది. జనవరి 10వ తేదీ నుంచి 18 వరకు అంటే ఏకంగా 9రోజుల పాటు అన్ని సెలవులు ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పండుగ తర్వాత జనవరి 19నుంచి పాఠశాలలు తిరిగి ప్రారం భమవుతాయని విద్యార్థులు, వారి తల్లి దండ్రులకు సూచించారు. ఇక కళాశా శాలల సెలవులపై అధికారిక ప్రకటన వెలువరించాల్సి ఉంది. అటు తెంగాణ లోనూ స్కూళ్ళకు ఇవే తేదీల్లో సెలవులు ప్రకటించే అవ కాశం ఉంది. సంక్రాంతి పండుగ ఈ సెలవులు రావడం వల్ల విద్యార్థులు తమ సొంత ఊర్లకు వెళ్ళడానికి, కుటుంబంతో గడపడానికి మంచి అవకాశం లభిస్తుంది.

## రక్తం చిందిన రోడ్లు

>> క్యాటరింగ్ సిబ్బందిగా గుర్తించారు. యాత్రకు వెళ్తే వారి కోసం వంట చేసేందుకు వెళ్లిన క్యాటరింగ్ చేస్తుంటారు. మృతులు గుండెరావు, శ్రవణ్, నరసింహా, బన్సీగా గుర్తించారు. అలాగే గాయపడిన వారు శివసాయి,



సిద్ధార్థలు. హైదరాబాద్ నిజాం కాలేజీలో విద్యనభ్యసిస్తున్నారు. గత 15 రోజులుగా యాత్ర చేస్తున్న బస్సుకు వంట చేసేందుకు గుండెరావు టీం వెళ్లి, తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంకిరెడ్డిపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులను తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన సుశీల(64), వెంకయ్య(70), మహేష్(28)గా గుర్తించారు. తిరుపతి నుంచి తిరిగి వస్తుండగా ఈఘటన చోటుచేసుకుంది. మృతదేహాలను నల్లపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి బాలపురస్కారం

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాన్ని యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అందుకున్నారు. రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా 14 ఏళ్ల ఆ క్రికెటర్ అవార్డును స్వీకరించారు. ఢిల్లీలో శుక్రవారంజరిగిన పురాస్కారాల ప్రధాన కార్యక్రమంలో ధైర్యసాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బాల పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తారు. రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవార్డు స్వీకరించే క్రమంలో క్రికెటర్ వైభవ్ ఇవాళ మ్యాచ్‌కు దూరం అయ్యాడు. వాస్తవానికి బీహార్, మణిపూర్ మధ్య ఇవాళ విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్ జరుగుతున్నది. కానీ ఆ మ్యాచ్‌లో వైభవ్ ఆడడం లేదు. 5 నుంచి 18 ఏళ్ల ఉన్నవారికి బాల్ పురస్కారాలు అందజేస్తారు. వైభవ్‌తో పాటు మొత్తం 19 మంది పిల్లలకు వివిధ రంగాల్లో అవార్డులను అందజేయనున్నారు. మీరు సాధించిన ఘనత యావత్ దేశానికి ప్రేరణగా నిలుస్తుందని, ఇవాళ గుర్తింపు పొందిన ప్రతి చిన్నారి చాలా ముఖ్యమైన , విలువైన వ్యక్తులు అని, అలాంటి నైపుణ్యం ఉన్న పిల్లల వల్లే ప్రపంచవ్యాప్తంగా దేశానికి గుర్తింపు వస్తున్నదని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

# అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల అరెస్ట్

### కీలక నిందితుడు వియత్నాం దేశీయుడు

### పెద్ద ఎత్తున 14సిమ్ బాక్సులు, 1500 సిమ్ కార్డులు, పలు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు స్వాధీనం: సిఐడి డిజి ఆసిఫ్ ఖాన్



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిఐడి డిజి ఆసిఫ్‌ఖాన్

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ నేరాలకు పాల్పడే ముఠా గుట్టురట్టు చేసిం ది ఏపీసీఐడీ. ఈ ముఠాలో కీలకమైన వియ త్నాం దేశీయుడితో పాటు మరికొందర్ని అరెస్టు చేసింది. పెద్ద ఎత్తున 14 సిమ్ బాక్సు లు, 1500 సిమ్ కార్డులు, పలు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐడీ డీజీ ఆసిఫ్ ఖాన్ తెలిపారు. ఈ తరహా మోసం ద్వారా సైబర్ నేరాలకు పాల్పడి భారీ మొత్తాల్లో సొత్తు కొల్లగొట్టడమే కాకుండా, కాల్స్ రూటింగ్ ద్వారా టెలికం కంపెనీలకు పెద్ద ఎత్తున నష్టం కలిగిం చినట్లు సీఐడీ దర్యాప్తులో తేల్చింది. కాంబోడియా కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడే ముఠా దీని వెనక ఉన్నట్లు గుర్తించింది. నిందితుల నుంచి వేల సంఖ్యలో సిమ్ కార్డులతో పాటు, పలు కంప్యూ టర్‌లు, ఇతర సాంకేతిక పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను, వారి నుం చి స్వాధీనం చేసుకున్న పరికరాలు శుక్రవారం డిఐజీ(సిఐడిబ్లాక్) కార్యాలయంలో మీడియా ఎదుట ప్రదర్శించారు. దీనిపై సీఐడీ డీజీ ఆసిఫ్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ సైబర్ నేరాలకు పాల్ప డుతున్న ఇంటర్నేషనల్ మోసగాడిని అరెస్టు చేశా మన్నారు. ఈ మోసాలకు పాల్పడేందుకు అనేక రకాల అధునాతన సాంకేతిక పరికరకాలు వాడు తున్నారని తెలిపారు. వారి నుంచి అనేక పరిక రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటర్నే షనల్ కాల్స్‌ను లోకల్ కాల్‌గా మార్చి చూపుతున్నారని దీంతో చాలా మంది కాల్స్ మాట్లాడటం ద్వారా మోసపోతున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా రూ. పది వేల కోట్ల వరకు మోసం చేశా రని ఒక్క ఏపీలో ఇరవై కోట్లు వరకు మోసం చేశారన్నారు. ఈ విధంగా అనేక దేశాల వారిని మోసం చేశారని ఒకేసారి 64 సిమ్‌లతో వీరు కాల్స్ చేస్తున్నారని సీఐడీ డీజీ చెప్పారు. వేలకోట్ల రూపాయలు మోసాల ద్వారా దోచుకున్నారని తెలిపారు. సిమ్ బాక్స్ ద్వారా, మాడ్యూల్స్ ద్వారా వీరు ఆపరేషన్ చేస్తున్నారన్నారు. ఎక్కడ నుంచి కాల్ చేసేది తెలియకుండా మోసాలకు పాలిటెలిగ్రామ్ యాప్ ద్వారా వీరు మోసపూరిత లింక్‌లు పంపిస్తున్నారని అన్నారు. ఫేక్ కేవైసీ చేసి ఈ ముఠా సిమ్ కార్డులు సంపాదిస్తున్నారని చెప్పారు. ఏ సిమ్ ఎప్పుడు ఎలా ఆపరేట్ చేయాలో టెలిగ్రామ్ యాప్ ద్వారా వారికి సంకేతాలు పంపుతారని.. ఇదంతా పెద్ద ఆర్గనైజ్ క్రైంగా జరుగుతుందని వివరించారు. ఇందులో చాలా మందికి భాగస్వామ్యం ఉందన్నారు. కొంతమంది తెలిసి, మరికొందరు తెలియక ఈ ముఠాతో భాగస్వామ్యం అవుతున్నారని.. ప్రజలు కూడా వీటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అజ్ఞాత వ్యక్తులు నుంచి వచ్చే కాల్స్ పట్ల అలెర్టుగా ఉండాలన్నారు. ఒక్క చోటే కూర్చుని అనేక దేశాల ప్రజలను మోసం చేస్తున్నారు. టెలిగ్రామ్ యాప్ ద్వారా వీరు మోసపూరిత లింక్‌లు పంపిస్తున్నారు. ఈ ముఠా ఫేక్ కేవైసీ చేసి సిమ్ కార్డులు సంపాదిస్తున్నారని, ఏ సిమ్ ఎప్పుడు ఎలా ఆపరేట్ చేయాలో టెలిగ్రామ్ యాప్ ద్వారా వారికి సంకేతాలు పంపుతారు. ప్రజలు కూడా వీటిపై అవగాహన పెంచుకోవాలి. అజ్ఞాత వ్యక్తులు నుంచి వచ్చే కాల్స్ పట్ల అలెర్టుగా ఉండాలి అన్నారు. వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ (వీవోఐపీ)ను ఉపయోగించుకుని ఇంటర్నేషనల్ కాల్స్‌ను సిమ్ బాక్స్ అనే పరికరంలోకి పంపిస్తారు. ఒక్కో సిమ్ బాక్స్‌లో భారతదేశానికి సంబంధించిన వందల సిమ్‌లు ఉంటాయి. ఇవన్నీ ఈ ముఠాలు నకిలీ చిరునామాలు, గుర్తింపు కార్డుల వివరాలతో సేకరించినవే. ఈ సిమ్ బాక్సుల ద్వారా అంతర్జాతీయ కాల్స్ అన్నీ లోకల్ సిమ్ నుంచి బయటకు వెళ్తాయి. కాంబోడియా, చైనా సహా పలు దేశాల్లో పాగా వేసిన అంతర్జాతీయ సైబర్ నేర ముఠాలు అక్కడి నుంచి మన దేశంలోని అనేక మందికి ఫోన్ కాల్స్ చేసి సైబర్ మోసాలకు పాల్పడుతున్నాయి. డిజిటల్ అరెస్టుల పేరిట బెదిరింపులు సహా ఇతరత్రా నేరాలు చేస్తున్నాయి. సిమ్‌బాక్సుల వల్ల సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచే కాల్స్ చేసినప్పటికీ మన దేశంలోని బాధితులకు అవి స్థానిక ఫోన్ నంబర్లలానే కనిపిస్తాయి. దీనివల్ల అసలైన నేరగాళ్లు దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా మోసగిస్తున్నారు.



## బిసి స్కాలర్ షిప్‌లకు రూ.90 కోట్లు మంజూరు

### మంత్రి సవిత

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతి నిధి:** వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సం స్థల్లో చదువుతున్న బీసీ విద్యార్థులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2025-26 విద్యా సంవత్సరంలో భాగంగా పీఎం యశస్వి పథకం కింద రెండో విడతగా కళాశాల, పాఠశాల ఓబీసీ, ఈబీసీ, డీఎన్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల నిమిత్తం రూ.90.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు . ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ రెండో విడతగా రూ.69.40కోట్లను పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం కూటమి ప్రభుత్వం మం జూరు చేసిందన్నారు. ఈ నిధులు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులకు ఉపకరిస్తాయన్నారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గానూ రెండో విడతగా రూ. 21.10 కోట్లను విడుదల చేసిందన్నారు. పాఠశాల స్థాయిలో చదువుతున్న అర్హులైన బీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించనున్నామన్నారు. రెండు ఉత్తర్వుల ద్వారా రూ.90.50 కోట్లను వెనుకబడిన తరగతుల విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. బీసీ బిడ్డల విద్యకు సీఎం చంద్రబాబునాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ లు మంజూరు చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం నిధులు అన్ని వర్గాలతో పాటు బీసీ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేశామన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నా మన్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్నభోజన పథకాన్ని అమలు చేస్తున్నామ న్నారు. బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష ్యమని మంత్రి సవిత ఆ ప్రకట నలో తెలిపారు.

## వారం - వర్జ్యం

27-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
సప్తమి మ.1.10
పూర్వాభాద్ర ఉ.9.09, మూల కార్తె
వర్జ్యం : సా.4.58-6.43
దు.ఉ.6.35-8.08
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగస్తులు తమ తోటివారితో అప్రమత్తతో మెలగాలి. ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుంది. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**వృషభం:** పెదవి దాటడం వలన ఇబ్బందులను కొని తెచ్చుకోవడం అవుతుంది. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటాయి.

**మిథునం:** డాక్యుమెంట్లు, భూమి స్థిరాస్తుల సంబంధితమైన రావలసిన సౌకర్యాలు, ధనప్రాప్తి ఇబ్బందులకు గురిచేస్తారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** సంకుచిత మనస్తత్వము గల వ్యక్తులకు దూరంగా ఉండండి. మౌనం శ్రీరామరక్ష అవుతుంది. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**సింహం:** ఓర్పు, నేర్పులు మేలు చేస్తాయి. యుక్తితో సమస్యల వలయాల నుండి బయట పడతారు. సోదరుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఇంటా బయట అనుకూలం. వస్త్రలాభం.

**తుల :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. దీర్ఘ కాలిక ఋణాలు తీరుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఇతరుల విషయంలో జోక్యం వద్దు. వాహన సౌలభ్యం కలదు.

**ధనుస్సు:** సమయస్ఫూర్తితో మెలగడం చెప్పదగినది. బంధువుల నుండి మాట సహాయం అందుకుంటారు.

**మకరం :** వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. ఆహార నియమాలు పాటించండి. ప్రకృతి వైద్యం మేలుచేస్తుంది.

**కుంభం:** చిన్ననాటి మిత్రుల నుండి శుభ వార్తలు అందుకుంటారు. భూ వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**మీనం:** ఉద్యోగాలలో ఎదురైన ఆటంకాలను అధిగమిస్తారు. కోర్టుకేసుల నుండి బయట పడతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఆదోని మెడికల్ కాలేజీ టెండర్‌పై ప్రభుత్వ వివరణ

**కిమ్స్ ఆసుపత్రి ఎలాంటి బిడ్ వేయలేదని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో నిర్మించ తలపెట్టిన ఆదోని మెడికల్ కాలేజీ టెండర్ వ్యవహారంలో నెలకొన్న అనుమానాలను ప్రభుత్వం తొలిగించింది. ఈ అంశంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టతను ఇచ్చారు. ఆదోని కాలేజీకి కిమ్స్ ఆసుపత్రి బిడ్ వేసిందని తొలుత ప్రకటించిన ప్రభుత్వం, ఆ తర్వాత కిమ్స్ యాజమాన్యం దానిని ఖండించడంతో ఇరకాటంలో పడింది. ఈ వివాదంపై తాజాగా మంత్రి సత్యకుమార్ స్పష్టతనిచ్చారు. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ ప్రేమ్ చంద్ షా తన వ్యక్తిగత హోదాలో టెండర్ దాఖలు చేశారని, అయితే ఆయన కిమ్స్‌లో పనిచేస్తుండటంతో సంస్థే బిడ్ వేసిందని పొరపాటు పడ్డామని మంత్రి వివరించారు. "ఇది కేవలం ఒక చిన్న కమ్యూనికేషన్ గ్యాప్ మాత్రమే. కిమ్స్ సంస్థ ఎలాంటి బిడ్ వేయలేదు" అని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు, ప్రభుత్వం నాలుగు మెడికల్ కాలేజీలకు టెండర్లు పిలవగా, ఒక్క ఆదోని కాలేజీకి మాత్రమే కిమ్స్ నుంచి బిడ్ వచ్చిందని ప్రచారం జరిగింది.

## బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపు

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబరు 26, ప్రభాతవార్త:** బాక్సింగ్ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆత్మస్థైర్యం పెంపొందిస్తాయని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శుక్రవారం బాక్సింగ్ డే సందర్భంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని నేషనల్ ఫిట్‌నెస్ జిమ్, శివ బాక్సింగ్ క్లబ్‌లను సందర్శించారు. యువతకు ఉచిత బాక్సింగ్ శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్న కానిస్టేబుల్ నివాస్‌ను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. ముందుగా అడిషనల్ ఎస్పీ హనుమాన్ చిత్రపటానికి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్లబ్‌లో శిక్షణ పొందుతున్న బాక్సర్లను పరిచయం చేసుకుని, బాక్సింగ్ పోటీలను ప్రారంభించారు.

# రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణ



తిరుపతిలో నూతన పోలీస్ జిల్లా కార్యాలయం ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**సాంకేతిక పరిజ్ఞానంతో నేరనియంత్రణ అవసరం**
**తిరుపతిలో కొత్త డిపిఒ ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు**

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** రకరకాల మనస్తత్వాలతో నేరాలు చేసే నేరస్తులకంటే పోలీసులు తెలివిగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అన్నారు. వారెన్ని డ్రామాలు ఆడినా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్ ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. సాంకేతికతను వాడుకుని నేరనియంత్రణ చేయాలన్నారు. డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని సూచించారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన తిరుపతిజిల్లా పోలీసు కార్యాలయం (డిపిఒ)నూతన భవనాలను రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత, డిజిపి హరీశ్‌కుమార్‌గుప్తా, అనంతపురం డిఐజి షిమోషిబాజ్‌పేయి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుతో కలసి సిఎం చంద్రబాబు నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే శరణ్యమన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మికక్షేత్రానికి తిరుపతికి, తిరుమలకు వచ్చే భక్తులకు భరోసాగా పోలీసులు నిలవడం అభినందనీయమన్నారు. ప్రపంచం నలుమూలల నుండి వచ్చే భక్తులకు భద్రతాభావం కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని సిఎం స్పష్టం చేశారు. కలియుగవైకుంఠం శ్రీవేంకటేశ్వరస్వామి నెలకొన్న ఈ ప్రాంతం పవిత్రతను కాపాడేలా పోలీసులు చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా వుండాలని నిర్దేశం చేశారు. భక్తులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని ఆదేశాలిచ్చారు.

– రౌఢీయిజంపై ఉక్కుపాదం:సిఎం

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీ పడేప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతిలో హెచ్చరించారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే కుదరదని, సెటిల్‌మెంట్లు బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. రౌడీయిజం చేసే వారిని రాష్ట్రబహిష్కరణ చేస్తామని హెచ్చరిక చేశారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపిన చరిత్ర తమదని సిఎం వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టుపట్టాయని, తిరుమల పవిత్రతను దెబ్బతీశారని విమర్శించారు. రోడ్లు బ్లాక్‌చేయడంచ రప్పారప్పా లాడించడం ఏమిటో ఎవరికీ అర్థంకావడం లేదన్నారు. బంగారుపాళ్యంలో మామిడికాయలు తొక్కించారని, గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్‌క్రింద తొక్కించి పొదల్లో పారేసి పోయారని అన్నారు. ఈ తరహా ఘటనల్లో సిసికెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు పెట్టుకోవాలన్నారు.

## ప్రజా క్షేమమే ముందు...రాజకీయాలు తర్వాత

**- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



**విజయవాడ, డిసెంబర్ 26:** మాత్రమే కాదు...అసలైన రాజనీతిజ్ఞుడు.ప్రతి పక్ష నాయకుడూ ఆయన నుంచి స్ఫూర్తి పొందాలని ఏపీ డీ సీం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.. ఆయన మార్గనిర్దేశకత్వం లోనే ప్రజాక్షేమం ముందూ...రాజకీయాలు ఆ తర్వాతే అని గట్టిగా నమ్ముతున్నా...ఇదే మన ధర్మం' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాజ్‌పేయి జన్మదినం సందర్భంగా ఎక్స్ వేదికగా చేసిన ట్విటో లో వ్యాఖ్యానించారు.'అధికారం ఆట కొనసాగుతూ ఉంటుందని, పార్టీలు వస్తాయని,పోతాయని,ప్రభుత్వాలు ఏర్పడతాయి,కూలతాయని...కానీ దేశం ఉండాలని, ఆ దేశం లో ప్రజాస్వామ్యం అమరంగా ఉండి తీరాలని వాజ్‌పేయీ 1996లో పార్లమెంట్ ప్రసంగంలో చెప్పిన మాటలు ఎప్పుడూ గుర్తుంటాయి. అవి ప్రజాస్వామ్య విలువల పట్ల మన భాధ్యతను ఎప్పుడూ గుర్తు చేస్తుంటాయి. ఆయన పోఖ్రాన్ అణుపరీక్షలతో భారత్ వ్యూహాత్మక బలాన్ని నొక్కి చెప్పారు. స్వర్ణ చతుర్భుజి,జాతీయ రహదారులతో దేశవ్యాప్తంగా అనుసంధానం పెంచారు. ఆయన ఆదర్శాలు ఇప్పటికే మార్గనిర్ధేశం చేస్తున్నాయి'అని పవన్ కళ్యాణ్ కొనియాడారు.

## విఆర్‌ఎస్ నిర్ణయం వెనక్కి తీసుకుంటే తీవ్ర చర్యలుంటాయని బెదిరించారు

**మాజీ ఐపిఎస్ ప్రవీణ్ ప్రకాష్ వెల్లడి**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్త ప్రతినిధి** :'స్వచ్ఛంధ పదవీ విరమణ(వీఆర్‌ఎస్) ధరఖాస్తు వెనక్కి తీసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అప్పట్లో తనను కొందరు బెదిరించారని మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. ఒక యూ ట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. 'సర్వీసు నుంచి వెళ్ళిపోయావు అదే నీకు శిక్ష.మళ్ళీ సర్వీసులోకి వస్తానని డ్రామాలు చేస్తే...తీసుకుంటాం.కానీ ఆ తర్వాత తీవ్రమైన చర్యలుంటాయి' అని కొందరు తనకు బెదిరింపు సందేశాలు పంపినట్లు ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. అయితే వారి పేర్లను ఆయన వెల్లడించలేదు. బెదిరింపులు వచ్చిన తర్వాత కూడా తాను అప్పటి సిఎస్ నీరబ్‌క ఉమార్ ప్రసాద్‌ను కలిసి తన మనసులో మాట చెప్పానని,ఆయన కూడా వద్దని సలహా ఇచ్చారని తెలిపారు. నువ్వు ధరఖాస్తు చేసినా ప్రభుత్వం తిరస్కరిస్తుందని నీరబ్‌కుమార్ తనతో చెప్పినట్లు ప్రవీణ్ ప్రకాష్ పేర్కొన్నారు. '2024లో కూటమి అధికారం లోకి వచ్చాక నాకు పోస్టింగ్ ఇవ్వలేదు. 21 రోజుల్లోనే వీఆర్‌ఎస్‌కి ధరఖాస్తు చేశాను. నా నిర్ణయం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నా తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. అది చూడలేక వీఆర్‌ఎస్ నిర్ణయాన్ని పున :పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాలనుకున్నాను' అని తెలిపారు.

## పిపికి కేంద్ర సాయం - ఆరోగ్యమంత్రి సత్యకుమార్‌యాదవ్

### కేంద్ర మంత్రి జెపి నడ్డాకు లేఖ

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య కళాశాలలు, ఆరోగ్య సేవల రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానానికి సహకారం అందిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది,ఈ విధానాన్ని కేంద్రం ఇప్పటికే అనుసరిస్తుంది.వైద్యరంగంలో పీపీపీ విధానం ప్రాధాన్యాన్ని, కేంద్రం అమలు చేస్తున్న పథకాల్ని వివరిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా ఒక లేఖ రాశారు.పీపీపీ విధానంలో చేపట్టే ప్రాజెక్టుల్లో కేంద్రం మూలధన వ్యయంలో 30 నుంచి 40 శాతం వరకు , నిర్వహణ వ్యయంలో 25 శాతం వరకు నిధులుగా అందిస్తుందని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న వైద్య కళాశాలల ఆధునికీకరణ, కొత్త వాటి నిర్మాణం, సహా ఆరోగ్యరంగ మౌలిక వసతుల అభివృద్ధికి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద ఈ సంవత్సరం అక్టోబరు నుంచి ఇప్పటివరకు రూ.2వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ రంగంలో పీపీపీ విధానాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. అందులోని ముఖ్యాంశాలను వైద్య, ఆరోగ్యశాఖ మీడియాకు విడుదల చెసింది. దేశంలో ఇప్పటివరకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టులు వీజీఎఫ్ కింద ఆమోదించినట్లు ఆయన వివరించారు. వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల అభివృద్ధి, రోగనిర్ధారణ సేవలు, సంచార వైద్యం, డయాలసిస్‌లను పీపీపీ విధానంలో ప్రారంభించామన్నారు. 20 రాష్ట్రాల్లో 919 డయాలసిస్ సెంటర్లు పీపీపీ పద్ధతిలో నడుస్తున్నాయన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల ఆధునికీకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన క్లినికల్, నాన్‌క్లినికల్ సేవలు అందించినట్లు నడ్డా తెలిపారు.

## బాలకళాకారుల నృత్యప్రదర్శనలు అద్భుతం

**తిరుపతి,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీకృష్ణనటరాజాలయం తిరుపతి నృత్యదర్శకుడు కొండారవి నేతృత్వంలో మహతి కళాక్షేత్రంలో బాకళాకారుల నృత్యప్రదర్శనాలు అద్భుతంగా సాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం మహతి కళాక్షేత్రంలో శాస్త్రీయ జానపద నృత్యాలు ఎంతో ఆహ్లాదంగా జరిగాయి. నృత్యోత్సవాల్లో పాల్గొన్న చిన్నారులందరికీ బాలపురస్కారాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈనాటి బాలకళాకారులే రేపటి ప్రతిభగల కళాకారులుగా ఎదుగుతారని, మన సంస్కృతి సంప్రదాయాలు ఈ నృత్యోత్సవాల ద్వారా ప్రేక్షకులకు తెలియజేస్తున్నారని తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు.రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ,కెవెన్ రాజ తదితరులు పాల్గొన్నారు.

## ఆ మూడురోజులు భక్తుల రద్దీనియంత్రణ సాధ్యమేనా?

**- టోకెన్లు లేకున్నా కొండకు రమ్మని పిలుపు! - సౌకర్యాలపై కనిపించని వ్యూహాత్మక అడుగులు**

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** సాధారణరోజుల్లోనే తిరుమలకు లక్షమందివరకు భక్తులు చేరుకొంటున్న తరుణంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు మరింతమంది భక్తులు రెట్టింపుసంఖ్యలోతరలివచ్చే అవకాశం స్పష్టమవుతోంది. భారీగా భక్తులు డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో ఆ మూడురోజులు ప్రత్యేక పర్వదినాల్లో తిరుమలపైకి చేరుకుంటే అందరికీ దర్శనం చేయించకపోయినా కనీసం కొండంతా నిరీక్షించే భక్తజనానికి వసతి,అన్నప్రసాదాలు, తాగునీరు సౌకర్యాలు కల్పించడం మాత్రం మాటల్లోచెప్పలేనిదికాదనేది అంచనావేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ మూడురోజులు తిరుపతి అలిపిరిలోనే టోకెన్లు లేని భక్తులను కొంతవరకు నియంత్రించడం తప్పనిసరి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ యేడాది ఆఖరులో ఆపదమొక్కులవాడు అనాథరక్షకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం భారీగా తరలిరావడంతో ఏడుకొండలు జనసంద్రంగా మారింది.వచ్చిన వారంతా ఎక్కడబడితే అక్కడ నిరీక్షిస్తుండటం, ఆలయం ముందు ప్రత్యేక షెడ్లలో తలదాచుకోవడం, ఆలయం వెలుపల క్యూలైన్లలో పడిగాపులు కాస్తుండటం కనిపిస్తోంది. ఇప్పటికే చాలావరకు వీరికి సేవలందించలేక శ్రీవారి సేవకులు, సిబ్బంది కొంత ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది మరో మూడురోజుల్లో మొదలుకానున్న పవిత్రమైన వైకుంఠ ఏకాదశి(30వతేదీ), ద్వాదశి(31న),త్రయోదశి(జనవరి 1నూతన ఆంగ్ల సంవత్సరం)రోజుల్లో ఆన్‌లైన్‌లో ఇడిప్‌లో జారీచేసిన 1.89లక్షల టోకెన్లు అందుకున్న భక్తులకు మాత్రమే ఆలయంలోనికి అనుమతిఉంటుందని టిటిడి అధికారులు ప్రకటించారు. మరీ టోకెన్లు లేకున్నా తిరుమలకు ఊహించలేనంత మంది భక్తులు తమిళనాడు, కర్నాటక తెలుగురాష్ట్రాల నుండి తరలివస్తే వారికి ఎక్కడ సదుపాయాలు కల్పించగలరనేది కూడా టిటిడి పాలకమండలి, టిటిడి అధికారులు సమాలోచనలు చేస్తున్నా సాధ్యపడదనేది టిటిడి ఉద్యోగుల వాదనలు. మరీ తొలిమూడురోజులు ఎటువంటి టోకెన్ లేని భక్తులను తిరుమలకు రమ్మని పిలవడం శుభపరిణామమే అయినా వారికి దర్శనాలు కల్పించలేమనేది స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. ఇందుకు తిరుపతి అలిపిరి ప్రవేశద్వారం, కాలినడక మార్గాలు, సప్తగిరి తనిఖీకేంద్రం ప్రాంతాల్లో టిటిడి ఉద్యోగులు, పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది జాగరూకతతో వ్యవహరించి భక్తులకు అవగాహన కల్పించడం ఇప్పుడు ముందున్న ప్రధాన సమస్య. మరీ అలా సామాన్యభక్తులు సంయమనంతో వ్యవహరిస్తారా అనేది కూడా టిటిడి అదికారుల్లో ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి,ద్వాదశి రోజుల్లో తిరుమలకు భారీగా చేరుకుంటే భక్తులు తమను దర్శనాలకు అనుమతించడంలేదని నిరసనలు తెలియజేసిన సందర్భాలు ప్రతి ఏడాది చవిచూస్తున్నవే. అలాంటిది అందరినీ తిరుమలకు రమ్మని పిలిస్తే మరీ టోకెన్ లేని భక్తులకు దర్శనాల మాటమాత్రం దేవుడెరుగని వదిలేస్తారా?లేక వ్యూహాత్మకంగా, ప్రణాళికాబద్ధంగా కదులుతారా అనేది మరో మూడురోజుల్లో తేలిపోనుంది. అయితే టిటిడి అధికారులు, పోలీసు అధికారులు కూడా ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో వైకుంఠద్వార దర్శన టోకెన్లు జారీ సమయంలో చోటుచేసుకున్న అవాంఛనీయ ఘటనలతో పూర్తిగా ఆన్‌లైన్‌లోనే దర్శనం.

## బివి ఛానల్, 13 షేర్ ఛానల్ ఆధునీకరణ పనులకు రంగం సిద్ధం

**విజయనగరం , డిసెంబర్ 26 (ప్రభాతవార్త ప్రతినిధి )** గజపతినగరం నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా సాగునీటి తరలింపునకు ఇబ్బందిగా మారిన బివి ఛానల్, 13 షేర్ చానల్ ఆధునీకరణ పనులకు రంగం సిద్ధమైంది. సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కెనాల్ ఆధునీకరణ పనులను ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు పరిష్కరించేందుకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామపంచాయతీ పరిధిలోని పట్రువాడ గ్రామం వద్ద సాగునీటిని తరలించే ఇరిగేషన్ ఛానల్ ను శుక్రవారం మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. ఇరిగేషన్ కెనాల్ అలైన్మెంట్ ను మార్చి, కేనాల్ ను ఆధునికరించి బివి ఛానల్ ద్వారా సాగయ్యే 11 వందల ఎకరాలకు, 13 షేర్ ఛానల్ ద్వారా 14 వందల ఎకరాలకు ఆయకట్టును స్థిరీకరించే ప్రయత్నాలను మంత్రి ప్రారంభించారు. ఈ రెండు చానళ్లను ఆధునీకరించడం ద్వారా ఈ ప్రాంతంలో సాగునీటి ఇబ్బందులను రూపుమాపి రెండవ, మూడవ పంటలకు సాగునీరు అందించే అవకాశం కలుగుతుందని, ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి సాధించి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

## భీమవరం నూతన డీఎస్పీగా రఘువీర్ విష్ణు బాధ్యతల స్వీకరణ

**- డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో మర్యాదపూర్వక భేటీ**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సబ్‌డివిజన్ నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా రఘువీర్ విష్ణు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును భీమవరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణపై రఘురామ దిశా నిర్దేశం చేశారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా, రాజీ పడకుండా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీఎస్పీ రఘువీర్ విష్ణు, డిప్యూటీ స్పీకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ భద్రతపై వీరి మధ్య చర్చ జరిగింది. నేరాల నియంత్రణ, పర్యవేక్షణ కోసం ఉండి నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా నీడలోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు రఘురామ తెలిపారు. "నియోజకవర్గం మొత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దు" అని డీఎస్పీకి స్పష్టం చేశారు. దీంతో పాటు భీమవరం పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపైనా చర్చించారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రఘువీర్ విష్ణు గతంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లో పనిచేశారు. అంతేకాకుండా ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షక దళంలో భాగంగా కొసావోలో కూడా సేవలు అందించిన అనుభవం ఆయనకుంది. నిన్నటి వరకు పనిచేసిన డీఎస్పీ జయసూర్యను డీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం బదిలీ చేసింది .

# తిరుమల సమాచారం

## మానసిక సంతృప్తే నిజమైన సంతోషం

**- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్**



**తిరుమల, డిసెంబర్ 26ప్రభాత వార ప్రతినిధి:** మనిషికి నిజమైన సంతోషం మానసిక సంతృప్తిలోనే ఉందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌సింగ్ భగవత్ అన్నారు. మనిషికి సుఖ దు:ఖాలు తాత్కాలికమేనని మనసుకు తృప్తిలేకపోతే ఆనందం ఉండదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఉదయం తిరుమలలో ఆలయం వద్దకు చేరుకున్న మోహన్‌భగవత్‌కు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ సింఘాల్ ,అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతిలో జరిగే కార్యక్రమానికి విచ్చేసిన ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని వెళ్ళారు.

## అందరిపై శ్రీవారి ఆశీస్సులుండాలి: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే నూతన ఆంగ్ల సంవత్సరంలో కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై కలగాలని ,అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రముఖులు కోరుకున్నారు. శుక్రవారం తమిళనాడు గవర్నర్ టి.రవి,ఏపి డిజిపి హరీశ్‌కుమార్‌గుప్త, మాజీక్రికెటర్ వెంకటేశ్‌ప్రసాద్, బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్‌శుక్ల వేర్వేరుగా ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో వెంకన్నను దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## జనసంద్రంగా తిరుమల - సర్వదర్శనానికి 26 గంటలు



**తిరుమల,డిసెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులు ,ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులతో తిరుమల జనసంద్రంగా మారింది. శుక్రవారం ఉదయానికి భక్తులు పోటెత్తుతున్నారు. భారీగా భక్తులు దేశంనలుమూలల నుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యాకాంప్లెక్స్‌లు,నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరాయి.శ్రీవారి సాధారణ సర్వదర్శనానికి 26గంటలు సమయం పడుతోంది. టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## భారీగా పెరిగిన చికెన్, కోడిగుడ్ల ధరలు

**- డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో పెరిగిన ధరలు**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో కోడిగుడ్ల ధరలు భారీగా పెరిగాయి. అదే రీతిలో కోడి మాంసం ధరలు రోజు రోజుకు ప్రియంగా మారుతున్నాయి. మార్కెట్‌లో డిమాండ్ ఒక్కసారిగా పెరగడం,ఫీడ్ ధరలు అధికమవడం,రవాణా ఖర్చులు పెరగడం వంటి కారణాలతో కోడి మాంసం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ ధరల పెరుగుదల సామాన్య ,మధ్యతరగతి ప్రజలపై ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. గతంతో పోలిస్తే కిలో కోడి మాంసం ధరలు గణనీయంగా పెరగగా,కోడిగుడ్ల ధరలు కూడా మరింత భారంగా మారాయి. ధరల పెరుగుదల కారణంగా మధ్యతరగతి కుటుంబాలు చికెన్ కొనేందుకు భయపడుతున్నారు.రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పండుగలు రావడంతో చికెన్,గుడ్డుకు ఒక్కసారిగా భారీ డిమాండ్ పెరగడంతో పాటు డిమాండ్‌కు తగినంత ఉత్పత్తి లేకపోవడం వల్ల గత నెల రోజులుగా ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెలలో సంక్రాంతి పండుగ ఉండటంతో మరో నెల రోజుల పాటు ఈ ధరల పెరుగుదల కొనసాగవచ్చని వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ వ్యక్తిగత హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ

**- ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం**
**- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలకు కీలక సూచనలు**
**- ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా కంటెంట్ సృష్టిపైనా ఆంక్షలు**

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాత వార్తప్రతినిధి:** టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్‌ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కళ్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కళ్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కళ్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది.

ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈకామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయ దారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. అయితే, ఫ్యాన్ పేజీలకు మాత్రం కొన్ని షరతులతో మినహాయింపు ఇచ్చింది. అవి ఖీఫ్యాన్ పేజీఖీ అని స్పష్టమైన డిస్‌క్లెయిమర్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

## విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ రద్దీ

**విజయవాడ,డిసెంబరు 26,ప్రభాత వార్తప్రతినిధి:**క్రిస్మస్ సెలవులు ముగియడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి భారీ ట్రాఫిక్ రద్దీతో నిండిపోయింది. క్రిస్మస్ అనంతరం ఆఫీసులు, కాలేజీలు, పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఒకేసారి లక్షలాది మంది హైదరాబాద్ వైపు ప్రయాణం చేయడంతో రహదారిపై వాహనాల ఒత్తిడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకంగా పంతంగి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అటవీ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సంఖ్య: 1337/2023/టి.ఒ., తేది: 23.12.2025
కాకినాడ జిల్లా, కాకినాడ అటవీ డివిజన్ పరిధిలోని వివిధ నర్సరీ స్థలాలకు సరఫరా & డెలివరీ కోసం అర్హత కలిగిన యూనిట్లు నుండి వివిధ పరిమాణాల పాలిథిన్ బ్యాగుల పదార్థాలు సరఫరా కోసం ఈ-టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 25.12.2025. టెండర్ డాక్యుమెంట్ అప్‌లోడ్ ముగింపు తేది: 02.01.2026 మ.1.30గం.ల వరకు. పూర్తి వివరాలను https://tender.apeprocurement.gov.inలో చూడగలరు. ఫోన్: 0884-2343339.
సం/-. జిల్లా అటవీశాఖాధికారి, కాకినాడ డివిజన్, కాకినాడ.
DIPR.NO. 18553/CL/ADVT/1/1/2022-23 తేదీ: 26.12.2025

వార్త


గౌరవం అన్నది పదవులు హోదాలు పొందడంలో లేదు. పదవులు గౌరవాదులకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది.

-అరిస్టాటిల్

# స్వచ్ఛమైన గాలికి పన్నుల అవరోధమా!

రాజధాని అయినా, ఓ కుగ్రామమైనా, ఊరంతా పొగమంచు లేదా కాలుష్యం ఒకే తెరగా కమ్మేస్తోంటే ఎన్నాళ్లు ఊరుకుంటాం? దానికి పరిష్కారమేమిటో అంతుచిక్కకపోతే ఏంచేయాలి? ఇవన్నీ న్యాయస్థానాలను, పాలకుల్ని వేధిస్తున్న ప్రశ్నలు. ఢిల్లీలో కాలుష్య స్థాయి ఆందోళనకరంగా ఉందని అందరూ చెప్తున్న మాటే! శాస్త్రజ్ఞులు, కాలుష్య మండలి అధికారులు సైతం ఒకే మాట. ఢిల్లీలో కాలుష్యం పెచ్చుపెరిగిపోతే ఊరు మొత్తం ఇంట్లో కూర్చోవాల్సిందే. ఢిల్లీ కాలుష్యస్థాయిని గుర్తించడంలో ఎవరి అంచనా వారిది. ఒకేసారి 20 సిగరెట్లు కాలిస్తే మానవ దేహం ఎంత ఇన్‌ఫెక్షన్‌కు గురౌతుందో అంతేస్థాయిలో ఉందని ఒక అంచనా గతంనుంచే వస్తోంది. ఢిల్లీలో రెండు రోజులుంటే తనకు ఇన్‌ఫెక్షన్ సోకడం ఖాయమని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అంటున్నారు. ఎవరెంత బాగా బాధపడితే వారంతగా తన బాధను వ్యక్తం చేయగలుగుతారన్నది నిజం. అందుకే ఆయన ఫీలింగ్‌ను ఆయన చెప్పారు. ఒక పుస్తకావిష్కరణ సభలో ఆయన పలు విషయాలపై తన సొంత అభిప్రాయాలను నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తన రవాణా శాఖవల్లే 40శాతం కాలుష్యం ఏర్పడ్తోందని అన్నారు. యేటా 22 లక్షల కోట్ల ఖర్చుతో శిలాజ ఇంధనాలు దిగుమతి చేసుకుంటున్న దేశం మనదని అయినా ఎక్కడో లోపం ఉందేమోనన్న సందేహం వ్యక్తం చేశారు. ఇదోరకమైన జాతీయ వాదమా! అని ప్రశ్నించారు. అంత భారీస్థాయిలో డబ్బు ఖర్చుపెట్టి దేశాన్ని కలుషితం చేస్తున్నాము. ప్రత్యామ్నాయ ఇంధనాలు, జీవ ఇంధనాలలో మనం స్వయం సమృద్ధిని సాధించలేమా? అన్నది ఆయనకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉదయించింది. శ్వాస పీల్చుకోలేక ఎగశ్వాసను దింపుకోలేక శ్వాసనాళాలు గడబిడ చేస్తున్నాయని తెలిసినా ఢిల్లీ ప్రజలపై ‘ఎయిర్‌ప్యూరిఫైయర్లపై 18శాతం పన్ను వేసిన జిఎస్‌టి కౌన్సిల్ ఔదార్యాన్ని ఢిల్లీ హైకోర్టు ప్రస్తావించి అక్షింతలు వేసింది. ఢిల్లీలో గాలి నాణ్యత అత్యంత ప్రమాదకరస్థాయికి పడిపోయి జనం స్వచ్ఛమైన గాలికోసం ఎదురుచూస్తున్నఢిల్లీ ప్రజలకు ఈ విధమైన పన్ను శరాఘాతంలా మారింది. అంటే మూలిగే నక్కపై తాటిపండు పడిన చందాన ఇబ్బంది జరిగింది. ఎయిర్ ప్యూరిఫైయర్‌లు జీవరక్షక సాధనాలే తప్ప విలాస వస్తువులుగా ఎంతమాత్రం భావించలేం. అలాంటి పరిస్థితుల్లో వాటిపై 18 శాతం జిఎస్‌టి ఆక్షేపణీయం. ఈ మాటలన్నది ఎవరో కాదు సాక్షాత్తూ న్యాయమూర్తులే. ఒకపక్క జిఎస్‌టి భారతీయుడికి ప్రాణవాయువు అని కేంద్ర ప్రభుత్వం ఊదరకొడుతూ విస్తృత స్థాయిలో ప్రచారం చేసుకుంటూ మరోపక్క వినియోగదారుల జేబుకు చిల్లుపెట్టే స్థాయికి ఆవిభాగం చేరిందంటే నమ్మలేం. కానీ అది నిజం. వైద్యపరికరాలు ప్రాణాన్ని నిలబెడతాయి కనుక వాటి మీద ఐదు శాతం జిఎస్‌టి పన్నునే వసూలు చేస్తున్నారు. వైద్య పరికరాల జాబితాలో ఉండాల్సిన వస్తువుకు బయట ఎసిల మాదిరి విలాస వినియోగ వస్తువుగా ఎందుకు గుర్తించడం లేదని ధర్మాసనం నిలదీసింది. బుధవారం తమ ముందుకొచ్చిన వాదనలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావుతో కూడిన ధర్మాసనం జిఎస్‌టి కౌన్సిల్ ఆలోచనను దుయ్యబట్టింది. ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆలోచింపచేసేవిగా ఉన్నాయి.ప్రజలకు స్వచ్ఛమైన గాలినందించాల్సిన అధికారులు విఫలమయ్యారు. ప్రతి మానవుడు రోజుకి 21వేల సార్లు శ్వాసిస్తాడు. విషతుల్యమైన ఢిల్లీ కాలుష్యాన్ని పీల్చడంవలన ఊపిరితిత్తులు ఏమేరకు పాడవుతాయో అంచనా వేసుకోవచ్చు. అత్యవసర పరిస్థితిని గుర్తించైనా ఎయిర్ ప్యూరిఫైయర్‌లకు ‘పన్ను’ మినహాయింపు నివ్వచ్చునని ధర్మాసనం శాసించింది. ఇప్పటికిప్పుడు జిఎస్‌టి కౌన్సిల్‌సమావేశం జరపడం సాధ్యంకాదని హైకోర్టు ధర్మాసనానికిప్రభుత్వ ప్రతినిధులు కోర్టుకు నివేదించారు. భౌతికంగా సమావేశమై నిర్ణయాలు తీసుకోలేని సందర్భాలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై నిర్ణయం తీసుకోవచ్చునని హుకుం జారీచేసింది. ఢిల్లీ కాలుష్య స్థాయిల తీవ్రత రీత్యా ఎయిర్ ప్యూరిఫైయర్‌లను ‘మెడికల్ డివైస్’గా నిర్ణయించి జిఎస్‌టి 18 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించాలని లేదా పన్ను మినహాయించాలని కోరుతూ సుప్రీంకోర్టు న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం కూలంకషంగా విచారించింది. ఈ పిటిషన్ ఆద్యంతమూ ఢిల్లీ కాలుష్యం, దాని వలన సమస్యలు, పర్యావసనాలు తదితర అంశాలపై వాదనలు జరిగాయి. ఎప్పటిలాగే ప్రభుత్వం తరపున కొంత సమయం కావాలని కోరినప్పుడు ధర్మాసనంలోని న్యాయమూర్తి ఒకరు సమయం అంటే ఎంతకాలం వేలాది మంది మరణించినప్పుడా? అని నిర్ద్వంద్వంగా ప్రశ్నించారు. ప్రతి పౌరునికి పరిశుభ్రమైన గాలి కావాలి. దానిని ఇవ్వలేని పరిస్థితి ఉంది. అలాంటప్పుడు ప్రజలకు ఎయిర్ ప్యూరిఫైయర్‌లు అందుబాటులో ఉంచడం అత్యంత ఆవశ్యకమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఢిల్లీ కాలుష్యంపై ఆందోళన చెందని వారుండరు. పలుసందర్భాల్లో సుప్రీంకోర్టు కూడా అన్నిటికీ అతీతమై దీర్ఘకాలిక పరిష్కారం కావాలని సూచించింది. శుక్రవారం ఉదయం హానికరమైన పొగమంచు ఢిల్లీలోని దాదాపు అన్ని ప్రాంతాలను కమ్మేసింది. దృశ్యనాణ్యత బాగాపడిపోయింది. ఢిల్లీలో ఎన్‌సిఆర్ పరిధిలో గాలి నాణ్యత సూచీని అంచనా వేయగా గురువారం ఏక్యూఐ 220గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. వీటన్నిటిని అధిగమించాలంటే సమస్య వచ్చినప్పుడు ఆందోళన చెందడం కన్నా పటిష్ట ప్రణాళికలు, నిర్ణయాలతో సమస్య నుంచి గట్టెక్కడం అవసరం.

అదృష్టం కోసం కాచుకు కూర్చునే వ్యక్తి రాత్రిభోజనం తనకు ఎక్కడ దొరుకుతుందనేది ఖచ్చితంగా చెప్పలేడు.



ఫ్రాంక్లిన్

ధైర్యం, పట్టుదల, ఆత్మ విశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.



మహాత్మా గాంధీ

# రాజకీయ అవినీతే అసలు సమస్య!

**ప్రజలందరి ముందు వికృతరూపం దాల్చి నాట్యం చేసేది మరొక రకపు అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఈ అవినీతితోనే. తెలుగు రాష్ట్రాల్లో ఈ అవినీతి అదుపు తప్పిపోతున్నది. చీకటిలో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతే పోయారు కనీసం ప్రజలను వేధిస్తూ కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతిని నియంత్రించకపోతే అప్రతిష్టపాలుకాక తప్పదు. రాజకీయ అవినీతిని అదుపుచేయకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పు చేసినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్నివేల కోట్లు వసూల్ చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.**

దామెర్ల సాయిబాబ

‘పసరంబు పంజైన పసులకాపరి తప్పు, ప్రజలు దుర్జనులైన ప్రభువుల తప్పు, భార్య గయ్యాలి అయిన ప్రాణనాధుని తప్పు,తనయుడు దుష్టుడైన తండ్రితప్పు, కూతురు చెడిన మాత తప్పు, సైన్యంబు చెదిరిన సైన్యనాధుని తప్పు..అంటూ ఎవరు తప్పుచేస్తే ఎవరు బాధ్యులో ఏనాడో ధర్మపురి లక్ష్మినరసింహస్వామి శతకంలో శేషప్ప కవి చెప్పారు. దేశంలో అవినీతి, అక్రమాలు,ఆశ్రిత పక్షపాతాలు పెరిగిపోతున్నాయని,అందరూ ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉంటారు. ఈ వ్యవస్థ ఇలా దిగజారిపోవడానికి ఎవరు బాధ్యులో తెలియనివారు లేరు. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు తర, తమ బేధాలు లేకుండా ఎవరు అధికారంలో ఉన్నా తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు మానవతా విలువలు మంటగల్పుతున్నారు. దేశంలోని అవినీతి అంతకంతకు పెరిగిపోతున్నది. పాలకులు అభివృద్ధి పేరుతో ఎన్నిలక్షల కోట్లు అప్పు తెస్తున్నారో అదేస్థాయిలో అవినీతి విజృంభిస్తున్నది. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఒకటేమిటి ఎక్కడ అప్పు దొరుకుతుందో దుర్భిణి పెట్టి వెతికి అక్కడికి వెళ్లి రకరకాల విన్యాసాలు చేసి వారిని ఒప్పించి, మెప్పించి అప్పులు తెచ్చుకుంటున్నారు. అప్పులు తేవడమే గొప్పగా చెప్పుకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. నిర్మాణాత్మకమైన అభివృద్ధికి అప్పులు అవసరమే.అందులో మరో అభిప్రాయానికి తావులేదు. అవి ఎలాతీర్చాలో నిర్దిష్టమైన ప్రణాళిక, పథకాలుండాలి. వేలాది రూపాయలు ఏటా వడ్డీరూపేణా ఇప్పటికే చెల్లిస్తున్నారు. ఇటు పన్నులు రూపేణా ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్న డబ్బు, అటు అప్పులు తెస్తున్న వేలాదికోట్ల రూపాయలు అవినీతి, అక్రమార్కుల పాలు కాకుండా చూడాల్సిన గురుతర బాధ్యత పాలకులపై ఉంది. అప్పులు పెరిగి అందుకు తగ్గట్టుగా ఆదాయం రాకపోతే పరిస్థితి ఎలాఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పొరుగునున్న శ్రీలంకను చూశాం. ఇప్పటికీ ఆ దేశం కోలుకోలేకపోతున్నది. అభివృద్ధి, అవినీతి రెండూ కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు నడుస్తుంటే అవినీతితూట్లు పొడుస్తూ వెనక్కి గుంజుతుంటుంది.దిగజారిపోతున్న మానవతా విలువలు అవినీతిని పెంచిపోషిస్తున్నాయి.అంతోఇంతో నిజాయితీతో జీవనం సాగిస్తున్న అధికారులను అసమర్థులుగా పరిగణించే పరిస్థితులు దాపురించాయి. ఎలుకలనుచూసి పిల్లి తప్పుకున్నట్లుగా అవినీతిపరుల ముందు నీతివంతులు తలవంచుకునే నికృష్టపు రోజులు వచ్చాయి. మరొకపక్క రాష్ట్రాల పరిధుల్లో ఎసిబి కానీ, కేంద్రస్థాయిలో సిబిఐ విజిలెన్స్ కొత్తగా ఏర్పడ్డ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తదితర విభాగాలు రాజకీయ ఒత్తిడిల నుంచి బయటపడలేకపోతున్నాయి. అన్నింటికంటే మించి రాజకీయ అవినీతి శృతిమించిపోతున్నది. ఆవు చేలో మేస్తే దూడగట్టుపై మేస్తుందన్నట్లు కొందరు రాజకీయ నాయకుల అవినీతి అధికారులకు మార్గాన్ని చూపెడుతున్నది. అధికారుల్లో ఉన్న అవినీతి ఒక ఎత్తైతే కీలకపదవులు నిర్వహిస్తున్న కొందరు పెద్దలు ప్రజాసేవ ముసుగులో చెలామణి అవుతున్న మరికొందరు రాజకీయ నాయకులు, దళారుల వల్లనే పరిస్థితి అదుపు తప్పుతున్నదేమోననిపిస్తున్నది. వారి రాజకీయ అధికారం ధాటికి నిజాయితీ, సమర్థులైన అధికారులు సైతం నిస్సహాయంగా ఉండిపోతున్నారు. అవినీతి మూలంగా స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు భారత్ ఎన్ని లక్షలకోట్ల రూపాయలు కోల్పోయిందో అంచనాలకే అందదు.అవినీతినిఅంతం చేయాల్సిన కీలక పదవుల్లో ఉన్నకొందరు రాజకీయ నాయకులే చట్టానికి చుట్టాలై చక్రం తిప్పుతున్న సంఘటనలు గతంలో ఎన్నో బయటపడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో మాజీ మంత్రి ఒకరు ఉపాధ్యాయ నియామక కుంభకోణంలో కోట్లాది రూపాయలు దిగమింగి తన ఆప్తమిత్రురాలు ఇంట్లో

## ఒక్క మాట

గుట్టుచప్పుడు కాకుండా దాచిన వైనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రట్టుచేసింది. ఆ మధ్య కర్ణాటకలో బాధ్యత కలిగిన మంత్రే తన చావుకు కారణమని తనను ఏ రకంగా డబ్బు కొరకు వేధించారో వివరిస్తూ ఒక యువ గుత్తేదారు ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో విధిలేని పరిస్థితుల్లో ఆ మంత్రి రాజీనామా చేయాల్సివచ్చింది. ఇక సబ్బుల తయారీకి అవసరమైన ముడిసరుకుల టెండర్ ఆమోదముద్ర పొందడానికి లంచం ముట్టచెప్పాల్సిందేనని గుత్తేదారుకు ఆ ప్రాంత శాసనసభ్యుడు తన కుమారుడికి అప్పగించడంతో ఏకంగా నలభైలక్షల రూపాయలు తీసుకుంటూ లోకాయుక్త పోలీసుల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఇక సాక్షాత్తు హైకోర్టు న్యాయమూర్తి ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్షలాది రూపాయల నోట్ల కట్టలు బయటపడ్డాయి. రాజ్యాంగం కల్పించిన రక్షణ వల్ల ఆయనపై ఎఫ్‌ఐఆర్ కూడా వెంటనే నమోదు చేయలేని నిస్సహాయక పరిస్థితి. దీంతో ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది?ఎందుకోసం ఎవరు ఇచ్చారు? తదితర ప్రశ్నలకు జవాబు లేకుండా పోయింది. ఇటీవల ఒడిశాలో సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఐఎఎస్ అధికారి పదిలక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఆయన ఇంట్లో సోదా చేసి నలభై లక్షలకుపైగా నగదును అధికారులు కనుగొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది ఉన్నతాధికారులపై గతంలోనూ, ఇప్పుడు కూడా అవినీతి ఆరోపణలు తరచుగా వినిపిస్తూనే ఉన్నాయి. ఎసిబి దర్యాప్తు చేసి చర్యలకు సిద్ధమైనా ప్రభుత్వం అనుమతించక ఆగిపోయిన సంఘటనలు కోకొల్లలు. ఇప్పుడే కాదు గతం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉన్నది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజిలెన్స్ కమిషన్ రాంచంద్రన్ సమాల్‌పై ఏకంగా విలేకరుల సమావేశం పెట్టి వెల్లడించిన విషయాలు అందుకు అద్దం పడుతున్నాయి. అప్పుడే కాదు నేటికీ కొందరు సీనియర్ రాజకీయ నాయకులు, మరికొందరు ఉన్నతాధికారులు అవినీతిలో మునిగి తేలుతున్నారు. కాంట్రాక్టుల కోసం ఏకంగా మంత్రులే బహిరంగంగా పోటీపడుతూ విమర్శనాస్త్రాలను కురిపించుకుంటే ఏమనుకోవాలి? ఎవరికి చెప్పుకోవాలి? ఇక కిందిస్థాయిలో పరిస్థితి అదుపుతప్పిపోతున్నదేమోననిపిస్తున్నది. తాజాగా ఈవారంలో మహబూబ్‌నగర్‌లో రోడ్డు రవాణాకు సంబంధించిన అధికారిపై ఎసిబి అధికారులు చేసిన దాడుల్లో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రెండువందల కోట్లకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు కనుగొన్నట్లు ప్రకటించారు. ఇక రెవెన్యూ, ఎక్సైజ్, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, విద్యుత్ తదితర శాఖల్లో అవినీతి తారస్థాయికి చేరినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎసిబికి పట్టుపడుతున్న కేసులు కూడా ఇందుకు అద్దంపడుతున్నాయి. తెలంగాణలో ఇద్దరు ముగ్గురు మంత్రులు కోట్లాది రూపాయలు అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని సాక్ష్యాత్తు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మొన్న గురువారం రోజు బహిరంగంగానే ఆరోపించారు.అంతేకాదు కేంద్ర నిఘా విభాగాల దృష్టిలోఉన్నాయని, వాళ్ల జైలుకు వెళ్లడం తప్పదన్నట్లుగా వ్యాఖ్యానించారు. వాస్తవంగా చూసినా ఈ యేడాది ఎసిబి అధికారులు తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రెండువందల ఇరవై కేసులకుపైగానూటయాభై మందిని అధికారులను అరెస్టు చేశారు. ఇవన్నీ ప్రత్యక్షంగా డబ్బు తీసుకుంటూ పట్టుబడిన కేసులే. ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకే చిక్కిన కేసులుగానే చెప్పొచ్చు. అవినీతిలో మరోరకం మూడో మనిషి కంటికి కనపడదు. ఇచ్చిపుచ్చుకునే చేతులు రెండూఅదృశ్యంగానే ఉంటాయి.మూడో నేత్రానికి దృశ్యగోచరమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు,ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణగణాలు, గత, ప్రస్తుత పరిస్థితులను బట్టి వనరులు, తాహతును అంచనా వేసుకొని ఎవరికివారే ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే తప్ప ప్రత్యక్ష సాక్షులతో రుజువు చేయడం అసాధ్యం. ఇది పైస్థాయిలో అయితే మరింత కష్టం. ముడుపులు ఇచ్చినవారు ఇచ్చినట్లు కానీ, తీసుకున్నవారు తీసుకున్నట్లు కానీ ఏ పరిస్థితుల్లోనూ బయటకు చెప్పరు. ఎవరైనా ఆరోపణలు చేసినా ఇద్దరు కలిసి ఖండించడమే కాదు తమ పరువుకు భంగం కలిగించారంటూ న్యాయస్థానం మెట్లెక్కడానికి కూడా వెనుకాడరు. ఇక ప్రజలందరి ముందు వికృతరూపం దాల్చి నాట్యం చేసేది మరొకరకపు అవినీతి. అది ప్రజలకే కాదు పాలకులకు కూడా స్పష్టంగా తెలుసు. ప్రభుత్వం అప్రతిష్టపాలయ్యేది కూడా ఈ అవినీతితోనే. తెలుగు రాష్ట్రాల్లో ఈ అవినీతి అదుపు తప్పిపోతున్నది. చీకటిలో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతే పోయారు కనీసం ప్రజలను వేధిస్తూ కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతిని నియంత్రించకపోతే అప్రతిష్టపాలుకాక తప్పదు. అవినీతిని అదుపుచేయకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పు చేసినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని కోట్లు వసూలు చేసి సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు. ●

# నేతన్న ‘భరోసా’తో ఉజ్జ్వల భవిష్యత్

చిలగాని జనార్ధన్

శిక్షణ, ఉత్పత్తి, మార్కెటింగ్, తద్వారా వచ్చేలాభాలు.. పరిశ్రమ ఏదైనా ఈ మూల సూత్రాలపైనే భవితవ్యం ఆధారపడి ఉంటుంది. మారుతోన్న కాలానుగుణంగా డిమాండ్ ఉన్న వస్తువుల ఉత్పత్తితో పాటు మార్కెటింగ్ చేసి లాభాల బాటలో సాగకుంటే ఎప్పుడోకప్పుడు పతనం తప్పదు. గత బీఆర్‌ఎస్ పాలనతో తీసుకున్న కొన్ని నిర్ణయాలు చేనేత రంగ భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చేసింది. శరవేగంగా మారుతోన్న కాలానుగుణంగా వస్త్ర పరిశ్రమల్లో మార్పులను అంచనా వేయలేక, కేవలం ప్రభుత్వంపైనే ఆధారపడడం వల్ల నేడు చేనేత రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సవాల్‌ను స్వీకరించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ప్రణాళిక సిద్ధం చేస్తుంది. రాష్ట్రంలోని వస్త్ర పరిశ్రమను గట్టెక్కించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. చేనేత కార్మికులకు శిక్షణ, పెట్టుబడికి వడ్డీలేని రుణాలు, డిమాండ్ ఉన్న వస్త్రాలు కార్మికులు తయారు చేయడం లేదనే విమర్శలున్నాయి. చేనేత వస్త్రాలు కొనుగోలు చేయాలని ఉన్నా అందుబాటులో లేకపోవడంతో మార్కెట్‌లో కొనుగోలు చేసి ధరిస్తున్నారు ఉద్యోగులు. గతంలోనూ శిక్షణ కేంద్రం ద్వారా మార్కెట్‌కు అనుగుణంగా చేనేత ఉత్పత్తులు జరిగేవి. మార్కెటింగ్ ద్వారా లాభాలు కూడా వచ్చేవి. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో 1990లో చేనేత శిక్షణ కేంద్రాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది.



2006 తరువాత దీన్ని కరీంనగర్‌కు మార్చారు.రాజకీయ, నాటకీయ పరిణామంలో భాగంగా 2014 డిసెంబరు చివరన తిరిగి సిరిసిల్లకు కేంద్రాన్ని తరలించి మూసి వేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో హైదరాబాద్ వీవర్ సర్వీసింగ్ సెంటర్‌కూడాఉంది. ఇది కూడా నామమాత్రం.గత ప్రభుత్వాల నిర్లక్ష్యం ఇందుకు అద్దం పడుతుంది. అత్యాధునిక పద్ధతిలో డిమాండ్ ఉన్న వస్త్రాలు కార్మికులకు శిక్షణ ఇచ్చి ఆయా రకాల ఉత్పత్తులతో లాభాలు ఆర్జించే అవకాశాలున్నా,ఆ దిశగా చర్యలేవీ చేపట్టడం లేదు. దీంతో మార్కెట్ పోటీకి అనుగుణంగా వస్త్రోత్పత్తులు జరగని పరిస్థితులు ఏర్పడ్డాయి. పదేళ్లక్రితంవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్లస్టర్లుగా ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేవి. గత పదేళ్లుగా ఈ ఊసే లేదు. దీనికితోడు టెస్కోను విస్తరించి బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే విధంగా కృషి కూడా జరగలేదు. తెలంగాణలోని పేరెన్నిక గల వస్త్రాలు మంచి డిమాండ్ ఉండేది. కరీంనగర్ జిల్లాకు చెందిన కొత్తపల్లి దోవతులు, చీరలు పోచంపల్లి చీరలు, కాటన్ షర్టింగ్..ఇలా పలు వస్త్రాలు ఎంతధరైనా చెల్లించి కొనుగోలు చేసేవారు. ప్రభుత్వాలు ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన ఉండేది. గతంలో ఆప్కో ట్రేడ్‌మార్క్‌తో వస్త్రాలు విరివిగా అమ్ముడుపోయేవి. దురదృష్టవ శాత్తు గత పదేళ్ల కాలంలో టెస్కో పూర్తిస్థాయిలో నిర్వీర్యమైంది. ప్రస్తుతం టెస్కోగుర్తింపు,నాణ్యత, నమ్మకాన్ని మార్కెట్‌లో పెంచాల్సిన అసరం ఎంతైనాఉంది. ఆ దిశగా కృషి జరగాలి. చేనేత సంఘాల్లో ఉత్పత్తి అయ్యే వస్త్రాల నాణ్యతను గుర్తించేలా టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి.ఇందులోని నిపుణులు సర్టిఫైడ్ చేసి నాణ్యతను గుర్తించి మార్కెట్‌లో విక్రయాలు చేయించాలి. ●

# విద్య ఇక్కడ..ఉద్యోగాలు విదేశాల్లోనా!

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంలో ఉత్తమమైన విద్యాభ్యాసంలో పరిపూర్ణత సాధించిన కొందరు విద్యావంతులు దేశంలో సామాజిక ఆర్థికశాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభను చాటుతున్న అప్పటికి,కొన్ని దశాబ్దాలుగా దేశంలోని ప్రముఖ సాంకేతిక కళాశాలలో అభ్యసించిన విద్యార్థులు మరికొందరు ప్రతిభ నైపుణ్యం కలిగి ఉండి విదేశాల్లో ఉద్యోగుల కొరకు వెళ్తున్న క్రమంలో స్వదేశానికి ఉపయోగపడవలసిన అత్యున్నతమేధాశక్తిని విదేశాలు అందిపుచ్చుకుంటూ ఉన్నాయా అనే సంశయం కలగకమానదు. కారణాలు ఏవైనా విదేశాల్లో వేతనాలు ఎక్కువగా ఉంటున్నాయా లేక ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉంటున్నాయా అనే భావనతోనైనా కావచ్చేమో నిజమైనా కాకపోయినా భారతదేశంలోని శాస్త్ర ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగినటువంటి చాలామంది విద్యావంతులు విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారా అనే సంశయం కలగక మానదు. భారతదేశానికి స్వతంత్రం వచ్చే నాటికి దేశంలోని ప్రజలలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని గణాంకాలు చెప్తున్నాయి. దేశంలో ఆర్థిక వ్యవస్థ కూడా అంతంత మాత్రంగానే ఉండడం ఒకవైపు, పేదరికం మరోవైపు. ఆర్థిక వ్యవస్థ అనుకున్న రీతిలోలేకపోవడం వల్ల అధిక స్థాయిలో విద్యా ప్రమాణాలను అందరికీ అందించడంలో కొంత ఆలస్యంగా జరిగిందనే భిన్న వాదనలు సమాజంలో లేకపోలేదు. తద్వారా ప్రజలు ఎక్కువగా వ్యవసాయ రంగం మీద ఆధారపడి జీవించేవారు. అనంతరం జరిగిన పరిణామ క్రమంలో గణనీయంగా విద్యకు ప్రాముఖ్యత అవసరం కావడం దేశాభివృద్ధిలో అక్షరాస్యతక్రమం ప్రధానంగా మారింది. ప్రభుత్వాలు విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడంతో క్రమేణా దేశంలో అనేక రాష్ట్రాల్లో ప్రతిభావంతులైన బోధకుల చేత విద్య అభ్యసించిన వారిసంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ భారత దేశ జనాభాలో గణనీయంగా అక్షరాస్యత శాతం పెరుగుతూ వస్తున్నది.ఎక్కువగా ఇంజనీరింగ్ విద్యావ్యవస్థకు భారతదేశంలో ఉన్న అన్ని యూనివర్సిటీలు ఉత్తమమైన నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. దీనివల్ల ఇంజినీరింగ్ వ్యవస్థ అనేది భారతదేశంలో విస్తృతంగా ఉపాధి అవకాశాలు ఉన్న వ్యవస్థగా మారింది. ఇంజినీరింగ్ చదువుకున్న విద్యార్థులు డిగ్రీలు పుచ్చుకొని స్వదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లోనూ ఉపాధి అవకాశాలను పొందుతున్నారు.అయితే చాలావరకు భారతదేశంలోని ఇంజినీరింగ్ చదివి ప్రతిభా నైపుణ్యం ఉన్న వారిని స్వదేశంలో ఉపాధి కంటే విదేశాల్లో ఉపాధి అవకాశాలు ఆకర్షించయో ఏమోకానీ చాలామంది ఉన్నత విజ్ఞానవంతులు కూడా భారత దేశాన్నివిడిచి ఆసియా దేశాలు,అమెరికా, ఆస్ట్రేలియా ,యూరప్ లాంటి అనేక దేశాల్లో ఉన్న ప్రముఖ సంస్థల్లో పారిశ్రామిక వాణిజ్య వ్యవస్థలలో చేరడానికి స్వదేశంలో చదివిన నాణ్యమైన విద్య విదేశాల్లో ఎంతగానో ఉపయోగక



రంగా ఉంటుందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. దీనితో భారతదేశంలో ఉన్న సాంకేతిక విద్యావ్యవస్థకు అగ్రదేశాలు, పాశ్చాత్య దేశాల్లో కూడా మంచి విలువలు ఉంటున్నాయి అనే వాదనలు బలపడుతూ వస్తున్నాయి. ప్రాచీన కాలం నుండి అనేక సంస్కృతి సాంప్రదాయాలకు ఆచార వ్యవహారాలకు నిలయమై ఉన్న భారత దేశంలో బహుముఖ ప్రజ్ఞ కలిగినటువంటి అనేకమంది విజ్ఞానవేత్తలు, జ్ఞానులు తత్వవేత్తలు,రాజకీయ వేత్తలు మరెందరో ప్రముఖులు భారతదేశ ప్రాచీన ఆధునిక చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోయి భారత దేశం ప్రఖ్యాతి ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసినవారు లేకపోలేదు.ప్రాచీన కాలం నుండి కూడా భారతదేశం విద్యాపరంగా ప్రపంచవ్యాప్తంగా మూల బిందువుగా ఉండేదనినలందా, తక్షశిల లాంటి విశ్వవిద్యాలయాల్లో అనేక దేశాల నుండి అభ్యాసకులు వచ్చి విద్యను అభ్యసించి వెళ్లే వారని చరిత్రకారులు చెపుతారు. కానీ భిన్నంగా తరచుగా స్వదేశంలో ఉన్న విద్యావంతులు వేరేదేశాల్లో ఉన్నత చదువులకు ఉద్యోగాలకు వలసలు వెళుతున్న దృశ్యాలు అడపాదడపా గోచరిస్తుండడం ఆశ్చర్యకరం. సుమారు మూడు దశాబ్దాల నుండి చాలామంది భారతదేశంలో ఇంజినీరింగ్ విద్యలో పరిపూర్ణమైన నైపుణ్యత గల విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి అమెరికా ఆస్ట్రేలియా యూరప్ దేశాల్లో ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయడం,చాలామంది ఆయాదేశాల్లో పౌరసత్వం తీసుకుని స్థిరపడడం కూడా జరుగుతూ వచ్చింది. దీనితో స్వదేశంలో ఉత్తమమైన విద్యను అభ్యసించి సాంకేతిక రంగాల్లో నిపుణత కలిగిన ప్రతిభావంతుల నైపుణ్యతను మేధాసంపత్తిని పాశ్చాత్య దేశాలు విరివిగా ఉపయోగించుకుంటున్నాయా అనే వాదనలు తెరపైకి వస్తున్నాయి.కానీ స్వదేశం మీద అభిమానం కలిగి అనేక విషయాలపై నిపుణత కలిగిన విద్యావంతులు, మేధావులు, అన్నిరంగాల్లో క్షేత్రస్థాయిలో అత్యున్నతమైన ప్రతిభను ప్రదర్శిస్తూ భారతదేశాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకుపోతున్న వారు లేకపోలేదు. అలాంటి వారు విదేశాలకువెళ్లి ఏదో సాధించుకోవాలని కాకుండా దేశభక్తి,దేశ అభిమానంతోపాటు దేశానికి ఎంతో కొంత సేవచేయాలని వారికున్న జ్ఞానాన్ని స్వదేశానికి అంకితపరుస్తూ శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా, ఇంజినీర్లుగా, అనేక రకాలైనటువంటి టెక్నీషియన్లుగా, పరిశోధకులుగా మరెన్నో విషయాలలో తమవంతు కృషి చేస్తుండడం శుభపరిణామం. స్వదేశంలో ఉత్తమమైన విద్యను, పరిపూర్ణ విజ్ఞానాన్ని సంపూర్ణంగా నేర్చుకుంటున్న యువత భారతదేశ పురోగతిలో సమాజ అభివృద్ధి కొరకు తోడ్పడే విధంగా మరింతగా తమ వంతు పాత్ర పోషించాల్సి ఉంది. అయినప్పటికీ,చాలావరకు స్వదేశంలో ఉన్నతవిద్యను అభ్యసించిన యువత విదేశాల వైపు పరుగులు పెడుతుండడం సర్వసాధనమైపోతుందా అనిపిస్తుంది. ఈవిధానంలో పాశ్చాత్య దేశాలఅభివృద్ధిలో భారతీయ మేధావులు ఆయాదేశాల్లో వివిధ రంగాల్లో ప్రత్యక్షంగా పరోక్షంగా భాగస్వాములు అవుతున్నారా అనే సంశయం కలగక మానదు. ఏదిఏమైనప్పటికీ భారతదేశంలో అత్యున్నతమైన మేధాసంపత్తి కలిగిఅన్ని రంగాల్లో నైపుణ్యం కలిగినటువంటి ప్రతిభావంతులు మారుతున్నకాలానికి అనుగుణంగా స్వదేశంలోనే అధునాతన శాస్త్ర సాంకేతిక పోకడలతో మరింతగా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని ఆశించడంలో సందేహంలేదేమో. ●

# ప్రజావాక్కు



### విద్యుత్ వాహనాలే సరైన పరిష్కారం

**పర్యావరణపరిరక్షణ**,ఇంధనభద్రత అనేసవాళ్లకు విద్యుత్ వాహనాలే సరైన పరిష్కారం. పెరుగుతున్న చమురు ధరలు,కాలుష్య కోరలనుండి దేశాన్నిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం ఈడ్రైవ్ వంటి పథకాల ద్వారా భారీ ప్రోత్సాహకాలు అందిస్తోంది.దాదాపురూ.10,900 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలుపై గణనీయమైన రాయితీలు లభిస్తున్నాయి.గణాంకాలప్రకారం,2025 నాటికి దేశంలో ఈవీల సంఖ్య 65 లక్షలకు చేరడం, ఏడాదిలోనే 34 శాతం వృద్ధి నమోదు కావడం శుభపరిణామం. కర్ణాటక ‘ఈవీ రాజధాని’గా ఎదుగుతుండగా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న 30 వేల ఛార్జింగ్ కేంద్రాలను భవిష్యత్తు అవసరాల కోసం 15 లక్షలకు పెంచాల్సి ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### విరమించిన కార్యాచరణ

**ఎట్టకేలకు** కేంద్ర ప్రభుత్వం తాను ఖనిజాలకోసం దాదాపు 800 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల మధ్య భూగర్భ ఖనిజాలను వెలికి తీయడానికి ప్రాథమికంగా సమ్మతించినా, అపోజిషన్ నాయకులు ఇతర మేధావులు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఆరావళి శిఖర శ్రేణుల విధ్వంసం వలన కలిగే ప్రకృతి విలయాలను విశదీకరించడం వలన కాబోలు కేంద్ర ప్రభుత్వం తన కార్యాచరణను విరమించుకుని మంచిపని చేసింది.

- ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### గురువుల పిల్లలకు సీట్లు ఇవ్వాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలలోని గురువుల యొక్క పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరం నుండి గురుకుల గురువుల పిల్లలకు కూడాగురుకులాలలో ఉచితసీట్లు కేటాయించాలి. బాలుర గురుకులాలలో ఒక సీటు. బాలికల గురుకులాలలో ఒక సీటు గతంలో ఉన్న ప్రత్యేక జీవోను వచ్చే విద్యా సంవత్సరం నుండి తప్పనిసరిగా అమలు చేయాలి. రాష్ట్రంలో ఉన్న 2 సైనిక్ స్కూల్‌లలో కూడా ఈ విధానం అమలు చేయాలి. గురుకులాలలోని గురువుల పిల్లలకు తప్పనిసరిగా ఉచిత సీట్లు ఇచ్చి దేశంలోనే ఆదర్శంగా నిలవాలి.

- రాపాక రవీందర్, జనగాం

### పంచాయతీలకు నూతన సంవత్సర కానుక

**నూతన** సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి దిశానిర్దేశం చేసే కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రముఖ్యమంత్రి గ్రామపంచాయతీలకు ప్రత్యేకఆర్థిక సహాయం ప్రకటించడం గ్రామీణస్వయంపాలన వ్యవస్థకు ఊతమిచ్చే చర్యగా భావించవచ్చు. చిన్న గ్రామ పంచాయతీలకు రూ.5 లక్షలు, ప్రధాన గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించడం ద్వారా ప్రభుత్వం గ్రామాల అవసరాలనుగుర్తించినట్లుస్పష్టమవుతోంది.గ్రామ పంచాయతీలు గ్రామస్థాయిలో పరిపాలనకు పునాది వంటివి.తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధిదీపాలు, అంతర్గత రహదారులు, పచ్చదనం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పంచాయతీల పాత్ర ఎంతో కీలకం. కానీచాలాసార్లు నిధుల కొరత కారణంగా చిన్నచిన్న అభివృద్ధి పనులు కూడా ఆలస్యమవుతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయడం గ్రామీణ సమస్యలకు తక్షణ పరిష్కారాలను అందించే అవకాశాన్ని కల్పిస్తుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### అవగాహన అవసరం

**ఈమధ్య** కాలంలోవివిధ రకాల ప్రకృతి, పారిశుధ్యం లోపాలు, వ్యక్తుల అజాగ్రత్త మూలాన కొత్తవ్యాధులు బయటపడుతున్నాయి. అదే కోవకు చెందిన స్క్రబ్ టైఫ్స్ వల్ల కూడా రాష్ట్రంలో ప్రస్తుతం మరణాలు పెరిగినవి. బాధితులు తక్కువైన , వీటి లక్షణాలు తెలియక మరికొందరికి ఎక్కువ కావొచ్చు. సరైన మందుఅందక ఆలస్యంవల్ల మరణం సంభవించవచ్చు.ముందు జాగ్రత్తగా అన్ని ప్రధాన ఆసుపత్రుల్లో ఈ వార్తను ప్రజలకు నోటీసు బోర్డు ద్వారా తెలియజేస్తే చికిత్స మార్గం ద్వారా వ్యాప్తి, ప్రాణనష్టం నివారణ సాధ్యం కాగలదు.

-బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### ఉచిత ప్రయాణం పేద విద్యార్థి హక్కు

ప్రభుత్వం మహిళల పేరిట ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు పరిచింది. వెంటనే ఈ ఉచిత ప్రయాణ వసతిని తొలగించాలి. ఉచితబస్సు ప్రయాణం పేదవిద్యార్థులకు చెందవలసిన హక్కు మాత్రమేకానీ రాజకీయ వ్యూహాలతో అనవసర పథకాలు పెట్టాల్సినపనిలేదు.పథకాలుపేదవాడికి భరోసానివ్వాలికానీ భారాన్ని మిగల్చొద్దు. కాబట్టి ఈ పథకాన్ని రద్దుపరిచి దీని స్థానంలో పేద విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి.

-కె. నిఖిత, నల్గొండ జిల్లా

**మనవి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# నైజీరియాలో అమెరికా సైన్యం భీకర దాడులు

## హ్యాపీ క్రిస్మస్ అంటూ ట్రంప్ పోస్టు!

**అబూజా, డిసెంబరు 26:** నైజీరియాలో ఐసిస్ (ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా) ఉగ్రవాద స్థావరాలపై అగ్రరాజ్యం అమెరికా సైన్యం విరుచుకుపడింది. నైజీరియాలో క్రైస్తవుల హత్యలను ఆపాలని ఐసిస్‌ను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన కొద్ది రోజుల్లోనే ఈ దాడులు చేపట్టడం గమనార్హం. క్రైస్తవులను దాడులను నిరోధించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ట్రంప్ స్పష్టం చేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. వాయువ్య నైజీరియాలోని ఐసిఎస్ ఉగ్రవాదులే లక్ష్యంగా తమ సైన్యం భీకర దాడులు నిర్వహించినట్టు పేర్కొన్నారు. 'నైజీరియాలో ఐసిస్ ఉగ్రవాదులపై అమెరికా శక్తిమంతమైన దాడులు చేపట్టింది. ముఖ్యంగా అమాయక క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దారుణ హత్యలకు పాల్పడుతున్న వారిపై ఇవి జరిగాయి. ఈ ఊచకోతలు ఆపకపోతే నరకం చూపిస్తానని గతంలోనే హెచ్చరించాను. అయినా వాటిని ఉగ్రవాదులు పెడచెవిన పెట్టి ఇప్పుడు దానికి ఫలితం అనుభవిస్తున్నారు. రాడికల్ ఇస్లామిక్ తీవ్రవాదాన్ని సహించను' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. 'మన సైన్యానికి ఆ భగవంతుడు ఆశీస్సులు ఉండాలి.. హతమైన ఉగ్రవాదులు సహా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు.. ఈ హత్యాకాండ కొనసాగితే.. మా దాడులు కూడా జరుగుతూనే ఉంటాయి..' అని అమెరికా అధ్యక్షుడు వార్నింగ్ ఇచ్చారు. నైజీరియా అభ్యర్థన మేరకు దాడులు చేపట్టి, పలువురు ఉగ్రవాదులను హతమార్చినట్టు అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది. కాగా, నైజీరియా అధికారుల అభ్యర్థన మేరకు (సోకోటో రాష్ట్రంలో) ఒక దాడిని నిర్వహించి.. పలువురు ఐసిస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు అమెరికా ఆఫ్రికా కమాండ్ ఎక్స్ (ట్విట్టర్) పోస్టులో తెలిపింది. పెంటగాన్ చీఫ్ పెటే హెగ్‌సేథ్ సైతం నైజీరియాలో తమ సైన్యం చర్యలు, సంసిద్ధతపై ప్రశంసలు కురిపించారు. ఈ విషయంలో నైజీరియా ప్రభుత్వ మద్దతు, సహకారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక, అమెరికా దళాలు నైజీరియాలో ట్రంప్ ఆధ్వర్యంలో మొదటిసారిగా దాడులు చేశాయి. అక్టోబరు, నవంబరు నెలల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నైజీరియాపై తీవ్ర విమర్శలు చేశారు. అక్కడ క్రైస్తవులు అస్తిత్వ ముప్పు ఎదుర్కొంటున్నారని, ఇది జాతి నిర్మూలనతో సమానమని ఆయన అన్నారు.

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

## ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం

## గాలి నాణ్యత ఎక్యూఐ 400గా నమోదు

## ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించలేం..

## ఢిల్లీ హైకోర్టులో తేల్చిచెప్పిన కేంద్రం

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు పెరుగుఒతంది. ప్రమాదకర స్థాయిలో పెరుగుతోందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం హానికర పొగమంచు ఢిల్లీలోని అనేక ప్రాంతాలను కమ్మేసింది. దీంతో దృశ్య నాణ్యత కూడా బాగా పడిపోయింది. గాలి నాణ్యత గణనీయంగా క్షీ ణించింది. ఢిల్లీ వ్యాప్తంగా గాలి నాణ్యత సూచి (ఏక్యూఐ) గురువారం ఉదయం 220గా నమోదైంది. ఓ సమయంలో 310గా కూడా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. అదే శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచి 400గా నమోదైనట్లు తెలిపింది.

ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది.

ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), విమానాశ్రయం ప్రాంతంలో (239)గా గాలి నాణ్యత నమోదైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాయుకాలుష్యం తీవ్రంగా ఉండటంతో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 4 కింద ఢిల్లీ ప్రభుత్వం ఆంక్షలు అమలు చేస్తోంది.

**ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించలేం: కేంద్రం**

ఢిల్లీలో గాలి కాలుష్యం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించాలన్న అభ్యర్థనను కేంద్రం తోసిపుచ్చింది. అది ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రముఖ న్యాయవాది కపిల్ మదన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు జిఎస్‌టి తగ్గింపు అంశంపై వివరణాత్మక స్పందన తెలియజేయాలని కోరిన నేపథ్యంలో శుక్రవారం మరోసారి చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. జిఎస్‌టి తగ్గింపుపై నిర్ణయం తీసుకునేందుకు జిఎస్‌టి మండలికి ఇబ్బందేమిటని ప్రశ్నించింది. వైద్య పరికరాల వర్గీకరణను ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని, ఈ విషయంపై జిఎస్‌టి కౌన్సిల్ నిర్ణయం తీసుకోలేదని తెలిపింది. జిఎస్‌టి కౌన్సిల్ ఒక రాజ్యాంగ సంస్థ అని.. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇందులో పాల్గొంటున్నందున జిఎస్‌టి తగ్గింపు ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయలేమని కేంద్రం తరపున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్ వెంకట్రామన్ అన్నారు. ఈ విషయంపై వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం ఇవ్వాలని ఆయన కోర్టును కోరారు. దీంతో కోర్టు 10 రోజుల సమయం ఇచ్చింది. తదుపరి విచారణ 9కివాయిదా.

# పెంచిన రైల్వేఛార్జీలు అమల్లోకి!



**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశవ్యాప్తంగా రైల్వేశాఖ పెంచిన రైలు ఛార్జీలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ ఏడాది జులైలో ఒకసారి ఛార్జీలు పెంచిన రైల్వే శాఖ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. మెయిల్/ఎక్స్‌ప్రెస్, ఏసీ క్లాసులతో పాటు, 215 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే ఆర్డినరీ నాన్ ఏసీ క్లాసులపై కూడా ఈ పెంపు ప్రభావం చూపనుంది. అయితే, సబర్బన్ (లోకల్) రైళ్లు, సీజన్ టికెట్లకు ఈ పెంపు నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం సామాన్య ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే అంశం. భారీగా పెరిగిన నిర్వహణ ఖర్చులు, ముఖ్యంగా సిబ్బంది జీతభత్యాలు రూ.1,15,000 కోట్లు, పెన్షన్ల బిల్లు రూ.60,000 కోట్లు భారాన్ని తగ్గించుకునేందుకే ఈ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు రైల్వే మంత్రిత్వ శాఖవెల్లడించింది. ఈ పెంపు ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సుమారు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఛార్జీలు పెంచినప్పటికీ, ఇప్పటికీ ప్రయాణికుల టికెట్ ధరలో దాదాపు 50 శాతం సబ్సిడీ రూపంలో తామే భరిస్తున్నామని రైల్వే శాఖ పేర్కొంది. రైల్వే బోర్డు జారీ చేసిన కమర్షియల్ సర్క్యులర్ నం. 24 ప్రకారం, ఛార్జీల పెంపు సబర్బన్, సీజన్ టికెట్లకు ఎలాంటి మార్పు లేదు. ఆర్డినరీ నాన్‌ఏసీ 215 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారికి పాత ఛార్జీలే వర్తిస్తాయి. ఆ తర్వాత దూర ప్రయాణాలపై శ్లాబుల వారీగా రూ.5 నుంచి రూ.20 వరకు పెంచారు. స్లీపర్ క్లాస్ (ఆర్డినరీ): కిలోమీటర్‌కు 1 పైసా పెరిగింది. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్‌ఏసీ, ఏసీ క్లాసులు స్లీపర్, ఏసీ చైర్ కార్, ఏసీ 3టైర్, 2టైర్, ఫస్ట్ క్లాస్‌తో పాటు రాజధాని, శతాబ్ది, వందే భారత్ వంటి అన్ని ప్రీమియం రైళ్లలో కిలోమీటర్‌కు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి. ఈనెల 26కు ముందే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. రిజర్వేషన్ ఫీజు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జ్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు.

**ప్రభుత్వంపై విపక్షాల తీవ్ర విమర్శలు**

రైలు ఛార్జీల పెంపుపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, "మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్నీ వదలడం లేదు. బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు, పార్లమెంటులో చర్చ లేకుండా ఛార్జీలు పెంచారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం కనుమరుగైంది" అని విమర్శించారు. రైల్వే భద్రతా వ్యవస్థ కవచ్ కేవలం 3 మార్గాలకే పరిమితమైందని, ఇది కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

# వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వమే మేలు

## చీఫ్ జస్టిస్ సూర్యకాంత్



**పనాజి, డిసెంబరు 26:** వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో విజయవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రక్రియ అని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇది కేసులోని ఇరుపక్షాలకూ గెలుపుగెలుపు పరిస్థితిని కల్పిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈరోజు గోవాలోని పనాజీలో మధ్యవర్తిత్వంపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన పాదయాత్రలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో మధ్యవర్తి ఎవరిపైనా తమ నిర్ణయాలను రుద్దరని సీజేఐ స్పష్టం చేశారు. వివాదంలో ఉన్న పక్షాలు కోరుకున్న పరిష్కారాన్నే దీని ద్వారా సాధించవచ్చని తెలిపారు. ఇది ఇరువర్గాల అంగీకారంతో జరిగే పరిష్కారం కాబట్టి, ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు. సుప్రీంకోర్టు ఖిదేశం కోసం మధ్యవర్తిత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించిందని జస్టిస్ సూర్యకాంత్ వెల్లడించారు.

న్యాయవ్యవస్థలోని భాగస్వాములైన న్యాయవాదులు, న్యాయమూర్తులతో పాటు సాధారణ ప్రజలకు కూడా దీని ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం ఒక విజయవంతమైన సాధనమని ప్రజలు గుర్తించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. కొన్ని ప్రత్యేక కేసులను మధ్యవర్తిత్వానికి పంపమని హైకోర్టులను, జిల్లా కోర్టులను ఒప్పించగలిగామని తెలిపారు. ఇది పాత, కొత్త కేసులకే కాకుండా, కోర్టుకు రాకముందు దశలో (ప్రీలిటిగేషన్) ఉన్న వివాదాలకు కూడా వర్తిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు.

# అయోధ్యలో కొరియా రాణి విగ్రహావిష్కరణ



**అయోధ్య, డిసెంబరు 26:** భారత్, దక్షిణ కొరియాల మధ్య ఉన్న పురాతన సాంస్కృతిక బంధానికి ప్రతీకగా శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో కొరియా రాణి హెయో హ్వాంగ్‌ఓక్ (సురిరత్న) కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. సుమారు 2000 ఏళ్ల క్రితం అయోధ్యకు చెందిన యువరాణి కొరియాకు వెళ్లి అక్కడి రాజును వివాహమాడారనే చారిత్రక విశ్వాసానికి గుర్తుగా ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కొరియన్ ఇతిహాసాల ప్రకారం, క్రీ.శ. 48లో అయోధ్య రాజు తన కుమార్తె సురి రత్నను, దైవాజ్ఞ మేరకు సముద్ర మార్గంలో కొరియాకు పంపారు. అక్కడ ఆమె గయ సామ్రాజ్య స్థాపకుడైన రాజు కిమ్ సురోను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు పది మంది సంతానం కలగగా, వారి వారసులనే నేడు దక్షిణ కొరియాలో కరక్ తెగగా పిలుస్తారు. సుమారు 60 లక్షల మంది ఉన్న ఈ తెగ ప్రజలు, తమ మూలాలు అయోధ్యలోనే ఉన్నాయని దృఢంగా విశ్వసిస్తారు. ఈ బంధాన్ని గౌరవిస్తూ 2001లోనే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, దక్షిణ కొరియాలోని గిమ్హే నగరం కలిసి సరయూ నది ఒడ్డున రాణి సురి రత్న పేరుతో ఒక స్మారక పార్కును నిర్మించాయి. కొరియా ప్రతినిధుల కోరిక మేరకు ఇటీవల ఈ పార్కును మరింత సుందరీకరించి, తాజాగా రాణి కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. 2018లో దక్షిణ కొరియా ప్రథమ మహిళ కిమ్ జంగ్‌సూక్ భారత పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి ఈ పార్కు అభివృద్ధి పనులను ప్రారంభించడం గమనార్హం. ప్రతి ఏటా కరక్ తెగకు చెందిన వందలాది మంది కొరియన్లు అయోధ్యకు వచ్చి తమ పూర్వీకురాలిని స్మరించుకుంటారు. ఈ విగ్రహ ఏర్పాటుతో అయోధ్య, గిమ్హే నగరాల మధ్య ఉన్న సోదర బంధం మరింత బలపడింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య కేవలం దౌత్యపరమైన సంబంధాలకే కాకుండా, చారిత్రక, సాంస్కృతిక బంధానికి నిలువుటద్దంగా నిలుస్తోంది.

# సీక్రెట్‌గా ఫోన్ వాడుతోందని భార్యను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టిన భర్త



**గోరఖ్‌పూర్, డిసెంబరు 26:** భార్య రహస్యంగా మొబైల్ ఫోన్ వాడుతోందన్న కోపంతో ఓ భర్త ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని ఇంటి వెనుకే గొయ్యి తీసి పూడ్చిపెట్టి, ఆమె ఆత్మహత్య చేసుకుందని పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశాడు. లూథియానాలో కూలీగా పనిచేసే అర్జున్, ఈ నెల 21న యూపి గోరఖ్‌పూర్‌లోని తన ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో అతని భార్య ఖుష్బూ రహస్యంగా మొబైల్ ఫోన్ వాడటాన్ని గమనించాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన అర్జున్, ఖుష్బూ గొంతు నులిమి హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటి వెనుక ఆరడుగుల గొయ్యి తవ్వి, ఓ మడత మంచం సహా ఆమె మృతదేహాన్ని అందులో పూడ్చిపెట్టాడు. అనంతరం ఖుష్బూ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులను నమ్మించాడు. రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ లభించకపోవడంతో ఖుష్బూ తండ్రి తన అల్లుడిపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు అర్జున్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, మృతదేహాన్ని నదిలో పడేశానని చెప్పాడు. పోలీసులను గ్రామ సమీపంలోని నదీ తీరానికి తీసుకెళ్లి గంటలపాటు తప్పుదోవ పట్టించాడు. నదిలో గాలింపు విఫలమవడంతో పోలీసులు తమదైన శైలిలో అర్జున్‌ను మరోసారి విచారించగా, అతను నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ఇంటి వెనుక తవ్వకాలు జరపగా మృతదేహం లభ్యమైందని గోరఖ్‌పూర్ సర్కిల్ ఆఫీసర్ శిల్పా కుమారి తెలిపారు. వివాహేతర సంబంధంపై అనుమానంతోనే అర్జున్ ఈ హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్న ఈ దంపతులకు పిల్లలు లేరు.

# సంక్షిప్తంగా..

## 31న గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దేశవ్యాప్తంగా యాప్ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్న గిగ్ వర్కర్లు మరోసారి ఆందోళన బాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్ల సాధన కోసం నూతన సంవత్సర వేడుకల రోజైన డిసెంబర్ 31న దేశవ్యాప్త మెగా సమ్మెకు పిలుపునిచ్చారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ వంటి ప్రధాన కార్మిక సంఘాలు ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నాయి. స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ సంస్థల డెలివరీ భాగస్వాములు ఈ సమ్మెలో పాల్గొననున్నారు. ఈనెల 31న తలపెట్టిన ఈ మెగా సమ్మెకు ముందు, క్రిస్మస్ పండుగ రోజైన 25న కూడా గిగ్ వర్కర్లు ఫ్లాష్ స్ట్రైక్ నిర్వహించారు. గురుగ్రామ్, హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ సమ్మె ప్రభావం స్పష్టంగా కనిపించింది. గురుగ్రామ్‌లో ఫుడ్ డెలివరీ సేవలకు తీవ్ర అంతరాయం కలగగా, హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో 2,000 మందికి పైగా కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

## తిరువనంతపురం మేయర్‌గా బిజెపి అభ్యర్థి రాజేశ్



**తిరువనంతపురం, డిసెంబరు 26:** కేరళ రాజకీయాల్లో బీజేపీ సరికొత్త రికార్డు సృష్టించింది. తిరువనంతపురం కార్పొరేషన్ మేయర్‌గా బీజేపీ నేత వి.వి. రాజేశ్ (49) ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆయన 51 ఓట్లతో విజయం సాధించారు. రాష్ట్ర చరిత్రలో ఒక బీజేపీ నేత మేయర్ పీఠాన్ని అధిరోహించడం ఇదే తొలిసారి కావడంతో ఇది ఒక చరిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ కూటమి (ఎల్‌డీఎఫ్) అభ్యర్థి ఆర్.పి. శివాజీకి 29 ఓట్లు రాగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. శబరినాథన్‌కు 19 ఓట్లు మాత్రమే లభించాయి. ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

## టొరాంటో వర్సిటీలో భారతీయ విద్యార్థి హత్య!



**ఒట్టావా, డిసెంబర్ 26:** కెనడాలో మరో ఘోరం జరిగింది. ఇటీవల టొరంటోలో 30 ఏళ్ల భారతీయ మహిళ హిమాన్షి ఖురానా హత్య ఘటన మరువక ముందే మరో భారతీయ విద్యార్థి శివంక్ అవస్థి (20) హత్యకు గురయ్యాడు. దీంతో భారతీయుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. టొరంటో విశ్వవిద్యాలయంలోని స్కార్‌బరో క్యాంపస్ సమీపంలో 20 ఏళ్ల భారతీయ విద్యార్థి శివాంక్ అవస్థిపై దుండగుడు కాల్పులు జరిపాడు. తీవ్ర గాయాలతో ఉండగా పోలీసులు గమనించారు. ఆసుపత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఏడాది టొరంటోలో జరిగిన 41వ హత్య కేసుగా పోలీసులు తెలిపారు.

## లాలూఫ్యామిలీకి షాక్.. ప్రభుత్వ బంగ్లా నుంచి వస్తువులు తరలింపు



**పాట్నా, డిసెంబర్ 26:** ఎట్టకేలకు లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేసింది. పాట్నాలోని 10 సర్క్యులర్ రోడ్‌లోని బంగ్లాలో 19 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నారు. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆర్జేడి ఘోర పరాజయం పాలైంది. ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలని లాలూ కుటుంబానికి నోటీసులు ఇచ్చింది. దీనిపై గత కొద్దిరోజులుగా రాజకీయ దుమారం కొనసాగుతోంది. ఖాళీ చేసేందుకు నిరాకరించింది. ముఖ్యమంత్రులుగా పని చేసిన తమకు బంగ్లాను కేటాయించారా? అని ఆర్జేడీ నిలదీసింది. పైగా లాలూ ప్రసాద్‌కు అనారోగ్యం కారణంగా ఇదే బంగ్లా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కానీ ప్రభుత్వం నిరాకరించింది.

# దాయాది పాకిస్థాన్‌కు మరిన్ని కష్టాలు

## వైమానిక దళం ఏర్పాటుకు ఉగ్రసంస్థ టిటిపి ప్రణాళిక!



**కాబూల్, డిసెంబరు 26:** అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చినప్పటి ను తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) రెచ్చిపోతోంది. కొత్త యేడాదిలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేసింది. ఇందులో భాగంగానే పాక్ సైన్యానికి పోటీగా వైమానిక దళం ఏర్పాటు చేయడానికి సిద్ధపడింది. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పలు పోస్టులు చేసింది. ఈ వార్త పాక్ అధికారులను భయపెడుతోంది. 2026లో ఈ వైమానిక దళం ఏర్పాటు చేస్తామని టిటిపి ఓ ప్రకటనలో పేర్కొంది. సలీం హక్కానీ నాయకత్వంలో దీన్ని నడపనున్నట్లు తెలిపింది. దీంతోపాటు ప్రావిన్స్‌ల వారీగా మోహరింపులు, మిలిటరీ యూనిట్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మిలిటరీ కమాండర్లతో కూడిన రెండు కొత్త పర్యవేక్షణ జోన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. కాశ్మీర్, గిల్గిత్–బాల్టిస్థాన్‌తో సహా మరికొన్ని ప్రావిన్స్‌లను తమ అధీనంలోకి తీసుకోవాలని ప్లాన్ చేస్తోంది. మిలిటరీ యూనిట్లలో నాయకత్వ మార్పులు కూడా చేపట్టింది. 2022 నవంబరులో పాక్ ప్రభుత్వంతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని టిటిపి ముగించింది. ఆ తర్వాత నుంచి పాక్ భద్రతా దళాలు, పోలీసులు, అధికారులపై టిటిపి వరుస దాడులకు పాల్పడుతోంది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలోచిస్థాన్ ప్రావిన్స్‌లలో కార్యకలాపాలు విస్తరించింది. అఫ్ఘానిస్థాన్ భూభాగం నుంచి టిటిపి ఉగ్రదాడులకు పాల్పడుతుందని పాక్ అధికారులు ఆరోపిస్తున్నారు. అయితే, తాలిబన్ ప్రభుత్వం వీటిని ఖండిస్తోంది.

# మహిళా మేనేజర్‌పై సామూహిక అత్యాచారం..

## కంపెనీ సిఇఓతోపాటు మరో ఇద్దరి అరెస్టు

**జైపూర్, డిసెంబరు 26:** రాజస్థాన్‌లోని ఓ కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్న మహిళ గ్యాంగ్ రేప్‌నకు గురైంది. ఈ ఘటన ఉదయ్‌పూర్‌లో జరిగింది. ఆ కేసుతో సంబంధం ఉన్న ప్రైవేట్ కంపెనీ సిఇఒతోపాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ ప్రైవేటు కంపెనీలో సిఇఒగా పనిచేస్తున్న జితేశ్ సిసోడియా.. వారం క్రితం పుట్టినరోజు పార్టీ ఇచ్చాడు. ఆ పార్టీకి మహిళా మేనేజర్ కూడా హాజరయ్యారు. ఈ కేసులో మరో మహిళా ఎగ్జిక్యూటివ్, ఆమె భర్త గౌరవ్ సిరోహి నిందితులుగా ఉన్నారు. గురువారం ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారిని నాలుగురోజుల కస్టడీలోకి తీసుకున్నారు. బిఎన్ఎస్ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద సుఖేర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఉదయ్‌పూర్ ఎస్పీ యోగేశ్‌గోయల్ తెలిపారు. బర్త్‌డే పార్టీ ముగిసిన తర్వాత అతిథులు అందరూ వెళ్లిపోయారని, అయితే మహిళా ఎగ్జిక్యూటివ్.. లేడీ మేనేజర్‌ను ఇంటి వద్ద డ్రాప్ చేస్తానని చెప్పింది. కారులో బాధిత మేనేజర్‌తోపాటు సిసోడియా, సిరోహి ఉన్నారు. దారిలో ఓ చోట ఆగి సిగరెట్లు కొన్నారని, ఆ సిగరెట్ తాగిన తర్వాత స్పృహ కోల్పోయినట్లు మేనేజర్ చెప్పింది. మరుసటి రోజు మళ్లీ నిద్ర లేచినట్లు పేర్కొన్నది. అయితే తనపై లైంగిక దాడి జరిగినట్లు అప్పుడు గుర్తించినట్లు ఆమె తెలిపారు. బాధిత మహిళ ఇచ్చి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. నిందితుల్ని అరెస్టు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. లేడీ మేనేజర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఎస్పీ మాధురీవర్మకు దర్యాప్తు వివరాలు అందజేసినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీలోనూ రూ.5లకే భోజనం

## అటల్ క్యాంటీన్ పేరుతో ప్రారంభం

## 45 ప్రాంతాల్లో ప్రారంభించిన ప్రభుత్వం



**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** దక్షిణాది రాష్ట్రాల్లో పేదల కడుపు నింపుతున్న రూ.5లకే భోజనం పథకం తాజా గా దేశ రాజధాని ఢిల్లీలోనూ అందు బాటులోకి వచ్చింది. సిఎం రేఖా గుప్త నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని ఢిల్లీ నగర వ్యాప్తంగా 'అటల్ క్యాంటీన్' పేరుతో రూ.5లకే భోజన పథకానికి శ్రీకారం చుట్టింది. ఢిల్లీ నగరంలో 45 ప్రాంతాల్లో అటల్ క్యాంటీన్‌లను ప్రారంభించారు. త్వరలో 100 ప్రాంతాలకు విస్తరించాలని యోచిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేఖా గుప్త తెలిపారు. దేశరాజధాని ఢిల్లీలో నివసిస్తున్న పేదలు చాలా మంది ఆహారం లేక ఇబ్బందులు పడుతున్నారు. తమ ఆదాయంలో ఎక్కువ మొత్తాన్ని ఆహారం కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇతర మౌలిక అవసరాలకు వదలుకోవాల్సిన పరిస్థితి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎవరూ ఆకలితో బాధపడకూడదనే లక్ష్యంతో రూ.5లకే భోజనం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు సిఎం రేఖా గుప్త వివరించారు. అటల్ క్యాంటీన్ మెనూలో అన్నం, పప్పులు, కూరగాయలు, బ్రెడ్ వంటి పోషకాహార పదార్థాలుంటాయని తెలిపారు. వీటి ద్వారా పేదలు, కార్మికులు,

రోజువారీ వేతన జీవులు లబ్ధిపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

అటల్ క్యాంటీన్‌లు ప్రారంభించిన అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఢిల్లీ పట్టణాభివృద్ధి మంత్రి ఆశిష్ సూద్, బిజెపి నేతలతో కలిసి క్యాంటీన్‌లోనే భోజనం చేశారు.

## ప్రాథమిక స్థాయి నుంచి వార్తాపత్రికలు చదవాల్సిందే: యుపి సర్కార్

**లక్నో, డిసెంబరు 26:** విద్యార్థులు మొబైల్‌ఫోన్లకు బానిసలు కాకుండా చూడటంతోపాటు వారికి ప్రాపంచిక పరిజ్ఞానం మరింతగా పెంపొందించేదిశగా యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు వార్తాపత్రికలు చదవడాన్ని తప్పనిసరిచేసింది. శుక్రవారం ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా జారీచేసింది. విద్యార్థుల్లో పఠనాసక్తినిపెంచడం, డిజిటల్‌స్క్రీన్‌టైమ్‌ను తగ్గించాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. విద్యార్థులకోసం పాఠశాలల గ్రంథాలయాల్లో హిందీ, ఇంగ్లీషు పేపర్లను అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం స్కూలు అసెంబ్లీలో కనీసం పదినిమిషాలు వార్తాపత్రిక చదవడానికి కేటాయించాలి. జాతీయ, అంతర్జాతీయ, క్రీడారంగాల అంశాలను విద్యార్థులు చదవాలి.



## కోనలో వైభవంగా గోదాదేవి క్షేత్రోత్సవం

రాపూరు (నెల్లూరు), డిసెంబరు 26 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ధనుర్మాసంలోని మొదటి శుక్రవారం సందర్భంగా గోదా అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో బాగంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి క్షేత్రోత్స వం నిర్వహించారు. ప్రధానార్చకులు, వేదపండితులు, మంత్రోచ్ఛరణలతో, మంగళ వాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షణలో ఈ క్షేత్రోత్స వం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పెంచల పెంచలయ్య స్వామి, ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీనారాయణ, ముఖ్య అర్చకుడు గుండ్లూరు శశీ స్వామి, అర్చకులు మధు స్వామి, వినోధ్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, ఆలయ సిబ్బంది, భక్తులు వున్నారు.

# గర్భిణులకు చిరునవ్వుతో సూచనలు

● కిల్కారి ద్వారా ప్రతి ఏడాది 2.5 లక్షల మందికి ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ ● నెలవారీ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన

విజయవాడ, డిసెంబరు 26 (ప్రభాతవార్త ప్రతినిధి): మాతా, శిశు మరణాల్ని గణనీయంగా తగ్గించే చర్యల్లో భాగంగా కిల్కారి (చిన్నారి చిరునవ్వు) కార్యక్రమం ద్వారా ఐవీఆర్ఎస్ విధానంలో గర్భిణీలు, బాలింతలకు సలహాలు, సూచనలు ఇస్తున్నామని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు. ప్రతి ఏడాది ఐవీఆర్ఎస్ ద్వారా సగటున 2.5 లక్షల మంది గర్భిణులకు ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణ, పోషణ, టీకాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ, ఇతర అంశాలపై కనీసం 4 నిమిషాలపాటు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని తెలుగుతో పాటు 13 భాషల్లో నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఫోన్ నంబర్లను మార్చింది. జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖకు చెందిన పోర్టల్ (ఆర్సీ హెచ్)లో గర్భిణీల వివరాల్ని చరవాణి నెంబరుతో సహ ఎ.ఎన్.ఎం. వివరాలు నమోదుచేసిన వెంటనే ఐవీఆర్ఎస్ కాల్స్ గర్భిణులకు వెళ్తాయి. సాంకేతికంగా చేసిన మార్పుల్లో భాగంగా ఇటీవల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఫోన్ నెంబర్లను మార్చింది. ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ సంఖ్యను కూడా తగ్గించింది. అయితే కంటెంటుపరంగా ఎటువంటి మార్పులు చేయకుండా విషయం నేరుగా, సంక్షిప్తంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంది. గర్భిణిల సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్కారి కార్యక్రమంపై ప్రజల్లో విస్తృతంగా అవగాన కల్పించాలని, ముఖ్యంగా జిల్లా వైద్యారోగ్య అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు.



### నెలకో సారి వాయిస్ కాల్..

ఇంతకుముందు నాలుగో నెలలో ప్రవేశించిన గర్భిణికి వారానికొకసారి చొప్పున ప్రసవం జరిగే వరకు ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ వెళ్లేవి, తాజాగా నెలకొకసారి వాయిస్ కాల్స్ వెళ్లేలా మార్పులు జరిగినట్లు రాష్ట్ర సమన్వయాధికారి డాక్టర్ శిరీష తెలిపారు. గతంలో ఉన్న నెంబరు (0124451660) స్థానంలో కొత్తగా 1600403 660 నెంబరును ఖరారు చేశారు. కిల్కారి రీడయల్ నెంబర్లను కూడా 14423/ 18001321255గా మార్చినట్లు అధికారులు వెల్లడించారు. కిల్కారి కార్యక్రమం పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని అధికారులు తెలిపారు.

### ఫోన్ కాల్ రిసీవ్ చేయని పక్షంలో.....

గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు, పుట్టిన బిడ్డ ఏడాది వయస్సు వచ్చే వరకు, ప్రతి నెలా చరవాణికి ఒక ఆడియో కాల్ సమాచారం వెళ్తుంది. ఇందులో తల్లి, బిడ్డ ఆరోగ్య సంరక్షణ, పోషణ, టీకాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ, మాతాశిశు మరణాల విషయాల్లో చైతన్యం తీసుకువచ్చే సమాచారం ఉంటుంది. ఒకవేళ కాల్ వచ్చిప్పుడు రీసివ్ చేయని పక్షంలో రీడయల్ (14423/ 18005321255) ద్వారా కాల్‌లోని సమాచారాన్ని వినే అవకాశాన్ని కూడా గర్భిణులకు కల్పించారు.

### గర్భిణి పేరు నమోదుతో కిల్కారి సేవలు

ఆశా వర్కర్ లేదా ఎ.ఎన్.ఎం. ధ్రువీకరించిన వెంటనే గర్భిణి పేరును ఆర్సీహెచ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేస్తారు. నమోదు తరువాత ఆమె ఫోన్ నెంబరుకు నెలకు ఒకసారి ఆడియో కాల్ రూపంలో సమాచారం వస్తుంది. గర్భిణుల చరవాణిలో పైన పేర్కొన్న కిల్కారీ నెంబర్లను ఎ.ఎన్.ఎం.లు సేవ్ చేయిస్తారు. వరుసగా 6 నెలలపాటు కాల్స్ కి స్పందించకుండా ఉంటే ఆటోమేటిక్ గా అది డిస్కనెక్ట్ అవుతుంది.

### మొబైల్ అకాడమీ ద్వారా డిజిటల్ ట్రైనింగ్..

మొబైల్ అకాడమీ ద్వారా ఆశా వర్కర్లకు దైనందిన విధుల్లో అనుసరించాల్సి న పద్ధతుల గురించి అధికారులు వివరిస్తున్నారు. డిజిటల్ ట్రైనింగ్ కోర్సులో భాగంగా 4 గంటలపాటు ఈ కోర్సు ను నిర్వహిస్తున్నారు. ఇందులోనే కిల్కారీ కార్యక్రమం గురించి అవగాహన కల్పిస్తున్నారు. 42వేల మందిలో 41వేల మంది ఈ శిక్షణ పూర్తిచేశారు.




## తిరుపతి ఎస్వీలో అసోసియేట్ ప్రొఫెసర్ అనుమానాస్పద మృతి

● మూడు రోజులుగా విగతజీవిగా కారులోనే ● సిఎం పర్యటనతో పోలీసుల తనిఖీలతో వెలుగులోకి

తిరుపతి, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ గుగులోతు సర్ధార్‌నాయక్ మృతి చెందాడు. ఆయన తన సొంతకారులోనే పడుకుని ప్రాణాలు కోల్పోయినట్లు తిరుపతి వెస్ట్ పోలీసులు శుక్రవారం ఉదయం కనుగొన్నారు. అతిగా మద్య సేవించడం వల్ల ఆయన ప్రాణాలు కోల్పోయి ఉంటాడని పోలీసులు అనుమాని స్తున్నారు. పోలీసుల కథనం మేరకు..... తెలంగాణ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తాండ ధర్మారంకు చెందిన డాక్టర్ సర్ధార్‌నాయక్ తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌సైన్స్ (ఎంబిఎ) కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసేవాడు. మూడునెలల క్రిందట తరగతి గదిలో ఓ విద్యార్థిని కొట్టడంతో ఆయనపై సస్పెన్షన్‌వేటు వేశారు. ఆయన మద్యానికి బానిసై విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో దురుసుగా వ్యవహరించేవాడని తెలిపారు. దీంతో ఆయన కొద్దిరోజులుగా మద్యంసేవిస్తూ కారులోనే తిరుగుతూ ఉంటాడని తెలిసింది. ఆయన భార్య మీనాబాయ్ చిత్తూరు జిల్లా గుడిపల్లిమండలం శెట్టిపల్లి జడ్పీహైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. ఇద్దరూ తల్లినే చదివిస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ నాయక్ మూడురోజుల క్రిందట అలిపిరి సమీపంలో అతిగా మద్యంసేవించి కారులోనే పడుకున్నాడని తెలుస్తోంది. కారులోనే ఊపిరాడక విగతజీవిగా మారాడు. శుక్రవారం సిఎం చంద్రబాబు పర్యటనతో పోలీసులు పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీచేసే సమయంలో కారు ఆగి ఉండటాన్ని గమనించారు. కారులోపల వ్యక్తి పడివుండటాన్ని కనుగొని పోలీసులు చర్యలు చేపట్టారు. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. అతని జేబులోని గుర్తింపుకార్డు ఆధారంగా వివరాలు రాబట్టారు. పోలీసులు మృతదేహాన్ని ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. భార్యకు సమాచారం అందించారు. మృతికి కారణాలను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, కేసు నమోదు చేసినట్లు వెస్టు పోలీసులు తెలిపారు.

## శివనామస్మరణతో మారుమ్రోగిన శ్రీకాళహస్తీశ్వరాలయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయం భక్తులతో కిటకిట లాడింది. వరుస సెలవులతో ఆలయంలో ఎటు చూసినా భక్త జనులే. కన్నడ, తమిళనాడు నుంచి తండోపతండాలుగా భక్తులు కదలి వచ్చారు. దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శివానందైక నిలయానికి భక్తులు పోటెత్తారు. అడుగు తీసి అడుగు వేయలేని స్థితి చోటు చేసుకుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది ఆలయ ఎఇఒ మోహన్, విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్ పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం, హరికృష్ణ వారి సహచరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉదయం నుంచి ఆలయంలో ఎటు చూసినా భక్తుల శివనామస్మరణతో పునీతమైంది. శనీశ్వరుని ఆలయం వద్ద, అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితులు, అర్చకులు స్వామి సన్నిధిలో వేద మంత్రాలను పఠిస్తూ షోడశాభిషేకాలు జరిపారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. దేవస్థానం అందించిన సమాచారం మేరకు సుమారు 30వేల మంది స్వామి అమ్మవార్లను దర్శనం చేసుకున్నారని ఆలయాధికారులు చెబుతున్నారు.



## వేదాంత లిమిటెడ్‌కు షరతులతో అనుమతులు

విజయవాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో ఆన్ షోర్ చమురు గ్యాస్ డ్రిల్లింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం షరతులతో కూడిన ఎన్‌ఓసీ ఇచ్చింది. ఈ అనుమతులతో కృష్ణా జిల్లాలో 20 చోట్ల డ్రిల్లింగ్ పనులు జరుగనున్నాయి. డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ పాలసీ 2018 కింద వేదాంత లిమిటెడ్‌ను ప్రభుత్వం ఇప్పటికే అనుమతులనిచ్చింది. సంస్థ 35 చోట్ల డ్రిల్లింగ్‌కు ఎన్‌ఓసి కోరగా... కేవలం 20 చోట్ల మాత్రమే ఎన్‌ఓసీని ప్రభుత్వం మంజూరు చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా జిల్లాలో చమురు, సహజ వాయువు అన్వేషణ కోసం వేదాంత లిమిటెడ్ (కైర్న్ ఆయిల్ అండ్ గ్యాస్) సంస్థకు షరతులతో కూడిన అనుమతులు మంజూరు చేసింది.

కృష్ణా జిల్లాలోని మొవ్వ, గూడూరు మండలాల్లో ఉన్న 'కాజా బ్లాక్'లో 20 బావుల త్వకానికి జలవనరుల శాఖ 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్' జారీ చేసింది. డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ పాలసీ కింద ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. అయితే అందుకు సంబంధించి ప్రభుత్వం కొన్ని నిబంధనలను విధించింది. బందరు కాలువ, కేడీఎస్ నెట్ వర్క్, స్థానిక ఎరువుల నుంచి ఉపరితల నీటిని వాడుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. కాలువలు, డ్రైన్లకు 500 మీటర్ల లోపు ఎటువంటి నిర్మాణాలు, తవ్వకాలు జరపకూడదని వేదాంతకు సూచించింది. డ్రిల్లింగ్ వ్యర్థాల వల్ల భూగర్భ జలాలు, కాలువ నీరు కలుషితమైతే, తక్షణమే అనుమతులు రద్దు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. జలవనరుల శాఖ అధికారులు ఎప్పుడైనా ముందస్తు సమాచారం లేకుండా సైట్‌ను తనిఖీ చేసే అధికారం కల్గి ఉంటారని సంస్థకు సూచించింది. అదే విధంగా వేదాంత సంస్థ మొత్తం 35 ప్రాంతాల్లో తవ్వకాలకు అనుమతి కోరగా, సాగునీటి వ్యవస్థలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున 15 ప్రాంతాలను ప్రభుత్వం తిరస్కరించింది. కేవలం 20 ప్రాంతాలకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులు ప్రారంభించే ముందు వేదాంత సంస్థ ఏపీ వాల్టా చట్టం ప్రకారం భూగర్భ జలాల వినియోగానికి సంబంధించి మరిన్ని అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. హైడ్రాలిక్ ఫ్రాక్చరింగ్ ప్రక్రియ వల్ల పర్యావరణానికి, తాగునీటికి ముప్పు పొంది ఉందని స్థానిక రైతులు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన నిబంధనలను ప్రభుత్వం విధించింది.




## నీటి తొట్టిలో పడి బాలుడు మృతి

మదనపల్లె క్రైమ్, డిసెంబరు 26 ప్రభాతవార్త: ఆడుకుంటూ వెళ్లిన ఓ నాలుగేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన మదనపల్లెలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా సోమల మండలానికి చెందిన జ్యోతిప్రకాష్ గత రెండేళ్లుగా మదనపల్లి మండలం వలసపల్లి గ్రామ సమీపంలోని ఒక మామిడి తోటకు కాపలాగా ఉంటూన్నారు. శుక్రవారం సాయంత్రం జ్యోతిప్రకాష్ కుమారుడు విక్రాంత్ (4) ఇంటి ముందు ఆడుకుంటూ, సమీపంలో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లిన బాలుడు, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కొంతసేపటికి బాలుడు కనిపించకపోవ డంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల వెతికారు. చివరకు నీటి తొట్టిలో విగతజీవిగా పడి ఉన్న విక్రాంత్‌ను చూసి వారు తల్లడిల్లిపోయారు. అల్లారుముద్దుగా పెరుగుతున్న కొడుకు కళ్ల ముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాజంపేట జిల్లాను నువ్వే తెచ్చుకో అన్నమయ్య!

# థీమ్ పార్కులో ప్రజల వినూత్న నిరసన

రాజంపేట, డిసెంబరు 26 ప్రభాతవార్త: స్వామి అన్నమయ్య కలియుగ దైవం వెంకటేశ్వరస్వామిపై 32 వేల సంకీర్తన రచించి అంకితం చేసి ఈ ప్రాంతంలో జన్మించిన మీరు మీ పేరుతో ఏర్పాటు చేసిన జిల్లాను మీరే తెచ్చుకోవాలంటూ ప్రజలు మొరపెట్టుకున్నారు. రాజంపేట జిల్లా రాజంపేట జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జేఏసీ నేతలు ఇచ్చిన పిలుపుమేరకు కడప రేణిగుంట జాతీయ రహదారిలోని అన్నమయ్య థీమ్ పార్క్ వద్దకు వేలాదిగా ప్రజలు చేరుకున్నారు. అన్నమయ్య విగ్రహం ఎదుట వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. జేఏసీ నేతలు అన్నమయ్య విగ్రహం వద్ద వినతి పత్రం అందజేసి మీ జిల్లాను మీరే తెచ్చుకోవాలి అంటూ వేడుకున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేటను ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై ఆకస్మికంగా బైఠాయించారు. ఎంతో వాహనాలు పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై నిలిచిపోయాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గం నేత ఎల్లటూరి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ జగన్ సర్కార్ చేసిన పాపం రాజంపేటను వెంటాడుతోందని విమర్శించారు. వైకాపా హయంలో జరిగిన తప్పును కూటమి ప్రభుత్వం సరిదిద్ది రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను కలిసి రాజపేట జిల్లా కేంద్రం చేయాలని కోరతామన్నారు. రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్ రాజు తదితరులు ప్రసంగించారు. మరోవైపు జెఎసి ఆధ్వర్యంలో రాజంపేటలో జరుగుతున్న నిరాహార దీక్షలు 17 రోజులు చేరుకున్నాయి. టిడిపి అసెంబ్లీ జగన్ మోహన్ రాజు దీక్షలకు సంఫీుభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు టి.లక్ష్మీనారాయణ, పూల భాస్కర్, ప్రభాకర్ నాయుడు, డాక్టర్ సుధాకర్, డాక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీలలో బిల్లులు పాసయ్యేలా చూడండి

రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం సలహాదారు జాస్తి వీరాంజనేయులు

విజయవాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని గ్రామపంచాయతీలలో సాధారణ నిధుల (జనరల్ ఫండ్స్) బిల్లులు పాసయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు ఆయన గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజని, ఆర్థిక శాఖ సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సిఎఫ్ఎంఎస్) ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏ గౌతమ్‌ని మంగళగిరిలోని వారి కార్యాలయంలో కలిసారు. రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు జనరల్ ఫండ్స్ నిధుల బిల్లులు పాస్ కాకుండా పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకు వెళ్లారు. వినతి పత్రాన్ని అందించారు.

సర్పంచులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ఇతర కార్యక్రమాలు చేసిన కార్మికులకు ఇతర గ్రామపంచాయతీలో అవసరాల కోసం ఖర్చు పెట్టే సాధారణ నిధులను కూడా చెల్లించే పరిస్థితి 25 రోజులుగా లేకుండా ఉన్నది కావున ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, ఆర్థిక శాఖ సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ (సిఎఫ్ఎంఎస్) ముఖ్య కార్యనిర్వ హణాధికారి ఏ గౌతమ్ మాట్లాడుతూ త్వరలో సాధారణ నిధుల బిల్లులు పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచాల గ్రామ సర్పంచ్, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందు వెంకట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.




## సంతకాలు లేకుండా బిల్లులు డ్రా

### - సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెల్లడి

కోట, డిసెంబరు 26 ప్రభాతవార్త: కోట మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఎస్ఆర్‌పిలు సామాజిక తనిఖీ ప్రజా వేదిక సాక్షిగా గణాంకాలతో సహా వెల్లడించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పిలు పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించారు. కోటలో జాబ్ కార్డుల కోసం డబ్బులు వసూలు చేశారని, కేశవరంలో విఓఎ పేరుతో జాబ్‌కార్డు ఇచ్చారని, ఊనుగుంటపాలెంలో గోశాలను బినామీల పేరుతో నిర్మించారని, నీరు-చెట్టు కింద పనులు మొక్కలు వేయకుండానే నిధులు దారి మళ్లించారని, కొలతలు సక్రమంగా లేవని తమ దృష్టికి వచ్చినట్లు ఎస్ఆర్‌పిలు నివేదించారు. అయితే అందరికీ నోటీసులు జారీ చేయాలంటూ పిడి శ్రీనివాస ప్రసాద్ చెప్పుకొచ్చారు. చివరలో మాత్రం ఆయన అంతా సక్రమమేనని కితాబివ్వడం కొసమెరుపు. గత సంవత్స రం అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి వందశాతం రికవరీ చేశామని చెప్పారు. కేంద్రప్రభుత్వం నుంచి 157 కోట్లు నిధులు రావలసి ఉండగా, 118 కోట్లు నిధులు విడుదలయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ కోట మండలంలో 11 కోట్ల మేరకు ఉపాధి హామీ పనులు జరిగినట్లు చెప్పారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్స న్లు పాల్గొన్నారు. సామాజిక ప్రజావేదిక జరుగుతుందని అధికారులు గ్రామాల్లో చెప్పకుండా గోప్యంగా ఉంచారని విమర్శలు వినవస్తున్నాయి.

## నెల్లూరు జిల్లాలోనే వుంచి రాపూరును కాపాడండి

### అభ్యంతరాలకు చివరి రోజున మండల వాసుల ఆవేదన

రాపూరు (నెల్లూరు), డిసెంబరు 26 ప్రభాతవార్త: వెనుకబడిన ప్రాంతమైన రాపూరు మండలంలోని తాము ఇప్పటికే కండలేరు జళాశయం నిర్మాణంతో వున్న భూములను కోల్పోయామని, గతంలో నియోజకవర్గ కేంద్రంగా వున్న రాపూరు నియోజకవర్గాన్ని కోల్పోయామని, ఎన్నో ఏళ్ళుగా రాపూరులో వున్న పలు ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నియోజకవర్గాలకు తరలిపోయాయని, ఇటువంటి ఇబ్బందులలో వున్న తమ మండలాన్ని తమకు సౌకర్యంగా వున్న నెల్లూరులో కాకుండా తిరుపతి జిల్లాకు మార్చవద్దని శుక్రవారం రాపూరు రాపూరు మండల జెఎసి ఆధ్వర్యం జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లాకు, రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి, నెల్లూరు పార్లమెంట్ జిల్లా ఆధ్యక్షుడు బీదా రవిచంద్రకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు రాపూరు మండలంలోని ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోని తమను నెల్లూరు జిల్లాలోనే వుంచేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా విఆర్‌సి గ్రౌండ్ నుండి జిల్లా కలెక్టరెట్ వరకు పెద్ద ఎత్తున తిరుపతి జిల్లా వద్దు నెల్లూరు జిల్లా ముద్దు, సేవ్ రాపూరు, సింహపురి బిడ్డలం నెల్లూరు వదలం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టర్ కార్యలయానికి చేరుకోని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ ఆధ్యక్షుడు చెన్ను అశోక్ రెడ్డి, రాపూరు సొసైటీ మాజీ ఆధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, రాపూరు క్లస్టర్ ఇన్‌చార్జ్ నువ్వుల శివరామకృష్ణ, మండల ప్రదాన కార్యదర్శి మూరంరెడ్డి మధుసూదన్ రెడ్డి, రాపూరు జాయింట్ ఏక్షన్ కమిటీ నాయకులు దామిశెట్టి సురేష్, షోహేల్, సికిందర్, అహమద్, ఆరీఫా, అమ్ములు, జనసేన నాయకురాలు కస్తూరి, పలువురు కాంగ్రెస్, బిజెపి నాయకులు వున్నారు.

## రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను

# నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలి

### - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త-వైద్యం: రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి, రెవెన్యూ మంత్రికి, జిల్లా కలెక్టర్‌కి తన తరపున విజ్ఞప్తి నివేదికలను అందజేశానని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. విభజన నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యంతరాలు తెలియజేయడానికి నేటితో ఆఖరి రోజు కావడంతో ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో మంత్రి ఆనం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకు తమ వినతి పత్రాలు, అభ్యంతరాలను అందజేశారని మంత్రి వివరించారు. తాను రాపూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవంతో పాటు, ఆ ప్రాంతాల ప్రతినిధిగా మంత్రిగా నెల్లూరు జిల్లా భవిష్యత్ దృష్ట్యా ఈ మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని, అలాగే ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో కలపాలని ముఖ్యమంత్రికి విన్నవించానన్నారు. ఈ విషయమై జిల్లా పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్రకి కూడా తన విజ్ఞాపన పత్రాన్ని అందజేశానని తెలిపారు.

### నూతనంగా బాధ్యతలు చేపట్టిన నేతలకు అభినందనలు

నూతనంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన బీద రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, నెల్లూరు ఇన్‌ఛార్జి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన రూప్ కుమార్ యాదవ్‌లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నెల్లూరు జిల్లా పార్లమెంట్ టీడీపీ కమిటీకి ఎంపికైన ఆత్మకూరు నేతలను, రాష్ట్రస్థాయిలో డైరక్టర్ పదవులు పొందిన వారిని మంత్రి ఆనం సత్కరించారు. దివంగత ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా భారత ప్రభుత్వం ముద్రించిన వంద రూపాయల నాణేలను జిల్లా పార్లమెంట్ టీడీపీ కమిటీ సభ్యులకు అందజేస్తూ, ఎన్టీఆర్ స్ఫూర్తి, పరిపాలనా దక్షతను ఆదర్శంగా తీసుకుని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

### సమర్థవంతమైన నాయకత్వంతో జిల్లా పార్టీ కమిటీ

జిల్లాలో పార్టీ పటిష్టతకు సమర్థవంతమైన నాయకత్వంలో కూడిన జిల్లా కమిటీని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నియమించడం ఎంతో ఆనందకరమని మంత్రి ఆనం తెలిపారు. అనుభవం ఉన్న నాయకులు బీద రవిచంద్ర, చేజర్ల వెంకటేశ్వరరెడ్డి వంటి వారికి, సుదీర్ఘకాలంగా పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన నాయకులకు బాధ్యతలు అప్పగించడం సంతోషకరమని పేర్కొన్నారు, మంత్రి, ఈ సమర్థవంతమైన టీమ్‌తో అందరిని సమన్వయం చేసుకుంటూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, అలాగే నెల్లూరు జిల్లా అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీసీసీ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజరెడ్డి, మాజీ శాసనసభ్యులు కంభం విజయ రామిరెడ్డి, స్థానిక నేతలు గిరి నాయుడు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామివార్ల కల్యాణం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 26, ప్రభాతవార్త: శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వార్ల కళ్యాణం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఒ వికె శీనా నాయక్, పాలకమండలి సభ్యులు బడేటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. దుర్గమ్మవారిని దర్శించుకోటానికి శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఇఒ వికె శీనా నాయక్ సిసి కెమేరాల ద్వారా సమీక్షిస్తూ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలిస్తూ భక్తులకు సులభంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బొర్రా వేంకటేశ్వరరావు రు.1లక్ష విరాళం శుక్రవారం అందించారు.దాత ఎ దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం వారికి ఇఒ దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# విద్య ఒక్కటే అభివృద్ధికి రాజమార్గం

- మాజీ పార్లమెంటు సభ్యులు సర్గీయ కొలుసు పెద రెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న ఈ సేవా కార్యక్రమానికి "నారా లోకేష్ విద్యాఅమృతం" పేరిట శ్రీకారం
- 32 ఉన్నత పాఠశాలలో 1836 విద్యార్థిని, విద్యార్థులకు 100 రోజులు పౌష్టికాహారం
- నూజివీడు నియోజకవర్గంలో విద్యారంగానికి ఒక మైలురాయిగా నిలుస్తుంది: మంత్రి కొలుసు పార్థసారథి

ఏలూరు/ఆగిరిపల్లి, డిసెంబరు 26 ప్రభాతవార్త: ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం తన తండ్రి మాజీ పార్లమెంటు సభ్యులు సర్గీయ కొలుసు పెద రెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్టు ద్వారా చేస్తున్న ఈ సేవా కార్యక్రమానికి "నారా లోకేష్ విద్యాఅమృతం" పేరిట రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శ్రీకారం చుట్టి, సంబంధిత ఉన్నత పాఠశాలలకు విద్యాఅమృతం సరుకుల వాహనాలను జెండా ఊపి ఆయా మండలాలకు పంపించారు. విభిన్న ప్రతిభావంతులు క్రీడల్లో గెలుపొందిన నాలుగు మందికి ప్రశంశా పత్రాలు, మెడల్స్ ను అందించి వారిని అభినందించారు. దాతలు సమకూర్చిన క్రీడా పరికరాలను విద్యార్థులకు అందించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ, దేశంలో మన ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపును తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. పీ4 కార్యక్రమాన్ని దేశంలో అన్ని రాష్ట్రాలు మన ఆంధ్రప్రదేశ్ ను ఆసక్తిగా గమనిస్తున్నారని అన్నారు. మా తండ్రి నిరుపేద కుటుంబంలో పుట్టారని, ఆర్టీసీలో ప్రయాణం



చేస్తే డబ్బులు అవుతాయని క్వారీ లారీలను ఆపి ప్రయాణించేవారని, మా తల్లి, నన్ను అలాగే ప్రయాణం చేసేలా చేసేవారని అన్నారు. ఆయన చేసిన సేవలు, పడ్డ కష్టానికి రుణం తీర్చుకోవాలని ఆయన పేరిట చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు, సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, చదువులో ఏకాగ్రత పెంపొందించడం, మంచి ఫలితాలు రావాలనే ఉద్దేశంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలు మరియు నూజివీడు పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం 4 గంటలకు అల్పాహారం ఈ రోజు నుండి అందించ నున్నామని తెలిపారు. నూజివీడు నియోజక వర్గంలో 32 ఉన్నత పాఠశాలలు, మొత్తం విద్యార్థులు సంఖ్య 1,836 మంది ఉన్నారని అన్నారు. పబ్లిక్ పరీక్షలు అయ్యే వరకు ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టిక అల్పాహారం అందించ బడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పోషకాహార లోపం లేకుండా చదువుపై పూర్తి దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ "లోకేష్ విద్యామృతం" పేరిట నూజివీడు నియోజక వర్గంలో విద్యారంగానికి ఒక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి పి.యస్. సుధాకర్, తహశీల్దారు ప్రసాదు, యంపిడిఒ బి.భార్గవి, డివిజన్ వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ఉన్నత పాఠశాల హెచ్‌యం పి.పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యా కమిటి చైర్మన్ ఆవుల నరేష్, నాన్ టీచింగు సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు తల్లితండ్రులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసి ఉద్యోగులకు తీపికబురు

## మెడికల్ అన్‌ఫిట్ అయినోళ్లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు

### రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం... ఉత్తర్వులు జారీ

సచివాలయం, డిసెంబరు 26 ప్రభాత వార్త: ఆర్టీసీలో పనిచేస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని నిర్ణయిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2020 జనవరి 1 తర్వాత మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు విలీనానికి ముందు మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లకు మాత్రమే ప్రత్యామ్నాయ ఉద్యోగాలిచ్చే విధానం తీసుకొచ్చారు. ఇకపై ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు సహా మిగిలిన ఉద్యోగులందరికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇచ్చేవారు. విలీనం తర్వాత కూడా 21 కేటగిరిల్లో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీలో ఇచ్చే ఉద్యోగానికి అర్హత లేకపోతే ప్రభుత్వ విభాగాల్లో అర్హతను బట్టి కలెక్టర్ల ద్వారా ప్రభుత్వ అర్హత మేరకు ఉద్యోగాలివ్వాలని, ఏ ఉద్యోగానికి అర్హత లేని వారికి అదనపు మానిటరీ ప్రయోజనాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వడం పై సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ యూనియన్ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ కమీషనర్ల బదిలీలు

సచివాలయం, డిసెంబరు 26 ప్రభాతవార్త: రాష్ట్రంలో 11 మున్సిపల్ కమీషనర్ల బదిలీలు, పోస్టుంగ్స్ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మున్సిపల్ కమీషనర్‌గా పావని, అనంతపురం డిప్యూటీ కమీషనర్‌గా ఎం.అంజయ్య, నరసాపూర్ మున్సిపల్ కమీషనర్‌గా ఆర్.వెంకట్రామిరెడ్డి, తిరుపతి అదనపు కమీషనర్‌గా యు.శారదాదేవి, పెడన మున్సిపల్ కమీషనర్‌గా డి.కొండయ్య, ప్రొద్దుటూరు మున్సిపల్ సహాయ కమీషనర్‌గా ఎం.మంజునాథ్ గౌడ్, చీరాల మున్సిపల్ కమీషనర్‌గా డానియల్ జోసఫ్ ఇప్పటి వరకు చీరాల మున్సిపల్ కమీషనర్‌గా ఉన్న అబ్దుల్ రషీద్‌ని బదిలీ చేస్తూ ఎంఎయుడి కమషనరేట్‌లో రిపోర్టు చేయాలని అబ్దుల్ రషీద్‌కు ఆదేశాలు జారీ చేశారు. రాజంపేట మున్సిపల్ కమీషనర్‌గా లక్ష్మీనారాయణ, గ్రేటర్ విశాఖ జోనల్ కమీషనర్‌గా వి.ఈ.పి.నాయుడు, నందికొట్కూరు మున్సిపల్ కమీషనర్‌గా జి,వెంకట రామిరెడ్డి, ప్రస్తుతం నందికొట్కూరు కమీషనర్ ఎస్.బేబిని మాతృశాఖ రెవెన్యూకు కేటాయింపు, కనిగిరి మున్సిపల్ కమీషనర్‌గా పి.శ్రీధర్‌ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కనిగిరి మున్సిపల్ కమీషనర్ పి.కృష్ణమోహన్ రెడ్డి జిఎడిలో రిపోర్టు చేయాలని తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌కు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# సారస్ మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనం

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి
- గుంటూరు కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష

గుంటూరు, డిసెంబరు 26 ప్రభాతవార్త: సారస్ మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంగా నిర్వహించడం జరుగుతుందని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ప్రదర్శన శాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కేంద్ర మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశం నలుమూలల నుండి ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. హ్యాండ్లూమ్స్, హ్యాండిక్రాఫ్ట్స్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్‌లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుందన్నారు. ఈ మినీ భారత సమ్మేళనానికి పెద్ద ఎత్తున ప్రచారం జరగాలన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రదర్శనలను తిలకించడమే కాకుండా వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలు, హస్త కళలు, చేనేతలు, ఆహార పదార్థాల రుచులను తెలుసుకోవాలని కోరారు. సారస్ కు మంచి బ్రాండింగ్ జరగాలని, పర్యావరణ హిత కార్యక్రమంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఉపయోగించని వేడుకగా నిర్వహించుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వ్యర్థాలు నిర్వహణ పట్ల కార్యాచరణ ఉండాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో వస్తారనే అంచనా ఉన్నందున అగ్ని ప్రమాదాలు జరగకుండాను, ట్రాఫిక్ రద్దీ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొబైల్ నెట్వర్క్ సమస్య, వైఫై సమస్య ఉండరాదని అన్నారు.

### బ్రాండ్ అంబాసిడర్లను ఆహ్వానించాలి

సారస్ మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంగా జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందుటకు క్రీడలతో పాటు వివిధ రంగాల్లో పేరు మోసిన వ్యక్తులు బ్రాండ్ అంబాసిడర్లుగా సందర్శించే విధంగా ఆహ్వానించాలని మంత్రి సూచించారు.

### ఉత్తమ, వినూత్న కళా ప్రదర్శనలు

సారస్‌లో భారత దేశ విభిన్న కళలు ఉట్టిపడే విధంగా కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని మంత్రి అన్నారు. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులు కొత్త ఆలోచనలకు అవకాశం కల్పించే ప్రదర్శనలు ఇచ్చే పరిస్థితీ ఉందని చెప్పారు.

### ఆహార శాలలు

### నవ రుచుల సమ్మేళనం కావాలి

ఏర్పాటు చేసే ఆహార శాలలలో (ఫుడ్ కోర్టు) ఆహార నాణ్యతలో రాజీ పడరాదని కేంద్ర మంత్రి సూచించారు. నవ రుచుల సమ్మేళనం కావాలని, గ్రామీణ వంటకాలు, చిరుధాన్యాల రుచులు అందించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యూ ఢిల్లీ నుండి పాల్గొన్న గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ సారస్‌లో మినీ భారత దేశం కనిపిస్తుందన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జోన్ గా ఉండే విధంగా చూడాలని కోరారు. స్వయం సహాయక సంఘాల ఉత్తమ ఉత్పత్తులను ప్రోత్సహించడం సారస్ ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.



ఈ సమావేశంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హాసన్ భాషా, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ వకుల్ జిందాల్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి అమరేంద్ర ప్రతాప్ సింగ్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ఎస్‌కె ఖాజావలి, సెర్ప్ అదనపు సిఇఒ ఆర్.శ్రీరాములు నాయుడు, సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.జ్యోతిబసు, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్రబాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కెవివి సత్యనారాయణ, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మన రోవర్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

## ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త ఇదే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### - ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, డిసెంబరు 26 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు ఆశయమైన ఒక కుటుంబంనుంచి ఒక పారి శ్రామికవేత్త రావాలనే దిశగా కుప్పంలో చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో కడతో ఒప్పందం కుదుర్చుకున్న రోవర్ సంస్థ ద్వారా మహిళలు, రైతులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, రోవర్ గ్రూప్ డైరెక్టర్ శివకుమార్‌తో కలసి మన రోవర్ డిజిటల్ యాప్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వ్యాపార అవకాశాల కోసం రోవర్ సంస్థ మన రోవర్ గ్రూపులు ఏర్పాటు చేస్తోందన్నారు. ఇందులో చేరేవారికి బ్యాంకు రుణాలు, సాంకేతిక సహకారం, శిక్షణ, వ్యాపార నైపుణ్యాలు నేర్పిస్తామన్నారు. యాప్ ద్వారా పంచాయతీ, మండల, నియోజకవర్గ స్థాయిలో డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులో వస్తాయన్నారు. మహిళలు,రైతులు సాధికారత దిగా ముందుకు సాగాలని సూచించారు. రోవర్ డైరెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ నియోజక వర్గంలో వెయ్యి మంది అసోసియేట్లను నమోదు చేసి వారిని వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎడి పల్లవి, కార్పోరేషన్ డైరెక్టర్ బాబు, గుడుపల్లె అధ్యక్షుడు సుబ్బు, రామచంద్ర పాల్గొన్నారు.

# ఆయుధాల విక్రయ ముఠా అరెస్ట్

- 5 కంట్రీ మేడ్ ఫిస్టోళ్లు, 7 మ్యాగజైన్‌లు, 30 లైవ్ బుల్లెట్లు, 3 ఖాళీ బుల్లెట్ షెల్స్, తల్వార్‌లు స్వాధీనం
- మధ్యప్రదేశ్ గ్యాంగ్‌ను అరెస్టు చేసిన పోలీసులను అభినందించిన అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 26 ప్రభాతవార్త: మారణాయుధాలను విక్రయిస్తున్న ముఠాను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 5 కంట్రీ మేడ్ ఫిస్టోళ్లు, 7 మ్యాగజైన్ లు, 30 లైవ్ బుల్లెట్లు, 3 ఖాళీ బుల్లెట్ షెల్స్, తల్వార్‌లు స్వాధీనం చేసుకున్నారు. మధ్యప్రదేశ్ గ్యాంగ్ ను అరెస్టు చేసిన పోలీసులను జిల్లా ఎస్పీ పి జగదీష్ అభినందించారు. అనంతపురం నగరంలోని పోలీస్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో అనేక అంశాలను ఆయన వెల్లడించారు. ఇదే సందర్భంగా జనసంచారాలలో అక్రమ మారణాయుధాలతో తిరగడము. అమ్మడం చట్టరీత్యా నేరమని ఇటువంటి వారిని ఎటువంటి పరిస్థితుల్లో సహించేది లేదని తీవ్రంగా ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. అలాగే అరాచకాలకు పాల్పడి అరెస్టయిన ముగ్గురిలో ఇద్దరు మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా ఒకరు అనంతపురం జిల్లా వాసిని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మొరేనా గ్వాలియర్ ప్రాంతాలలో కొనుగోలు చేసి, అనంతపురంలో విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు విచారణలో వెల్లడైందన్నారు. అరెస్ట్ అయిన వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం మొరాన జిల్లా వాసులు రోహిత్ పర్మార్ (24) శివం సింగ్ పరిహార్ (25) మరొక నిందితుడు అనంతపురం నగరంలో నివాసము ఉండు నల్లి రాజశేఖర్ రెడ్డి (32) వీరు ముగ్గురు కలిసి అక్రమ ఆయుధాలను కొనుగోలు నిలువ మరియు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరి నుండి 5 కంట్రీ మేడ్ ఫిస్టోళ్లు, 2 మ్యాగజైన్లు, 30 లైవ్ బుల్లెట్లు, 3 ఖాళీ బుల్లెట్ షెల్స్, 1 తల్వార్




స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఘటనపై అనంతపురం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది.జిమ్ నిర్వాహకుడు నల్లి రాజశేఖర్ రెడ్డి అక్రమంగా గన్ కల్గిఉండి గన్‌తో హల్ చల్ చేయడంపై అనంతపురం 2వ పట్టణ పోలీసు స్టేషన్లో ఈనెల 12 వ తేదీన కేసు నమోదయింది అన్నారు. జిమ్ నిర్వాహకుడి వద్ద గన్ దొరకడాన్ని తీవ్రంగా పరిగణించి లోతుగా విచారణ చేపట్టడంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. అనంతపురంలో జిమ్ నిర్వాహకుడు వద్ద గన్ దొరికడాన్ని జిల్లా ఎస్పీ పి. జగదీష్, తీవ్రంగా పరిగణించారు. వెంటనే వివరాలు ఛేదించాలని ఆదేశించారు. దీంతో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు అద్వర్యంలో అనంతపురము 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.శ్రీకాంత్ , 3 టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ, రాజేంద్ర నాథ్ యాదవ్, సిసిఎస్ సి ఐ, శేషగిరి, బొమ్మనహల్ ఎస్సై, ఎస్.నబీ రసూల్ 2 టౌన్ పిఎస్ ఎస్సై సి. ఋషేంద్ర బాబు, సిసిఎస్ సిబ్బంది సిబ్బంది, 2 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక పోలీసు బృందంతో కలసి గురువారం సాయంత్రం పక్కా రాబడిన సమాచారంతో స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్ సమీప ప్రాంతంలో ముగ్గురు నిందితులను పోలీసు బృందాలు అరెస్టు చేశారు. మారణాయుధాలు సరఫరా చేస్తున్న వారి వెనుక ఎంతటి వారున్నా చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు ఒక్కో గన్ 20 వేల నుండీ 30 వేలు అక్రమ ఆదాయం వస్తుందనే దురాశకు పాల్పడ్డారన్నారు. అలాగే ఒక్కో కంట్రీ మేడ్ గన్‌ను మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో సుమారు 40 వేల నుండి 50 వేల వరకు కొనుగోలు చేసి, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో విక్రయిస్తే ఒక్కో గన్‌పై 20 వేల నుండి 30 వేల వరకు అక్రమ లాభం పొందే అవకాశం ఉన్నట్లు వారు భావించారు. ఇదే ఆశతో ఎక్కువ సంఖ్యలో గన్స్‌ను తెప్పించి విక్రయించేందుకు కుట్ర పన్నినట్లు పోలీసులు తెలిపారు. ఈక్రమంలోనే ముగ్గురు పోలీసులకు చిక్కారు. ఈ కేసు సేదించిన పోలీసులు అధికారులను మరియు పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతపురము అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, అనంతపురము 2 టౌన్, 3 టౌన్ సిఐలు శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, సిసిఎస్ సిఐ శేషగిరి, బొమ్మనహల్ ఎస్సై, ఎస్.నబీ రసూల్, 2 టౌన్ పిఎస్ ఎస్సై సి.ఋషేంద్ర బాబు, అనంతపురము 2 టౌన్ పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ. అమరేశ్వర్, కానిస్టేబుళ్ళు వన్నూరప్ప, అంజన కుమార్, సుధాకర్, పాండవ, మరియు సిబ్బంది పాల్గొన్నారు. వారికి ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి జగదీష్ అభినందనలు తెలిపారు.

# ప్రతి మండలంలోనూ చిన్నపారిశ్రామిక పార్క్‌లు

### రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ (గన్నవరం), డిసెంబరు 26, ప్రభాతవార్త: రాష్ట్రవ్యాప్తంగా ప్రతిమండలంలోనూ చిన్న పారిశ్రామికపార్క్‌లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరొ ్కన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా 4వ డిఆర్సీ సమావేశం శుక్రవారం ఉదయం ఇరిగేషన్ కాంపౌండ్‌లోని రైతుశిక్షణా కేంద్రంలో మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈసందర్బంగా గత సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు వాటి పై తీసుకున్న చర్యలపై చర్చించారు. జిల్లాలో పరిశ్రమల స్థాపన, వైద్యఆరోగ్యం, రహదారుల అభివృద్ధి, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకున్న చర్యలపై చర్చించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పలు సమస్యలను ప్రస్తావించి వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు కృష్ణానది నీటిని సరఫరా చేయాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈకార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన




61 అంశాల్లో 11 పరిష్కారం అయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. ఒకకుటుంబం ఒక పారిశ్రామికవేత్త నినాదాన్ని ముందుకు తీసుకువెళ్ళటంతో పాటు, యువతకు స్థానికంగా ఉపాధి కల్పనకు ఊతమిచ్చేలా ప్రతినియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్క్‌లతోపాటు ప్రతి మండలంలోనూ చిన్న పారిశ్రామిక పార్క్‌ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 2023-24లో తలసరి ఆదాయం రూ.3,21,651 కాగా ప్రస్తుత ఆర్థిక సంవతరం లక్ష్యం రూ.4,17,412గా నిర్ధేశించినట్లు చెప్పారు. జిల్లా స్థూల ఉత్పత్తి 2024-25లో రూ.94,561 కోట్లు కాగా 2025-26లో 1,12,148 కోట్లు లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈరెండు అంశాల్లోనూ లక్ష్యాలకు అనుగుణంగా ప్రగతి దిశగా పయనిస్తున్నట్లు మంత్రి వివరించారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి జిల్లాలో 1,600 ఎంఎస్ఎంఈ యూనిట్ల రిజిష్ట్రేషన్ లక్ష్యంగా నిర్ణయించగా, గతనెల చివరికి 1,121 (70.06శాతం) పూర్తయ్యాయన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందువరుసలో నిలిపేందుకు కృషిచేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. క్రమం తప్పకుండా డిఆర్సీ సమావేశాలు నిర్వహించి జిల్లాలోని ప్రజల సమస్యలు పరిష్కరించటంతో పాటు జిల్లా అభివృద్ధికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురాం, జిల్లాకలెక్టర్ లక్ష్మీశా, శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, రుహుల్లా, ఏపి బిల్డింగ్ వర్కర్స్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, జేసి ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలకసంస్థ కమీషనర్ ధ్యానచంద్ర, డిసిపి సరిత, డిఆర్ఓ లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రజా ప్రతినిధులపై బ్లాక్ మెయిలింగ్ కొనసాగనివ్వం

### వైస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి

విజయవాడ, డిసెంబరు 26 ప్రభాతవార్త ప్రతినిధి: రాజ్యాంగ పరంగా పంచాయతీ రాజ్ శాఖకు లభించే 15 వ ఫైనాన్స్ నిధులను కూటమి ప్రభుత్వ కుట్రలో భాగంగా పంచాయతీ రాజ్ కమిషనర్ మోఖిక ఆదేశాలతో నిలిపివేయడం ఏ మేరకు సమంజసమని వైస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ప్రశించారు అయన మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ నిధుల వినియోగ విషయమై పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఈ నెల 19వ తేదిన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా సంబంధిత అధికారులతో ఆ నిధుల వినియోగం ఆపివేయాలని మోఖిక ఆదేశాలు జారీ చేయడం గ్రామ స్వరాజ్య స్ఫూర్తికి వ్యతిరేకమని శాఖలో ఏమి జరుగుతున్న మోనంగా ఉన్న పవన్ కళ్యాణ్ కి వారి అన్న మంత్రి పదవి ఒక్కటే వస్తే చాలంటూ ఉన్నారని వెన్నపూస రవీంద్రారెడ్డి డిప్యూటీ సీఎంపై మండిపడ్డారు, ఇందులో భాగంగా విజయనగరం జిల్లాపరిషత్ సి.ఈ.ఓ గారు కమిషనర్ గారి మోఖిక ఆదేశాల మేరకు సర్క్యులర్ జారీచేసి 15వ ఫైనాన్స్ నిధులను ప్రభుత్వం నుండి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు వినియోగం ఆపివేయాలని ఉత్తర్వులను వెలువరించడమంటే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను బ్లాక్ మెయిల్ చేయడంలో భాగమని సీఎం చంద్రబాబు ఇలాంటి రాజకీయాలు మానుకోవాలని 15 వ ఫైనాన్స్ కమిషన్ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పెత్తనమేమిటని వెన్నపూస రవీంద్రారెడ్డి నిలదీశారు,స్థానిక సంస్థల పట్ల ఇదే వైఖరి రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలసి ఉద్యమానికి సమాయత్తం అవుతామని వైస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి పేర్కొన్నారు.

# విజయ్ హజారే ట్రోఫీలో.. అత్యధిక పరుగుల హీరోలు


అంకిత్ బావ్నే


దినేష్ కార్తిక్


మనీష్ పాండే


మయాంక్ అగర్వాల్


ప్రియాంక్ పంచల్

**న్యూఢిల్లీ:** ఈ మధ్య విజయ్ హజారే ట్రోఫీ వార్తల్లో నిలుస్తోంది. టీమిండియాకు చెందిన ఇద్దరు స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ టోర్నమెంట్‌లో ఆడుతున్నారు. ఇద్దరూ తమ తొలి మ్యాచ్‌లలో సెంచరీలు సాధించి, టోర్నమెంట్ ఉత్సాహాన్ని పెంచారు. కానీ ఈ టోర్నమెంట్ చరిత్రలో టాప్ ఐదుగురు అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లు ఉన్నారు. ఈ జాబితాలో మహారాష్ట్ర బ్యాట్స్‌మన్ అంకిత్ బావ్నే అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 95 మ్యాచ్‌ల్లో 56 సగటుతో 4,055 పరుగులు చేశాడు. అయితే అంకిత్ భారత సీనియర్ జట్టు తరపున ఏ ఫార్మాట్‌లోనూ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. లిస్ట్ ఎ క్రికెట్‌లో, అతను 127 మ్యాచ్‌ల్లో 4,695 పరుగులు చేశాడు. భారత మాజీ వికెట్ కీపర్ బ్యాట్స్ మాన్ దినేష్ కార్తీక్ రెండవ స్థానంలో ఉన్నాడు. అతను 79 ఈ ట్రోఫీ మ్యాచ్‌ల్లో 56 సగటుతో 3,433 పరుగులు చేశాడు. దినేష్ 260 మ్యాచ్‌లు ఆడి 7,603 పరుగులు చేసిన విస్తృతమైన లిస్ట్ ఎ క్రికెట్ అనుభవాన్ని కూడా కలిగి ఉన్నాడు. ఇక టీమిండియా మాజీ ఆటగాడు మనీష్ పాండే మూడో స్థానంలో ఉన్నాడు. అతను 103 హజారే ట్రోఫీ మ్యాచ్‌ల్లో 3,403 పరుగులు చేశాడు. సగటున 45. లిస్ట్ ఎ క్రికెట్‌లో అతను

## అసాధారణ ప్రదర్శనలో బ్యాట్స్‌మన్

192 మ్యాచ్‌ల్లో 6,310 పరుగులు చేశాడు. సగటున 45 కంటే కొంచెం ఎక్కువ. గుజరాత్‌కు చెందిన ప్రియాంక్ పంచల్ ఈ జాబితాలో నాల్గవ స్థానంలో ఉన్నాడు. ఈ ట్రోఫీలో అతను 83 మ్యాచ్‌ల్లో 3,395 పరుగులు చేశాడు, సగటున 43. లిస్ట్ ఎ క్రికెట్‌లో, అతను 97 మ్యాచ్‌లు ఆడి 3,672 పరుగులు చేశాడు. సగటున 41. ఆసక్తికరంగా, అంకిత్ లా ప్రియాంక్ కూడా భారతదేశం తరపున ఏ ఫార్మాట్‌లోనూ ఆడలేదు. చివరిగా మయాంక్ అగర్వాల్ ఐదో స్థానంలో ఉన్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో 72 మ్యాచ్‌ల్లో 3,390 పరుగులు చేశాడు. సగటున 52. మయాంక్ ఐదు వన్డేలతో సహా మొత్తం 124 లిస్ట్ ఎ మ్యాచ్‌లు ఆడాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో దాదాపు 50 సగటుతో 5,670 పరుగులు చేశాడు మరియు 18 సెంచరీలు కూడా చేశాడు.



## న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు..
# కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

**న్యూఢిల్లీ:** స్వదేశంలో న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత్ జట్టును జనవరి మొదటి వారంలో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు ప్రకటించనుంది. అజిత్ ఆగార్కర్, గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ జనవరి 3 లేదా 4న వర్చువల్‌గా సమావేశం కానుంది. ఇందులో కివీస్‌తో వన్డేల కోసం భారత్ జట్టును ఖరారు చేయనుంది. కాగా గాయం కారణంగా దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తిరిగి రీ ఎంట్రీ ఇవ్వడం దాదాపు ఖాయమైంది. కివీస్‌తో వన్డే సిరీస్‌లో జట్టును నడిపించేందుకు గిల్ సిద్ధమైనట్లు సమాచారం. సౌతాఫ్రికాతో టెస్టు సిరీస్ మధ్యలో గాయం కారణంగా వైదొలగిన గిల్ వన్డేలకు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో కేఎల్ రాహుల్ జట్టు పగ్గాలను చేపట్టాడు. అనంతరం గిల్ తిరిగి టి20 సిరీస్‌కు అందుబాటులో వచ్చాడు. అయితే నాలుగో టి20కి ముందు గిల్ మరోసారి గాయం బారిన పడ్డాడు. దీంతో చివరి రెండు టి20లకు కూడా అతడు దూరమయ్యాడు. అనంతరం టి20 వరల్డ్ కప్ 2026 జట్టులో గిల్ చోటు దక్కించుకోలేకపోయాడు. కానీ గిల్ మాత్రం ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీ కోసం మొహాలీలో తీవ్రంగా శ్రమిస్తున్నాడు. అయితే వన్డే జట్టు పగ్గాలను చేపట్టాక గిల్ పెద్దగా రాణించలేకపోయాడు. ఆసిస్‌తో వన్డే సిరీస్‌లో గిల్ విఫలమయ్యాడు. దీంతో తన రీ ఎంట్రీలో న్యూజిలాండ్‌పై సత్తా చాటాలని శుభ్‌మన్ ఉవ్విళ్లూరుతున్నాడు. న్యూజిలాండ్‌తో వన్డేలకు భారత్ జట్టులో శుభమన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్షదీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, రిషబ్ పంత్, నితీష్ కుమార్‌రెడ్డి, అక్షర్‌పటేల్, తిలక్ వర్మ ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

## ఇంగ్లండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లో..
# నిప్పులు చెరిగిన బౌలర్లు
### ఒకే రోజు 20 వికెట్లు



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో బౌలర్లు నిప్పులు చెరిగారు. శుక్రవారం ప్రారంభమైన ఈ బాక్సింగ్ డే టెస్ట్‌లో ఇరు జట్ల పేసర్లు చెలరేగడంతో తొలి రోజే 20 వికెట్లు నేలకూలాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 45.2 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. మైఖెల్ నెసర్(35), ఉస్మాన్ ఖవాజా(29), అలెక్స్ క్యారీ(20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్(5/45) 5 వికెట్లతో చెలరేగగా, గస్ అట్కిన్సన్(2/20) 2 వికెట్లు పడగొట్టాడు. బెన్ స్టోక్స్, బ్రైడన్ కార్స్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ 29.5 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్(41), బెన్ స్టోక్స్(16), గస్ అట్కిన్సన్(28) మినహా అంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. జాక్ క్రాలీ(5), బెన్ డకెట్(2), జాకోబ్ బెతెల్(1), జో రూట్(0), జేమీ స్మిత్(2), విల్ జాక్స్(5), బ్రైడన్ కార్స్(4) తీవ్రంగా నిరాశపర్చారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మైఖెల్ నెసర్(4/45) 4 వికెట్లు తీయగా, మిచెల్ స్టార్క్(2/23) 2 వికెట్లు పడగొట్టాడు. స్కాట్ బోలాండ్(3/30) 3 వికెట్లు తీయగా, కామెరూన్ గ్రీన్ ఒక వికెట్ పడగొట్టాడు. 42 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. కాగా ఇప్పటికే ఈ సిరీస్‌ను ఆసీస్ 3-0తో కైవసం చేసుకుంది. చివరి రెండు టెస్ట్‌లను కూడా గెలిచి క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది.





# గుజరాత్‌పై కోహ్లీ 77, రోహిత్ గోల్డెన్ డక్

**న్యూఢిల్లీ:** విజయ్ హజారే ట్రోఫీ ఎలైట్ గ్రూప్ సి మ్యాచ్‌లో ఉత్తరాఖండ్‌తో జరిగిన ముంబై ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గోల్డెన్ డక్‌గా అవుటయ్యాడు. శుక్రవారం జరిగిన మ్యాచ్ మొదటి ఓవర్ చివరి బంతికి కుడిచేతి వాటం మీడియం పేసర్ ఆకాష్ మధ్వాల్ బోరా బౌలింగ్‌లో రోహిత్ డీప్ ఫైన్ లెగ్ వద్ద క్యాచ్ పొందాడు. జగ్మోహన్ నాగర్కోటి తన తొలి ప్రయత్నాన్ని విఫలమైన తర్వాత రెండోసారి క్యాచ్‌ను పట్టుకున్నాడు. ఇంతకు ముందు ముంబై తరఫున ఏడు సంవత్సరాల తర్వాత ఆడిన తొలి విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో రోహిత్ సిక్కింపై 62 బంతుల్లో సెంచరీ సాధించి, దేశీయ క్రికెట్‌లోకి సంచలనాత్మక పునరాగమనం చేశాడు. ముంబై జట్టు విజయవంతమైన ఛేజింగ్‌లో అతను 98 బంతుల్లో 155 పరుగులు చేశాడు. అయితే ఈ సారి విఫలం చెందాడు.

మరోవైపు, విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరపున తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించిన విరాట్ కోహ్లీ బెంగళూరులో గుజరాత్ ఎలైట్ గ్రూప్ డి మ్యాచ్‌లో 77 పరుగులు చేశాడు. కోహ్లీ ఇన్నింగ్స్ 14 బౌండరీలతో నిండి ఉంది. అర్పిత్ రాణాతో కలిసి రెండో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని, నితీష్ రాణాతో కలిసి 24 పరుగుల భాగస్వామ్యాన్ని, ఆ తర్వాత రిషబ్ పంత్‌తో కలిసి 10 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ తర్వాత 22వ ఓవర్‌లో విశాల్ జైస్వాల్‌కు బలయ్యాడు. ఇంతకు ముందు మ్యాచ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆంధ్రప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ తరపున ఆడుతున్న కోహ్లీ, జట్టు 299 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తన మొదటి పరుగుతో 16 వేల లిస్ట్ ఎ పరుగుల మైలురాయిని చేరుకున్నాడు.

## వరల్డ్ టెన్నిస్ లీగ్‌లో..
# విజయానికి చేరువలో ఆస్ట్రేలియన్



**న్యూఢిల్లీ:** దక్షిణేశ్వర్ సురేష్ నాయకత్వంలో ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ జట్టు వరల్డ్ టెన్నిస్ లీగ్ విజయానికి చేరుకుంది. అలాగే తెలంగాణ ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. శుక్రవారం జరిగిన వరల్డ్ టెన్నిస్ లీగ్ యొక్క నాల్గవ ఎడిషన్‌ను ఎఒఎస్ ఈగల్స్‌ను 22-19 తేడాతో ఓడించి గెలుచుకున్న ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ తరపున దక్షిణేశ్వర్ కీలకమయ్యాడు. ముందు ఆస్ట్రేలియన్ మావెరిక్స్‌కు చెందిన భారత ఆటగాడు దక్షిణేశ్వర్ తన స్వదేశీయుడు సుమిత్ నాగల్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లోకి అడుగుపెట్టాడు. దక్షిణేశ్వర్ తన జట్టుకు 15-13 ఆధిక్యానికి చేర్చే బాధ్యతను తీసుకున్నాడు. 25 ఏళ్ల ఈ యువకుడు చక్కటి సెట్‌ను ఆడటంతో టైబ్రేక్‌తో నాలుగు పాయింట్లకు గెలిచింది. కాగా దక్షిణేశ్వర్ ఆడిన మూడు మ్యాచ్‌లలో రెండింటిలో గెలిచాడు. మొదటి రెండు రౌండ్ రాబిన్ మ్యాచ్‌లలో ఓడిపోయిన తర్వాత తక్కువ తేడాతో ఫైనల్‌లోకి ప్రవేశించిన జట్టును తన ఆధిక్యంలో ఉంచుకున్నాడు. కాగా మహిళల విభాగంలో మరో భారత్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి ఈగల్స్ తరఫున ఆకట్టుకునే ప్రదర్శన చేసింది. మార్తా కోస్ట్యుక్‌తో జరిగిన ఆమె సింగిల్స్ పోటీలోను, డబుల్స్‌లోను ఫ్రెంచ్‌కు చెందిన గేల్ మోన్‌ఫిల్స్‌తో కలిసి కోస్ట్యుక్ మరియు దక్షిణేశ్వర్‌లతో జరిగిన పోటీలో ఆమె ఆకట్టుకుంది.

# ఐటి, ఆటో రంగాల్లో భారీ అమ్మకాలు

### వారాంతంలో సెన్సెక్స్ నిఫ్టీలకు నష్టాలు




**ముంబయి డిసెంబరు 26:** ఐటీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడికారణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో నష్టాల్లోనే ముగిసాయి. సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 367.25 పాయింట్లు నష్టపోయి 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 99.80 పాయింట్లు క్షీణించి 26,042.30 వద్ద ముగిసింది. సెలవుల కారణంగా ఈ వారం ట్రేడింగ్ సెషన్లు తక్కువగా ఉండటం, మార్కెట్‌ను నడిపించే బలమైన సానుకూల సంకేతాలు లేకపోవడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో పాటు సెన్సెక్స్ డెరివేటివ్‌ల గడువు ముగియడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలహీన పరిచింది. బీఎస్ఈలో టైటన్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు లాభపడగా, బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వంటి షేర్లు నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో టైటన్, హిందాల్కో, నెస్లే ఇండియా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్ నష్టాలను చవిచూశాయి. స్మాల్, మిడ్ క్యాప్ మార్కెట్‌లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.23 శాతం, స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.08 శాతం మేర నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.03 శాతం, ఆటో ఇండెక్స్ 0.52 శాతం పతనమయ్యాయి. అయితే, దీనికి భిన్నంగా మెటల్ షేర్లు రాణించడంతో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 0.59 శాతం లాభపడింది.



# నెదర్లాండ్స్ టాటాస్టీల్‌పై పోరాటం
### రూ.14,370 కోట్లు చెల్లించాలంటూ పిటిషన్

**ఆమ్‌స్టర్‌డామ్, డిసెంబరు 46:** టాటా గ్రూప్‌కు చెందిన టాటా స్టీల్ నెదర్లాండ్ యూనిట్‌పై అక్కడి స్వచ్ఛంద సంస్థ న్యాయపోరాటానికి దిగింది. కంపెనీ కార్యకలాపాల వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని, పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపిస్తూ నెదర్లాండ్స్‌లోని నార్త్ హాలెండ్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా దాఖలు చేసింది. పరిహారంగా 1.6 బిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.14,370 కోట్లను చెల్లించాలని డిమాండ్ చేసింది. టాటా స్టీల్ అధికారికంగా ఈసమాచారం వెల్లడించింది. నెదర్లాండ్స్‌లోని వెల్సన్‌నూర్డ్ ప్రాంతంలో ఉన్న ఐజ్మొయిడన్ బీవీ ప్లాంట్ నుంచి వెలువడే కాలుష్యకారకాలు స్థానికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని ఆ స్వచ్ఛంద సంస్థ ఆరోపిస్తోంది. కాలుష్య ప్రభావంతో ప్రజలు నిరంతర భయాందోళనల్లో జీవించాల్సి వస్తోందని, ఇంట్లో ప్రశాంతంగా గడపలేకపోతున్నారని, ఆ ప్రాంతంలోని ఆస్తుల విలువ కూడా పడిపోయిందనేది ఎన్‌జీవో వాదనగా ఉంది. ఈ ఆరోపణలను టాటా స్టీల్ తీవ్రంగా ఖండించింది. ఎన్‌జీవో చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. తమ కార్యకలాపాలు నిబంధనలకు అనుగుణంగానే సాగుతున్నాయని, పర్యావరణ పరిరక్షణ విషయంలో తమకు అనుకూలంగా బలమైన ఆధారాలు ఉన్నాయని టాటా స్టీల్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణ రెండు దశల్లో కొనసాగుతుందని, ఒక్కో దశ పూర్తయ్యేందుకు కనీసం రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు సమయం పట్టే అవకాశం ఉందని తెలిపింది. అందువల్ల ఇప్పట్లో పరిహారం చెల్లించే అంశం తలెత్తే అవకాశమే లేదని టాటా స్టీల్ స్పష్టం చేసింది. మరోవైపు, నెదర్లాండ్స్ ప్రభుత్వంతో కలిసి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టామని, ఉద్గారాలను నియంత్రించే దిశగా పెట్టుబడులు పెట్టి ఆధునిక సాంకేతికతను అమలు చేస్తున్నామని టాటా స్టీల్ పేర్కొంది.

# జీవనకాల గరిష్టానికి వెండి, బంగారం ధరలు

### తులం బంగారం రూ.1.40 లక్షలు
### కిలో వెండి రూ.2.40 లక్షలు



**ముంబయి, డిసెంబరు 26:** భారత బులియన్ మార్కెట్‌లో శుక్రవారం బంగారం, వెండి ధరలు సరికొత్త చరిత్ర సృష్టించాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్)లో ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల బంగారం ధర తొలిసారిగా రూ.1,40,000 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠాన్ని తాకింది. మరోవైపు, వెండి ధర కూడా ఊహించని రీతిలో పెరిగి కిలోకు రూ.2.40లక్షల వద్ద జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ధరల పెరుగుదల వెనుక పలు అంత ర్జాతీయ పరిణామాలు ఉన్నాయి. ముఖ్యంగా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ 2026లో వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న బలమైన అంచనాలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే, బంగారం వంటి వడ్డీరహిత ఆస్తులపై పెట్టుబడిపెట్టేందుకు చేసేందుకు ఇన్వెస్టర్లు మొగ్గుచూపుతారు. దీనికి తోడు రష్యాఉక్రెయిన్ యుద్ధం, అమెరికావెనిజులా మధ్య ఉద్రిక్తతలు, నైజీరియాలో అమెరికా సైనిక చర్యలు వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితి వల్ల సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు డిమాండ్ భారీగా పెరిగింది. డాలర్ బలహీనపడటం కూడా పసిడి, వెండి ధరల పెరుగుదలకు దోహదపడింది. రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ జిగర్ త్రివేది మాట్లాడుతూ పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాల నేపథ్యంలో సురక్షితమైన పెట్టుబడి సాధనంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. దీంతో శుక్రవారం ప్రపంచ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 4,500 డాలర్ల స్థాయిని చేరిందని వివరించారు. ధరలు రికార్డు స్థాయిలో పెరగడంతో దేశీయంగా రిటైల్ మార్కెట్‌లో అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. గత 15 రోజుల్లో అమ్మకాలు 50 శాతానికి పైగా తగ్గాయని జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జెఅండ్‌జె) మాజీ ఛైర్మన్ అనంత పద్మనాభన్ తెలిపారు. క్రిస్మస్, నూతన సంవత్సర సెలవులు, ఎన్నారైల రాక ఉన్నప్పటికీ మార్కెట్‌లో పెద్దగా కదలిక లేదని ఆయన పేర్కొన్నారు. అహ్మదాబాద్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిగర్ సోనీ మాట్లాడుతూ, ప్రస్తుత ధరల వద్ద వినియోగదారులు చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. పెళ్లిళ్ల కోసం కూడా 22 క్యారెట్ల బంగారానికి బదులుగా 14 లేదా 18 క్యారెట్ల ఆభరణాలను కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది కొత్త బంగారం కొనడానికి బదులుగా తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని మార్చుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బంగారంతో పోలిస్తే వెండి ధర మరింత వేగంగా పెరిగింది. దీనికి పారిశ్రామిక డిమాండ్ ఒక ముఖ్య కారణం. ఎలక్ట్రిక్ వాహనాలు , సోలార్ ప్యానెళ్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హార్డ్‌వేర్ రంగాల్లో వెండి వినియోగం విపరీతంగా పెరిగింది. సరఫరా కంటే డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వరుసగా నాలుగో ఏడాది కూడా వెండి లోటును ఎదుర్కొంటోంది. ఈ కారణంగానే ఈ ఏడాది వెండి ధర ప్రపంచవ్యాప్తంగా దాదాపు 158 శాతం పెరిగింది. మార్కెట్ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ బులియన్ ర్యాలీ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. 2026 ప్రథమార్థంలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్లకు, వెండి 90 డాలర్లకు చేరే అవకాశం ఉందని ఒవాండా సీనియర్ మార్కెట్ అనలిస్ట్ కెల్విన్ వాంగ్ అంచనా వేశారు. దేశీయంగా తులం బంగారం రూ.1,50,000, కిలో వెండి రూ.2,50,000 స్థాయిలను తాకే అవకాశం ఉందని అంచనా.

## ఉద్యోగుల సంక్షేమంపై సిఇఒ ఉదారత
# రూ.2155 కోట్లు సిబ్బందికి పంపిణీ



**లూసియానా, డిసెంబరు 26:** ఉద్యోగుల సంక్షేమానికి తన విశాల హృదయం చాటుకున్న సిఇఒపై ప్రపంచస్థాయిలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఫైబర్‌బాండ్ సిఇఒ గ్రాహం వాకర్ తాను స్థాపించిన కంపెనీని అమ్మిన తర్వాత వచ్చిన లాభాల్లో ఏకంగా 240 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 2,155 కోట్లు తన ఉద్యోగులకు పంచిపెట్టి ఆయన తన ఉదారతను చాటుకున్నారు. లూసియానాకు చెందిన గ్రహం వాకర్, ఎలక్ట్రికల్ పరికరాల కోసం ఎన్‌క్లోజర్‌లను తయారుచేసే ఫైబర్‌బాండ్ అనే తన కుటుంబ వ్యాపారాన్ని ఈటన్ కార్పొరేషన్‌కు 1.7 బిలియన్ డాలర్లకు అంటే సుమారు రూ. 15,265 కోట్లకు విక్రయించారు. ఈ ఒప్పందం కుదుర్చుకోవడానికి ముందే ఆయన ఒక ముఖ్యమైన షరతు పెట్టారు. కంపెనీ అమ్మకం ద్వారా వచ్చే మొత్తంలో 15 శాతాన్ని తన 540 మంది ఉద్యోగులకు చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ షరతుకు కొనుగోలుదారులు అంగీకరించడంతో ఒప్పందం ఖరారైంది. ఈ ఏడాది జూన్ నుంచి ఉద్యోగులకు చెల్లింపులు ప్రారంభమయ్యాయి. దీని ప్రకారం, ఒక్కో ఉద్యోగికి సగటున 4.43 లక్షల డాలర్లు మన కరెన్సీలో సుమారు రూ. 3.70 కోట్లు అందనున్నాయి. ఈ మొత్తాన్ని ఐదేళ్ల పాటు, వారు కంపెనీలో కొనసాగే ప్రాతిపదికన చెల్లిస్తారు. కష్టకాలంలో, ముఖ్యంగా 1998లో ఫ్యాక్టరీ కాలిపోయినప్పుడు, డాట్‌కామ్ సంక్షోభం సమయంలోనూ ఉద్యోగులు కంపెనీకి అండగా నిలిచారని, వారి విధేయతకు కృతజ్ఞతగా ఈ నిర్ణయం తీసుకున్నానని వాకర్ తెలి పారు. అనూహ్య బోనస్‌తో ఉద్యోగుల ఆనందా నికి అవధుల్లేకుండా పోయాయి. చాలామంది ఈ డబ్బుతో తమ అప్పులు, ఇంటి లోన్లు తీర్చుకున్నారు. మరికొందరు కార్లు కొనుగోలు చేయగా, తమ పిల్లల ఉన్నత విద్య కోసం, రిటైర్మెంట్ కోసం పొదుపు చేసుకుంటున్నారు. వాకర్ తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## అమ్మకాలు పెరిగినా 'జెప్టో'కు తప్పని నష్టాలు..
# ఐపిఒతో ఆర్థికపరిపుష్టికి కంపెనీ నిర్ణయం



**ముంబయి, డిసెంబరు 26:** క్విక్ కామర్స్ సంస్థ జెప్టో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్మ కాల్లో అద్భుతమైన వృద్ధిని సాధించినప్పటికీ, నష్టాలు భారీ స్థాయిలో పెరిగాయి. కంపెనీ నివేదికల ప్రకారం అమ్మకాలు రెట్టింపు కాగా, నష్టాలు అంతకుమించి పెరిగాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జెప్టో మొత్తం అమ్మకాలు రూ. 9,668.8 కోట్లుగా నమోదయ్యాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ. 4,223.9 కోట్లుగా ఉండగా, ఏకంగా 129 శాతం వృద్ధి కనిపించింది. అదే సమయంలో కంపెనీ నికర నష్టం 177 % పెరిగి రూ. 3,367.3 కోట్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ నష్టం రూ. 1,214.7 కోట్లు మాత్రమే. మార్కెట్లో పోటీ తీవ్రతరం కావడంతో కార్యకలాపాల విస్తరణ, కొత్త డార్క్ స్టోర్ల ఏర్పాటు, కస్టమర్లను ఆకర్షించడం కోసం భారీగా ఖర్చు చేయాల్సి రావడమే ఈ నష్టాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. టర్నోవర్‌తో పోలిస్తే నష్టాల వాటా 2024లో 29 శాతంగా ఉండగా, 2025 నాటికి అది 35 శాతానికి పెరిగింది. ఇలాంటి ఆర్థిక ఫలితాల నేపథ్యంలోనే జెప్టో పబ్లిక్ మార్కెట్లలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈరోజు ఐపీఓ కోసం రహస్యంగా ముసాయిదా పత్రాలను దాఖలు చేయనుందని సమాచారం. ఈ నెల 23న జరిగిన వాటాదారుల సమావేశంలో కంపెనీ వ్యవస్థాపకులు ఆదిత్య పాలిచా, కైవల్య వోహ్రా, సీఎఫ్ఓ రమేశ్ బఫ్నాలను పూర్తికాల డైరెక్టర్లుగా నియమిస్తూ బోర్డులో కీలక మార్పులు చేశారు.

### అగర్‌బత్తీలకు బిఐఎస్ బార్‌కోడ్ తప్పనిసరి: రసాయన వినియోగాలపై ఆంక్షలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 26:** వినియోగదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అగర్‌బత్తీలకు కేంద్రం కొత్తప్రమాణాలు జారీచేసింది. హానికర రసాయనాల వినియోగంపై నిషేధం ప్రకటించింది. వినియోగదారుల భద్రత, ఇండోర్ గాలి నాణ్యత పర్యావరణంపై ప్రభావంతోపాటు సువాసన సమ్మేళనాలు రసాయనాలపై అంతర్జా తీయంగా ఉన్న ఆంక్షలను దృష్టిలో పెట్టుకుని అగర్‌బత్తీలకోసం ఐఎస్ 19412ః 2025 ప్రమాణాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ బిఐఎస్ హాల్‌మార్క్ తప్పనిసరి చేసింది. దీనితో కొనుగోలుదారులు నమ్మకంతో కొంటారని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. అలెత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి రసా యనాలు వినియోగించడాన్ని కేంద్రం నిషేధిం చింది. బెంజైల్ సైనేడ్; ఇథైల్ అక్రిలేట్, డైఫి నైలమైన్ వంటి సింథటిక్ సుగంధ పదార్థాల విని యోగంపైనా ఆంక్షలు విధించింది. ప్రస్తుతం ఏటా రూ. 8వేలకోట్ల అగర్‌బత్తీలవ్యాపారంజరుగుతోంది. అమెరికా, మలేసియా, నైజీరియా, బ్రెజి ల్,మెక్సికోవంటి దేశాలకు రూ.1200 కోట్లకుపైగానే మన అగర్‌బత్తీ ఎగుమతులు జరుగుతున్నాయి.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

రాజమహేంద్రవరం | శనివారం 27 డిసెంబర్ 2025 | I


# ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే వనమాడి కొండబాబు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, డిసెంబర్ 26 (ప్రభాతవార్త ) :** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా కాకినాడ నగరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం జగన్నాధపురం ఎన్టీఆర్ నగర్ సర్వేపల్లి రాధాక ృష్ణ మున్సిపల్ స్కూల్ ప్రాంగణంలో 19, 20, 21, 22 డివిజన్లకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి జగన్నాధపురం అన్నమాఘాటి బాలయోగి మున్సిపల్ స్కూల్ ప్రాంగణంలో 23, 24, 25, 26 డివిజన్లకు సంబంధించిన ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో ఆయా డివిజన్లకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, "ప్రజల వద్దకే అధికారులతో వెళ్లి సమస్యలను విని, వాటిని పరిష్కరించడమే ప్రజా దర్బార్ ప్రధాన ఉద్దేశ్యం" అని, గత ప్రభుత్వంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించని అంశంపై అనేక అర్జీలు అందుతున్నాయని, ఈ సమస్యను ప్రభుత్వం ద ృష్టికి తీసుకెళ్లి ప్రతి కుటుంబానికి న్యాయం చేయడం జరుగుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాకినాడ నగరాన్ని గంజాయి రహిత, రౌడీల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే కొండబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కే. శ్రీనివాస్, డీఈ ఆదినారాయణ, కనకారావు, ఏసీపీ శ్రీధర్, టిపిఆర్ఓ శైలజ, కార్పొరేషన్ సెక్రటరీ లక్ష్మి, స్థానిక నాయకులు నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు...ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, డిసెంబర్26, (ప్రభాతవార్త).** అమలాపురం పట్టణంలోని ఎమ్మెల్యే ఆనందరావు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై సుమారు268 వినతులను ప్రజలు అందజేశారు. వాటిని పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే ఆనందరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డిసిఎంస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి,రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు కడలి వెంకటేశ్వరరావు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ,మాజీ మున్సిపల్ చైర్మన్ పెచ్చెట్టి విజయ లక్ష్మి, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకట లక్ష్మి,పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి,మాకిరెడ్డి పూర్ణిమ, నల్లా చిట్టి, మంద గెద్దయ్య, చింతా శంకరమూర్తి, కుంచె వెంకన్నబాబు, వాసురాజు అధికారులు పాల్గొన్నారు

## కోడి పందాలు, పేకాట స్థావరాలపై దాడి



**గోపాలపురం డిసెంబర్ 26, (ప్రభాతవార్త):**గోపాలపురం మండలంలో శుక్రవారం కోడి పందాలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోపాలపురం ప్రొబెషనరీ ఎస్ఐ పి.శివగణేష్, సిబ్బందితో కలిసి దొండపూడి గ్రామం, మేదరపేటలో కోడి పందాలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 2 కోడి పుంజులు, 2 కోడి కత్తులను సీజ్ చేసి రూ.5వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొవ్వూరుపాడు గ్రామంలోనూ పేకాట శిబిరంపై దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి పేక ముక్కలు, రూ.3 వేల నగదును సీజ్ చేశారు. గోపాలపురంమండలంలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పి మనోహర్ హెచ్చరించారు.

## నవీన్‌ను సత్కరించిన ఆర్యవైశ్య సేవాసంఘం



**గండేపల్లి డిసెంబర్ 26 (ప్రభాతవార్త):**జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ రెండోసారి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన శుభ సందర్భంగా గండేపల్లి ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్ ఆర్యవైశ్యులను గుర్తించి ఎప్పటికప్పుడు మాకు మంచి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) మండవిల్లి వెంకన్న బాబు, జల్లూరి ప్రదీప్,వాకచర్ల నాగేశ్వరరావు, మాతంశెట్టి రాము పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరూ ఆచరించాలి



**తుమ్మలపల్లి రమేష్‌గండేపల్లి డిసెంబర్ 26(ప్రభాతవార్త)** :క్రీస్తు బోధనలు ప్రతీ ఒక్కరూ ఆచరించాలని జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ సూచించారు.గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో రమేష్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.రమేష్ మాట్లాడుతూ యేసు జన్మించిన ఈ శుభదినం రోజున మీ కుటుంబంలో అందరికీ ఆరోగ్యం, ఆనందం కలగాలని కోరుకుంటూ, క్రీస్తు వల్ల మీకు దీర్ఘాయువు కలగాలని, మీరు మరింత సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూన్నామ్మని అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్ దారబల్ల సద్గురుమూర్తి యడల శివ,అక్కరబోయిన రాజు,దూది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతుల జోరు.క్రిస్మస్ వేడుకల హోరు.

**పి. గన్నవరం,డిసెంబర్ 26, (ప్రభాత వార్త)** తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం పి. గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కో కన్వీనర్లు మోకా ఆనంద సాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ నిర్వహించారు. వారు ముందుగా తెలుగుదేశం పార్టీ శ్రేణులు నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో పాల్గొని కేక్ కట్ చేశారు. అదేవిధంగా పాస్టర్లు సబ్బితి నాని, పుచ్చకాయల సత్యనారాయణ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా కో కన్వీనర్లు ఇద్దరు ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నిమ్మకాయల శేషు పార్టీ కార్యాలయానికి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శేషును కోకన్వీనర్లు ఆనంద సాగర్, డివిఎస్ అభినందించారు. అదేవిధంగా ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను తెలియజేసి అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

## జనసేన కార్యాలయంలో వంగవీటి వర్ధంతి



**పి. గన్నవరం,డిసెంబర్26, (ప్రభాత వార్త).**ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద దివంగత నేత వంగవీటి మోహన్ రంగ 37వ వర్ధంతిని. పురస్కరించుకుని కూటమి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రంగ చిత్రపటానికి పూలమాలలు వేసి,ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.నిర్భయంగా ప్రజల పక్షాన నిలబడి,అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడిగా వంగవీటి మోహన్ రంగ ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని నాయకులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం,సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే కూటమి ప్రభుత్వం లక్ష్యం

## ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ



**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, డిసెంబరు 26 (ప్రభాతవార్త) :** ప్రజాసేవే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బత్తుల బలరామక ృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాజానగరం మండలం స్థానిక కార్యాలయంలో ఉదయం నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాలు వంటి పలు సమస్యలపై ప్రజల వద్ద నుండి పలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధింత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ప్రమాణస్వీకారం చేసిన రోజు నుండి నేటి వరకు నిరంతరం ప్రజా సేవే లక్ష్యంగా ముందుకుసాగుతూ.. నియోజకవర్గ అభివ ృద్దే ధ్యేయంగా అహర్నిశలు క ృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆ క ృషికి ప్రతిఫలమే ఇటీవల వైద్య రంగాలని పెద్ద పీట వేస్తూ నియోజకవర్గంలో నూతనంగా 12 ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం రూ. 5.72 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆయన వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుండి రాష్ట్రస్థాయి నెట్ బాల్ టోర్నమెంట్

## 10వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ నెట్ బాల్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి



**రావులపాలెం, డిసెంబర్ 26, (ప్రభాతవార్త) :** రావులపాలెం మండలం వెదిరేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 27, 28వ తేదీల్లో దండు ఆకాష్ వర్మ మెమోరియల్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ టోర్నమెంట్ జరగనుంది. జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ 10వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ నెట్ బాల్ పోటీలను దివంగత నెట్ బాల్ క్రీడాకారుడు దండు ఆకాష్ వర్మ స్మారకంగా ఆయన తండ్రి మాజీ వైస్ ఎంపీపీ దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఈ పోటీలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభిస్తారు.వెదిరేశ్వరం హైస్కూల్ మైదానంలో పోటీల ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం రాష్ట్ర నెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కృష్ణారెడ్డి, కార్యదర్శి పి. శ్రీనివాసరావు, ట్రెజరర్ వీరు మహంకాళి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి అశోక్ రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి పురుషులు, మహిళలు జట్లు పాల్గొంటాయని రాష్ట్ర నెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి. శ్రీనివాసరావు తెలిపారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల క్రీడాకారులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు జనవరి 11 నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగే జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 350 మంది క్రీడాకారులు తరలిరాగా వారికి రావులపాలెం సి.ఆర్.సి, కాపు కళ్యాణ మండపం,వెదిరేశ్వరం హైస్కూళ్ళలో వసతి ఏర్పాటు చేసామని నిర్వాహకుడు దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ తెలిపారు. నెట్ బాల్ క్రిడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి ఎన్నో బహుమతులు సాధించిన దండు ఆకాష్ వర్మ గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. ఆయన స్మారకంగా తండ్రి సుబ్రహ్మణ్యవర్మ ఈ పోటీలను స్వగ్రామంలోనే నిర్వహించడం విశేషం.

# వాడపల్లి క్షేత్రంలో ధనుర్మాస మహోత్సవాలు...

## గ్రామోత్సవంలో ఊరేగుతున్న శ్రీ ఆండాళ్ అమ్మ వారు.

## ముక్కోటి ఏకాదశికి క్యూలైన్లు పర్యవేక్షిస్తున్న డిసి, నల్లం...





**ఆత్రేయపురం, డిసెంబర్, 26,(ప్రభాత వార్త)** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శుక్రవారంవేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేకువజామున మేల్కొలుపు గౌతమి గోదావరి నది జలాల సేకరణ, తిరుప్పావై పాశుర విన్నపం ఘనంగా జరిగాయి. అర్చకులు పాశుర విశేషాన్ని భక్తులకు వివరించారు.తొలుత శ్రీ వారికి అమ్మవారికి విశేష పూజలు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీ ధనుర్మాసం సందర్భంగా రెండవ శుక్రవారం శ్రీ ఆండాళ్ అమ్మ వారి గ్రామోత్సవ సేవ నిర్వహించారు. 31 న మంగళవారం జరిగే శ్రీ స్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు పనులను ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వహణధికారి నల్లం సూర్య చక్రధరరావు పర్యవే క్షించారు. వైకుంఠ ద్వార దర్శనం వచ్చిన ప్రతి ఒక్కరికి దర్శనం అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సాక్షాత్తు శ్రీ మహా విష్ణువు గరుడ వాహనదారుడై ముక్కోటి దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి రోజున శ్రీ స్వామివారిని దర్శించుకుంటారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు అందుకు తగ్గట్టుగా భక్తులు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అలాగే శ్రీకాకుళం, శాంతినగర్ చెందిన తాడూరి నరేంద్ర కుమార్, ఉషారాణి, దంపతులు వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 25,116/- వేలు విరాళంగా అందించారు వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్,లు స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.

## సి.పి.ఐ 101 వ ఆవిర్భావ దినోత్సవం




**గోపాలపురం, డిసెంబర్ 26( ప్రభాతవార్త ):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని 101 వ ఆవిర్భావ దినోత్సవాన్ని గోపాలపురం మండలం భీమోలులో పార్టీ నాయకులు ఆచంట సత్యనారాయణ పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చొరవ తీసుకుని పట్టాదారుల సమస్యను పరిష్కరించాలని ఇక్కడ పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని పార్టీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మల్లెపూడి రమేష్, వేములూరి పెద్ద కోవ్వాడియా, ఓరుగంటి వెంకటరావు, కాసాని రాంబాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి ఆశ్రమం పీఠాధిపతి జ్ఞానేశ్వరి మాతాజీ కన్నుమూత..

## శోక సంద్రంలో పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు





**ప్రత్తిపాడు,డిసెంబరు26( ప్రభాతవార్త)** ప్రత్తిపాడు మండలంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం శాంతి ఆశ్రమం పీఠాధిపతి జ్ఞానేశ్వరి మాతాజీ (95) శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకార స్వామి పరమపదించాక మాతాజీ ఆశ్రమం బాధ్యతలను స్వీకరించారు. వృద్ధాప్యం కారణంగానే మాతాజీ మృతి చెందారని ఆశ్రమ వర్గాలు తెలిపాయి. గురువారం శ్వాస తీసుకోవడంతో ఇబ్బంది పడడంతో ఆమెను కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఆమె భౌతికకాయాన్ని భక్తుల సందర్శనార్థం ఆశ్రమంలోని మాతాజీ మందిరంలో ఉంచారు. ఉత్తర పీఠాధిపతి వినమ్రానందవసరస్వతి, ఆశ్రమ వర్గాల ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఆధ్యాత్మిక గురువులు, స్వామీజీలు వస్తున్నందువల్ల శనివారం మాతాజీ అంతిమ సంస్కారాలు జరుగుతాయని ఆశ్రమ ప్రతినిధులు తెలిపారు.-- ప్రత్తిపాడు మండలం తోటపల్లి కొండల్లో ఆశ్రమం..ప్రత్తిపాడు మండలం తోటపల్లి కొండల్లో శాంతి ఆశ్రమాన్ని ఓంకార స్వామీజీ 1917 లో ఏర్పాటు చేశారు. వ్యక్తి శాంతి ద్వారా విశ్వశాంతి అనే నినాదంతో సర్వమత సామరస్యానికి ప్రతీకగా ఆశ్రమం నడుస్తోంది. అప్పట్లో స్వామీజీ విదేశాల్లోనూ పర్యటించి విశ్వశాంతి భావజాలాన్ని విస్తరింపజేశారు. పిఠాపురం, కాకినాడ, విశాఖపట్నం, ఊటీలోని కోటగిరిలో శాంతి ఆశ్రమాలు ఉన్నాయి. ఓంకార స్వామి పరమపదించాక 1982 నుంచి ఆశ్రమ బాధ్యతలు మాతా జ్ఞానేశ్వరి చేపట్టారు.-- శోక సంద్రంలో పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు.. శాంతి ఆశ్రమం మాతాజీ కన్నుమూశారని తెలియడంతో పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు శోకసంద్రంలో మునిగారు. ఆశ్రమం ద్వారా ఏళ్ల తరబడి ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

## అవసరాలకు అనుగుణంగా ఎరువులు సరఫరా చేయాలి.. కలెక్టర్ మహేష్ కుమార్.



**అమలాపురం కలక్టరేట్,డిసెంబర్ 26 (,ప్రభాతవార్త):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రైతులకు అవసరాలకు అనుగుణంగా పుష్కలంగా ఎరువులు సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వ్యవసాయ ఉద్యాన అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం వ్యవసాయ ఉద్యాన మార్కెపెడ్ అధికారులతో స్థానిక కలెక్టరేట్ నందు సమావేశం నిర్వహించి యూరియా ఎరువుల సరఫరా గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎక్కడా ఎరువుల కొరత అనే మాట వినపడకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.రబీ సీజన్‌లో వరి,అరటి పంటలకు యూరియా ఎరువు సక్రమ సరఫరాపై అధికారులకు దిశా నిర్దేశం చేసి ప్రసంగిస్తూ రైతుల అవసరాలను ద ృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఆ ప్రకారమే ఎరువులను సరఫరా చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా వరి,అరటి, మొక్కజొన్న పంటల విస్తీర్ణాలను యూరియా ఎరువుల అవసరతను గూర్చి మండల వ్యవసాయ అధికారుల ద్వారా ఆరా తీశారు.పంటల అభివ ృద్ధికి అత్యధిక దిగుబడులకు యూరియా ఎరువు కీలకమన్నారు. జిల్లాలో 202 5-26 రబీ సీజన్ అవసరాలకు అనుగుణంగా ప్రతి మాసం ఎరువులు సరఫరా కొనసాగు తోందన్నారు.ప్రారంభ నిల్వలు, యూరియా అందుబాటు పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు మార్క్ఫెడ్ అధికారి ఏడి మంజుల, జిల్లా ఉద్యాన అధికారి బివి రమణ ఎంఎఓ లు ఉద్యాన సిబ్బంది పాల్గొన్నారు

## ఎస్.అన్నవరం అభివృద్ధిపై యనమల వాస్తవాలు తెలుసుకోవాలి- ఎస్ అన్నవరం వైసీపీ నేతలు



**తుని, డిసెంబర్ 26,( ప్రభాతవార్త)** తుని మండలం ఎస్.అన్నవరం గ్రామంలో జరిగిన అభివృద్ధిపై టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడు వాస్తవాలు పూర్తిస్థాయిలో తెలుసుకుని మాట్లాడాలని ఎస్ అన్నవరం వైసీపీ నేతలు హితవు పలికారు. ఎస్.అన్నవరం వైసిపి కార్యాలయం వద్ద శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలు సకురు నాగేంద్ర నెహ్రూ, వంగలపూడి గోవిందబాబు, చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, వెలగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఎస్ అన్నవరం పంచాయతీలో గత కాంగ్రెస్ ప్రభుత్వం లోని, వైయస్సార్ ప్రభుత్వంలో దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో మాత్రమే అభివృద్ధి జరిగిందని, టీడీపీ పాలనలో చేసిందేమీ లేదని అన్నారు. టిడిపి ఆవిర్భావానికి ముందే 1980లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పడ్డ ఇందిరా కాలనీ యనమల మంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజాఎస్.అన్నవరం పంచాయతీ పరిధిలో రోడ్లు, డ్రైన్ లు వంటి మౌలిక వసతులనుపూర్తిస్థాయిలో కల్పించారన్నారు. 25 ఎకరాలలో సుమారు 1200 మందికి జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు ఇచ్చిన ఘనత దాడిశెట్టి రాజాకి దక్కుతుందన్నారు. పంచాయితీ పరిధిలో 160 మందికి మాత్రమే రామకృష్ణ కాలనీలో గత టిడిపి ప్రభుత్వంలో యనమల రామకృష్ణుడు పట్టాలిచ్చారన్నారు. ఎస్సీ కాలనీ, కొత్త సూరవరం తమ పాలనలోనే ఏర్పడ్డట్టు యనమల రామకృష్ణుడు చెప్పుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు కీర్తి రాఘవ, వంగలపూడి కాంతారావు, జమీలు,గంటా చక్రరావు, వేముల శివ, పైలరాజు పాల్గొన్నారు.

## ఆదిత్య లియో క్లబ్ బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ



**గండేపల్లి డిసెంబర్ 26(ప్రభాతవార్త):**ఆదిత్య యూనివర్సిటీ లియో క్లబ్ ఆధ్వర్యంలో సూరంపాలెం గ్రామంలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ (బాల్య వివాహాల నిర్మూలన) అవగాహన ర్యాలీ ని విజయవంతంగా నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు ప్రజలకు అవగాహన కల్పించడం, పిల్లల హక్కులు, విద్య, పరిరక్షణ అవసరాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన నినాదాలు చేశారు.ఈ కార్యక్రమాన్ని లియో కోఆర్డినేటర్ ఎన్. నరేష్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా. డి. కిషోర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డా. బి. వరప్రసాద్ పాల్గొన్నారు.

## వంగవీటికి ఘననివాళి



**కడియం, డిసెంబర్ 26 (ప్రభాతవార్త)** మండలంలోని జేగురుపాడు గ్రామంలో వేప చెట్టు సెంటర్ వద్ద ఉన్నటువంటి స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహానికి కడియం మండలం వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మరియు జేగురుపాడు సర్పంచ్ యాదాల సతీష్ చంద్ర స్టాలిన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ పేదవాడి గుండె చప్పుడు, ప్రజా నాయకుడు, జనంలో నుండి పుట్టిన నాయకుడు, జనం మెచ్చిన నాయకుడు అయినటువంటి స్వర్గీయ వంగవీటి మోహన రంగ 37వ వర్ధంతి సందర్భంగా ఆ మహా నాయకుడికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఆకుల సుధాకర్ ,మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి వీర శివాజీ, పుట్టబుజ్జి,బల్లఅన్నవరం, మోటుక మునియ్య, శాకా కిరణ్,మారిశెట్టి నాగన్న ,బుడ్డిగా లక్ష్మణరావు, కారింకి గోవిందు, అంగర రాజు ,నాగిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి వర్ధంతి



**పి.గన్నవరం, డిసెంబర్ 26, (ప్రభాత వార్తా)** పి.గన్నవరం మండలం అక్విడేక్ట్ దగ్గర రాష్ట్ర నాయకులు మాజీ మండల కన్వీనర్ అడ్డగళ్ల సాయిరాం అధ్యక్షతనలో దివంగత నేత వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీ నివాసర రావు,మాజీ ఎం ఎల్ ఏ. పాముల రాజేశ్వరిదేవి మందపాటి కిరణ్.ఈ కార్యక్రమం లో నాయకులు,కార్యకర్తలు, వైఎస్ఆర్ కుటుంబ సభ్యులు, రంగా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలుజరుపుకోవాలి.



**కడియం, డిసెంబర్ 26 (ప్రభాతవార్త)** అర్ధరాత్రి రోడ్డు మీద వేడుకలకు అనుమతులు లేవనీ, రాత్రి 10 గంటల తరువాత వాహనాలు మీద అత్యవసరం అయితేనే బయటకు రావాలనీ, మద్యం సేవించి /ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనములు నడుపరాదని, డిసెంబర్ 31వ తేది రాత్రివేళ గ్రామాలలో గస్తీ ముమ్మరంగా వుంటుందనీ కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు, ధవళేశ్వరం సిఐ గణేష్ లు పేర్కొన్నారు.యువత మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ, డీజేలు మందుగుండు సామాగ్రి పేల్చుటకు ఎటువంటి అనుమతి లేదనీ తెలిపారు.ద్విచక్ర వాహనాలకు సైలన్సర్ తీసివేసి అధిక శబ్దాలతో హోరెత్తిశీచడం, అతి వేగం తో రోడ్ల పై తిరగటం, వాహనములు నడుపుతూ విన్యాసాలు ప్రదర్శించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయన్నారు. పోలీస్ సూచనలను పాటించి నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో జాగ్రత్తగా జరుపుకోవాలనివారు కోరారు.

## గేదెల ఫారాల వద్ద భద్రతపై అవగాహన




**సీతానగరం, డిసెంబర్ 26, (ప్రభాత వార్త):** మండలంలోని ములకలంక గ్రామంలో ఇటీవల గేదెల ఫారాల వద్ద చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో సీఐ ఎస్.వి.వి. సత్యనారాయణమూర్తి అధ్యక్షతన, ఎస్సై డి.రామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఫారాల వద్ద సీసీ కెమెరాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గేదెల ఫారాల వద్ద నిర్వాహకులు కాపలా ఉండాలని, పోలీసుల గస్తీ కూడా నిరంతరం ఉంటుందన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం .....

## కాగ్ నివేదికపై స్పష్టతనివ్వాలి, జమ్మలమడక



**కాకినాడ రూరల్ ,డిశంబర్ 27(ప్రభాతవార్త) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర సంపదను కొందరికి దోచి పెట్టి ఆర్థిక విధ్వంసం స ృష్టిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆరోపించారు. శుక్రవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె ప్రభుత్వ దివాళాకోరు విధానాన్ని ఎండగట్టారు.రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరుగుతుందని కాగ్ పదే పదే చెబుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఇప్పటికైనా కాగ్ నివేదికపై స్పష్టత ఇవ్వాలన్నారు.గడచిన 8 నెలల్లో 163 శాతం ఆర్థిక లోటు కు చేరిందని కాగ్ నివేదిక ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యం కాదా అని అందుకు నిదర్శనమే కేంద్రం వాటాను రాష్ట్రం పై రుద్దిందని వెల్లడించారు. దీని ద్వారా రాష్ట్రంపై ఏడాదికి 4259 కోట్లు ఆర్థికభారం తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది లబ్ధిదారులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పటికైనా కుప్పలు తెప్పలుగా అప్పులు చేయడం మానుకుని ఆదాయం దృష్టి సారించాలని నాగమణి హితవు పలికారు.

## మాజీ చైర్మన్ ను కలసిన పల్లంరాజు



**మామిడికుదురు.డిసెంబర్ 26(ప్రభాతవార్త)** ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నామన రాంబాబు ను టీడీపీ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గంధం పల్లంరాజు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మగటపల్లిలో నామన స్వగృహంలో కలిసి పుష్ప గుచ్చం అందించి శాలువాతో సత్కరించారు.పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరం కలిసి సమిష్టిగా కృషి చేద్దామని పల్లంరాజు తో సహా పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా రాంబాబు సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు ఈలి శ్రీనివాస్, బొలిశెట్టి జగదీష్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**మామిడికుదురు.డిసెంబర్ 26(ప్రభాతవార్త)** మండల పరిధిలోని లూటుకుర్రు గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను సర్పంచ్, పి.గన్నవరం నియోజకవర్గం సర్పంచ్ ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు శుక్రవారం భూమిపూజ చేశారు.అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అడిగిన వెంటనే రోడ్డు అభివ ృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారని, ఆయనకు గ్రామ ప్రజల తరపున సర్పంచ్ తాతకాపు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి తాను కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట బ్రహ్మానందం,విళ్ల సుబ్బారావు,బోనం బాబు,పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, డిసెంబర్ 26, (ప్రభాతవార్త) :** ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజలు తమ ద ృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం మండలం రావులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 445 అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. సంబంధిత శాఖల అధికారులకు సదరు సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజల నుంచి అందిన సమస్యలను వెంటనే అధికారులు పరిష్కరించాలని, సమస్యలు పరిష్కారం కాకుంటే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలుసుకుని క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ చక్కని వేదిక అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం గ్రామాల అభివ ృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మట్టా సత్యదేవి, కూటమి నాయకులు పెచ్చెట్టి చిన్నారావు, మైగాపుల గురవయ్య, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## బస్టాండ్ ఆవరణలో సిమెంట్ ఫ్లాట్ ఫార్మ్ ఏర్పాటుకు కృషి

### ఎమ్మెల్యే బండారుకు ఆర్టీసీ అధికారుల వినతిపత్రం



**రావులపాలెం, డిసెంబర్ 26 (ప్రభాతవార్త):** ఆత్రేయపురం బస్‌స్టాండ్ ఆవరణలో సిమెంట్ ఫ్లాట్‌ఫార్మ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్టీసీ డిపో మేనేజర్ కుమార్ సూచనల మేరకు ఆర్టీసీ సిబ్బంది మైగాపుల గురవయ్య నాయుడు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కు వినతిపత్రం అందించారు. రావులపాడు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఈ వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రజా దర్బార్‌లో సమస్యను వివరించిన ఆర్టీసీ అధికారులు బస్‌స్టాండ్‌లో ప్రయాణికులకు తగిన సదుపాయాలు లేకపోవడంతో అసౌకర్యాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ బస్‌స్టాండ్‌ను పరిశీలించి, అవసరమైన సిమెంట్ ఫ్లాట్‌ఫార్మ్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఉత్తమ ప్రశంసా పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం,డిసెంబర్26,ప్రభాతవార్త.** అమలాపురం నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమములో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రశంస పత్రాలను అందజేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈ ప్రశంస పత్రాలను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి,రాష్ట్ర డైరెక్టర్లు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, కడలి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, పట్టణ టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ,కర్రి రామస్వామి,మాకిరెడ్డి పూరి?మ, నల్లా చిట్టి, మంద గెద్దయ్య, బడుగు సత్యనారాయణ,కుంచె వెంకన్నబాబు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## యనమల సమక్షంలో టిడిపిలో చేరికలు



**తుని, డిసెంబర్ 26,( ప్రభాతవార్త )** తుని మండలం ఎస్ అన్నవరం పంచాయతీ పరిధిలోని 20 కుటుంబాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే యనమల దివ్య సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. ఎస్ అన్నవరం పిఎసిఎస్ అధ్యక్షుడు పోలిశెట్టి రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ టిడిపి నేతలు కంకిపాటి రమణ,ఉగ్గిన శ్రీను, తుమ్మలపల్లి నాని పర్యవేక్షణలో చేరిన వ్యక్తులకు శుక్రవారం రాష్ట్ర టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య, టిడిపి సీనియర్ నేత యనమల రాజేష్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ సమిష్టిగా కష్టపడి పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో టిడిపి నేతలు చింతమనీడి అబ్బాయి, బోడాల జమీలు, అప్పన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం



**రామచంద్రపురం,డిసెంబర్26(ప్రభాతవార్త):**పట్టణ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయం శుక్రవారం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది.డివిజనల్ అధికారి అఖిల,డి.ఎస్.పి రఘువీర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.ఎస్సి/ఎస్టి కేసులు,వసతి గృహాల సమస్యలు,ట్రాఫిక్ ఇంకా డివిజన్ లో ఉన్న ఇతర సమస్యలపై చర్చించారు.మండల తాసిల్దార్లు,ఎంపీడీవోలు,డివిఎంసి నెంబర్లు,వసతి గృహ సంక్షేమ అధికారులు,సహాయ సాంఘిక సంక్షేమధికారి సమావేశంలో పాల్గొన్నారు...

## ఘనంగా వంగవీటి రంగాకు నివాళి



**యు.కొత్తపల్లి, డిసెంబర్ 26(ప్రభాతవార్త):**కాపు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొత్తపల్లిలో ఉన్న రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు రంగా విశిష్టతను, సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సానా నాగు, గుండా అప్పారావు, కొణమర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంగా వర్ధంతి



**ఆత్రేయపురం, డిసెంబర్, 26,(ప్రభాత వార్త)** స్వర్గీయ వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతి పురస్కరించుకొని,ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, (గబ్బర్ సింగ్)ఆత్మ కమిటీ డైరెక్టర్ ఏపుగంటి వెంకటేష్,లు పాల్గొని రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గబ్బర్ సింగ్ మాట్లాడుతూ పేద ప్రజల ఆషాజ్యోతిగా అందరికి ఆదర్శప్రాయుడని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపుగంటి సుబ్బారావు,ఏపు గంటి శ్రీను,సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, సాధనాల అమ్మిరాజు, సఖినాల వెంకట్రావు, ఏపు గంటి మునేశ్వరరావు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## చార్లెస్ బాబేజ్ జయంతి



**ఏలేశ్వరం, డిసెంబర్ 26 (ప్రభాత వార్త)** ఏలేశ్వరం పట్టణంలో మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ 234వ జయంతి ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక మార్స్ కంప్యూటర్స్ నిర్వహకులు అడపా దుర్గారావు, విద్యార్థులతో కలిసి చార్లెస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంప్యూటర్ను కనుగొని ప్రపంచానికి సాంకేతిక విద్యను అందించిన ఏకైక వ్యక్తి చార్లెస్ అన్నారు. కోరాడ రాజు, గోళ్ళ సతీష్, ఉడతల రమణారావు, మసిరపు అరుణ, జువ్విన రాజు, మండ రాజేష్, గొల్లపల్లి గంగాధర్, ఆలమూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.: ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, డిసెంబరు 26 (ప్రభాతవార్త) :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గంధం పల్లంరాజు శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు వారికి దుశ్శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జిల్లాలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

## త్యాగమూర్తిగా నిలిచిన జీసస్...ఎంఎల్ఏ బండారు



**కొత్తపేట, డిసెంబర్ 26,(ప్రభాతవార్త)** మానవుల పాపాలను పరిహారం చేసేందుకు క్రీస్తు సిలువపై త్యాగమూర్తిగా నిలిచారని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు ప్రజలందరికీ రక్షణ సంతోషం తీసుకొచ్చిన పండగే క్రిస్మస్ అని సత్యానందరావు అన్నారు నర్సిపూడి ఈతకోట కొత్తపేట వాడపాలెం గ్రామాల్లో గురువారం రాత్రి జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు ప్రపంచంలో ప్రజలందరూ సంఘటితమై జరుపుకునే పండుగ క్రిస్మస్ అని ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు కరుణ ప్రేమ క్షమాగుణం సమానత్వం శాంతిని ప్రబోధిస్తూ నీ వలెనే నీ పొరుగువానిని ప్రేమించమని ఏసు క్రీస్తు బోధించారని తెలిపారు క్రీస్తు బోధనలు ప్రపంచవ్యాప్తంగా మానవులందరినీ ఎంతగానో ప్రభావితం చేశాయని పాపులను రక్షించడం కోసం శిలువపై రక్తాన్ని చిందించారని తెలిపారు ఈ క్రిస్మస్ పర్వదినాన ఏసుప్రభువుని ఆరాధించడం ద్వారా శాంతి సౌఖ్యం లభిస్తాయని ఆయన అన్నారు తనను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును అనే ఏసుక్రీస్తు ప్రవచనం ఆచరణీయమన్నారు క్రిస్మస్ సందర్భంగా పాస్టర్లకు గౌరవ వేతనాలను ప్రభుత్వం అందించిందని తెలిపారు క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో 8,418 పాస్టర్లకు నెలకు రూ5000 చొప్పున 12 నెలలకు 60 వేల రూపాయలు ఒకేసారి అందించడం జరిగిందన్నారు కొత్తపేట బేతేలు మందిరం ప్రబోధకులు రె వ యదిద్య దేవదాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి క్రైస్తవ విశ్వాసులకు శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు గ్రామ సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కర్ రావు కంఠం శెట్టి శ్రీనివాస్ గనిశెట్టి వీరేష్ గ్రామ మాజీ సర్పంచ్ పల్లికొండ సుధా జానకి సుధీర్ తదితరులు పాల్గొన్నారు

## అణగారినన వర్గాల కోసం పోరాడిన ధీరుడు వంగవీటి రంగా..

### నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు మురళీ రాజు - పాలకొల్లు లో రంగా వర్ధంతి..



**ప్రత్తిపాడు,డిసెంబరు26( ప్రభాతవార్త)** ప్రజల హక్కుల కోసం,అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాడిన ధీరుడు, దివంగత నేత వంగవీటి మోహన రంగా అని ప్రతిపాడు నియోజకవర్గ వైసీపీ నేత, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎం ఎం ఆర్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళి క ృష్ణం రాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజవర్గం ఇంచార్జ్ గుడాల హరి గోపాల్ (గోపి) ఆధ్వర్యంలో మురళి రాజు వంగవీటి మోహన్ రంగా వర్ధంతి సందర్భంగా పాలకొల్లు పట్టణం లో రంగా విగ్రహానికి పూల మాలలు నివాళులర్పించారు. అనంతరం మురళి రాజు మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు, ధైర్యం, నిబద్ధతలకు ప్రతీకగా నిలిచిన నాయకుడు రంగా అన్నారు. అన్యాయానికి ఎదురు నిలిచి, ప్రజల పక్షాన నిస్వార్థంగా నిలబడిన రంగా త్యాగం ఎప్పటికీ మరువలేనిదన్నారు.ఈ కార్యక్రమంలో పాలకొల్లు వైసీపీ పట్టణ అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాధువు ఔదార్యం



**కె గంగవరం, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):** గంగవరం గ్రామంలో వేంచేసి ఉన్నటువంటి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయానికి మామిడి జోగయ్య అనే సాధువు వాటర్ కూలర్ ను బహూకరించారు. సమీప దేవాలయాల వద్ద యాచకునిగా చేస్తూ వచ్చిన సొమ్ములో కొంత భాగాన్ని తో (సుమారు 15 వేల రూపాయలు విలువగల) వాటర్ కూలర్, స్టాండ్ సమకూర్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన మహిళలకు జాకెట్ ముక్కలు అందజేసినారు. ఆయనను ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్



**కాకినాడ రూరల్, డిసెంబర్ 26 (ప్రభాతవార్త):** ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించడమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ఆదేశాల మేరకు శుక్రవారం నిర్వహించిన 36వ వారం ప్రజా దర్బార్‌కు పెద్ద సంఖ్యలో కాకినాడ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఇల్లు పట్టాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పెన్షన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, సీఎంఆర్‌ఎఫ్, చంద్రన్న బీమా తదితర సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేశారు.పెద్దాపురం నియోజవర్గం, పెద్దాపురం మండలం జి. రాగంపేట గ్రామంలోని భాస్కర కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ప్రజా దర్బార్‌కు హాజరై, దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన భూమిలో నివసిస్తున్న తమకు ఇల్లు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మేకా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపించి, పరిష్కార దిశగా కార్యాలయ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఇల్లు పట్టాల సమస్యను అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని,ఈ వారం ప్రజా దర్బార్‌లో మొత్తం 20 అర్జీలు స్వీకరించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జున్నూరు బాబ్జి, సిరియాల కొండబాబు, కామాడి దశరథ్, చీకట్ల వెంకటేష్, బంగారు రాజు, గౌరీ శంకర్, డీఆర్‌యూసీసీ సభ్యులు ముత్యాల అనిల్, ఐటీడీపీ పాలిక సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రంగా ఆశయాసాధనకు యువత కృషి చేయాలి



**శంఖవరం, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):** రంగా ఆశయ సాధనకు యువత కృషి చేయాలని రంగా యూత్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శంఖవరం మండలం కత్తిపూడి కాంప్లెక్స్ వద్ద గల రంగా విగ్రహం వద్ద రంగా వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన నేత వంగవీటిని, ప్రజల కోసం పోరాడిన నాయకుడని రంగా సేవలు ఎప్పటికీ ప్రజలు హృదయాల్లో నిలిచి ఉంటాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రౌతు శివ గాబు సూరిబాబు ఓరుగంటి శివ, గాబు రాజా గౌతు రాజేష్ తదితరులు పాల్గొన్నారు

## రంగా ,జక్కంపూడి వర్ధంతి



అమలాపురం, డిసెంబర్26, ప్రభాతవార్త స్థానిక నల్ల వంతెన వద్ద స్వర్గీయ వంగవీటి మోహన్ రంగా,జక్కంపూడి నాగేశ్వర రావు, వర్ధంతి కార్యక్రమం జక్కంపూడి కిరణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు,మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి,మాజీ ఎంపీ చింతా అనురాధ ముఖ్యఅతిథితులుగా పాల్గొన్నారు.మొదటిగా వంగవీటి,జక్కంపూడి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం జక్కంపూడి కిరణ్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా హాస్పిటల్ లో రోగులకు పాలు, పళ్ళు పంచారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి పందిరి హరిబాబు నక్కా చంద్రశేఖర్, మట్టపర్తి నాగేంద్ర , వంటెద్దు వెంకన్న నాయుడు, కూడిపూడి భరత్ భూషణ్,షేక్ అబ్దుల్ ఖాదర్,చిక్కాల రవిశంకర్, సుంకర స్వామి నాయుడు, చిక్కం సూరిబాబు, నక్కా సంపత్, మంగళంపల్లి అంజిబాబు మెండకుదిటి శిరీష్, సుధా గణపతి,మద్దింశెట్టి ప్రసాద్, విత్తనాల మూర్తి మామిడిపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పలుచోట్ల రంగ వర్ధంతి



**కె.గంగవరం, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):** మండలంలోని కుందూరు, పాతకోట ,సత్యవాడ, పామర్రు,మసకపల్లి, బ్రహ్మపురి, కోటిపల్లి, దంగేరు పలు గ్రామాల్లో స్వర్గీయ వంగవీటి మోహన రంగ 37వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు భారీ గజమాలతో సత్కరించి నివాళులర్పించారు. పేద ప్రజల బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, ఆపద వస్తే ఆదుకునే మహనీయుడని, కోస్తా xn జిల్లాల్లోనే అనేక విగ్రహాలు ఉన్నాయంటే కేవలం తను చేసిన సేవా కార్యక్రమాలు కారణమని పలువురు కొనియాడారు. సత్యవాడ గ్రామంలో సొసైటీ అధ్యక్షులు సలాది సీతారాం, రంగా అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు.

## సంచలన నాయకుడు రంగా : కొత్తపేట ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, డిసెంబర్ 26,(ప్రభాతవార్త)** పేదల పెన్నిధిగా అన్ని వర్గాలకు నేనున్నానని అండగా నిల్చిన నేత సంచలన నాయకుడు వంగవీటి మోహన రంగా అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు శుక్రవారం వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా వాడపాలెంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు రంగా పేరు చెబితేనే వైబ్రేషన్స్ వస్తాయన్నారు నాడు రంగా ప్రజలకు చేసిన సేవలకుగాను గతించి సుమారు నాలుగు దశాబ్దాలు గడిచినా ఈనాటికి ప్రజల హ ృదయాల్లో చిరస్థాయిగా ఉన్నారని కొనియాడారు విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగే క్రమంలో దుష్టశక్తుల చేతుల్లో అశువులు బాశారని అవేదన వ్యక్తం చేశారు రంగా జీవించి ఉంటే రాజకీయాల్లో ఉన్నతస్థానానికి ఎదిగేవారని రాష్ట్రానికి సేవలు అందించేవారని పేర్కొన్నారు ఆయనకు ఆత్మశాంతి లభించాలన్నారు వంగవీటి మోహన రంగా ఆయన కుమారుడు రాధా లతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు ప్రజలందరూ ఆయన ఆశయ సాధనకు క ృషి చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో బండారు బులితాత కంఠం శెట్టి శ్రీనివాసరావు బండారు వీరబాబు, గని శెట్టి వీరేష్ కడియం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు

## క్రీస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సుభాష్



**కె గంగవరం, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):** లోక రక్షకుడు, ప్రభువైన యేసు క్రీస్తు ,భోదనలు అనుసరణీయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం కె గంగవరంలో క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ కాపరులు, సంఘ పెద్దలు మంత్రి సుభాష్ కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ యేసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, కరుణ, సహనాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజహితానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రక్షణార్థం ఏసుక్రీస్తు జన్మించారని, ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఆనందంగా క్రీస్మస్ జరుపుకోవడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల పాస్టర్లు, సంఘ పెద్దలు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రీస్తు జననాన్ని స్మరిస్తూ పిల్లలు ప్రదర్శించిన నాటికలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వఛ్ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, జనసేన మండల అధ్యక్షులు చిర్రా రాజకుమార్,సంపత్ సత్యనారాయణ, పాస్టర్ జకర్యా పలువురు కూటమి పార్టీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

## మోహన్ రంగాను ఆదర్శంగా తీసుకోవాలి..



**అంబాజీపేట, డిసెంబర్ 26, (ప్రభాతవార్త):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అలుపెరగని ప్రజా పోరాటంలో అసువులు బాసిన పోరాట యోధుడు వంగవీటి మోహనరంగాను నేటితరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకుని, పేదల పాలిట పెన్నిధిగా నిలిచిన మోహనరంగా ఆదర్శనీయుడని పలువురు నాయకులు అన్నారు. వంగవీటి రంగా 37వ వర్ధంతిని అంబాజీపేటలో మండలంలో శుక్రవారం నిర్వహించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి పలు పార్టీల నాయకులు,అభిమానులు, యువకులు పూలమాలలు వేసి,నివాళ్ళర్పించారు. మాచవరంలో కాపు యువత ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మోహన్ రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మాచవరం సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి,నియోజవర్గ టిడిపి కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాచవరపు శివన్నారాయణ, కూటమి నాయకులు కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ,గూడాల ఫణి, వీరా సతీష్,యనమదల రాజబాబు,నాగాబత్తుల వెంకట సుబ్బారావు,ఉందుర్తి నాగబాబు,కొప్పినీడి ఈశ్వరరావు,పడుచూరి సుబ్బారావు, పెచ్చెట్టి చినబాబు,కొర్లపాటి నాని తదితరులు పాల్గొన్నారు.

## వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి..

### డీఈఓ నాగేశ్వరరావు..



**అంబాజీపేట,డిసెంబర్ 26,(ప్రభాతవార్త):** పదవ తరగతి పరీక్షలో నూరు శాతం ఉత్తీర్ణత సాధనలో భాగంగా వందరోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి పి నాగేశ్వరరావు అన్నారు.అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాను విద్యా పరంగా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపే బాధ్యత ఆయా మండలాల ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులదేనఅన్నారు. గత ఏడాది పది పరీక్షలకు సంబంధించి రాష్ట్రంలో జిల్లా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. రాబోవు పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థాయిలో నిలపాలన్నారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థులకు ఈ నెల 6 నుంచి ప్రారంభమైన వంద రోజుల ప్రణాళిక, కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించామన్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలన్నారు. విద్యలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిని ఉత్తమ విద్యార్థిగా మారేలా చూడాలన్నారు. ప్రతీ రోజు సబ్జెక్ట్ వారీగా ప్రశ్నపత్రాలను నిర్వహించి, అదే రోజున మూల్యాంకనం చేసి వాటి ఫలితాల ఆధారంగా ఆన్లైన్ చేయాలన్నారు. పాఠశాలకు హజరుకాని పదవ తరగతి విద్యార్థులను గుర్తించి వారి తల్లితండ్రులతో చర్చించి పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. వంద రోజుల ప్రణాళికల్లో ఆ విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. అంతకుముందు తొలుత సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల పనితీరుని సమీక్షించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ ఇంచార్జ్ డీవైఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సేవాభావంతో....అనారోగ్య విద్యార్థులకు వితరణ



**అమలాపురం,డిసెంబర్26,ప్రభాతవార్త** అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ లో పదవతరగతి చదువుతున్న ఎలుమార్తి నీరాజ్,న్యూమోనియా వ్యాధితో బాధపడుతూ కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు.దీంతో స్పందించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి 30 వేల రూపాయలను సమకూర్చారు. ఈ సహాయంను నీరజ్ తల్లితండ్రు లకు అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధ పడుతున్న మరొక 10వ తరగతి విద్యార్థి మల్లాడి. విష్ణు ప్రసాద్ కు పదిహేను వేల రూపాయలను సమకూర్చి విష్ణుప్రసాద్ తల్లితండ్రులకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖధికారి పి నాగేశ్వరరావు చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా పాటశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఇఓ పాల్గొని వితరణ చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయుల సేవాభావంను అభినందించారు. విద్యార్థులు తొందరగా కోలుకోవాలని,పబ్లిక్ పరీక్షలుకు సన్నద్ధం కావాలని వారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కె.ఘన సత్యనారాయణ,టీచర్లు బివిఎన్ వెంకటేశ్వరరావు,ఆర్ శ్రీనివాస రావు,పిహెచ్ వర్మ,ఎంఎస్డి భవాని,కెఆరెఎన్ ప్రసాద్, కెవిపి సత్యనారాయణ,మట్టపర్తి శ్రీనివాస్,కర్రా శ్రీనివాసరావు,కట్టా శ్రీనివాసరావు,బికె అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రజా సమస్యపై శ్రద్ధగా.. వింటూ..-- ప్రజా దర్బార్లో ఎమ్మెల్యే సత్య ప్రభ..--

### నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు..



**ప్రత్తిపాడు,డిసెంబరు26,ప్రభాతవార్త)** చిన్న చిన్న సమస్యలతో ఎమ్మెల్యే సత్య ప్రభ శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కు నియోజకవర్గ నలుమూలల నుండి ప్రజలు పలు సమస్యలపై అర్జీలు తో పెదశంకర్లపూడి కార్యాలయం విచ్చేసిన ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే ప్రజా సమస్యలను శ్రద్ధగా వింటూ చాలావరకు అక్కడికక్కడే సంబంధితఅధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు ప్రభుత్వం ద్వారా కలిగే అసౌకర్యం కు తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తానన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించడం ప్రధాన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే వెంట యాళ్ల జగదీష్, కార్యాలయం సిబ్బంది, కూటమి నాయకులు, శ్రేణులు తదితరులున్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps